# మనం

/manamnews
www.manamnews.com

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
ఆదివారం
24-09-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 235
పేజీలు : 12

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


భాద్రపద మాసం, ఆదివారం, తిథి : నవమి ఉ.10.23 వరకు, నక్షత్రం: పూర్వాషాఢ, మ:01.41 వరకు, వర్జ్యం: సా.09.06-10.35 వరకు, దుర్ముహూర్తం: సా.04.31-05.19 వరకు, రాహుకాలం: మ.04.37-06.07 వరకు



జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల

# అభిప్రాయాలను స్వీకరిస్తాం

పార్టీలు,లా కమిషన్ అభిప్రాయాలు తీసుకుంటాం

మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ వెల్లడి

జమిలి కమిటీ తొలి భేటీలో కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 :** జమిలి ఎన్నికలపై ఏర్పాటైన కమిటీ తొలి సమావేశంలోనే కీలక నిర్ణయాలు తీసుకుంది. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల అభిప్రాయలను స్వీకరిస్తామని చెప్పింది. దీంతో పాటు లా కమిషన్ సలహాలను సైతం తీసుకుంటామని స్పష్టం చేసింది. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ.. శనివారం తొలిసారిగా సమావేశమైంది. ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే వర్చువల్‌గా హాజరు కాగా.. కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి హాజరు కాలేదని ..మిగతా 2లో

# కొత్త పార్లమెంట్ మోడీ మల్టీప్లెక్స్



చట్టసభల్లో చర్చలు కనుమరుగైనట్టుగా అనిపిస్తోంది

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

ఇది భారతీయులను అవమానించడమే

జైరాం రమేశ్ విమర్శలకు బీజేపీ కౌంటర్

అది రాష్ట్రపతిని అవమానించడమే..

కాంగ్రెస్ అలాంటిది కాదు

బీజేపీపై ఖర్గే ఫైర్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 :** నూతన పార్లమెంట్ మోడీ మల్టీప్లెక్స్ అని కాంగ్రెస్ విమర్శించింది. నూతన భవనంలో చర్చలు కనుమరుగయ్యాయని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ట్విటర్ వేదికగా ఆరోపించారు. కొత్త పార్లమెంట్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన సమావేశాలను ప్రస్తావిస్తూ ఆయన చేసిన ఈ వ్యాఖ్యలకు బీజేపీ గట్టి కౌంటర్ ఇచ్చింది. 'నూతన పార్లమెంట్ మోడీ మల్టీప్లెక్స్ లేదా మారియట్. కొత్త భవనంలో నాలుగు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో చాలా విషయాలను గమనించా. ఈ భవనం ప్రధాని మోడీ లక్ష్యాలను చాలా బాగా అర్థం చేసుకోగలిగింది. చట్టసభల్లో చర్చలు కనుమరుగైనట్టుగా ..మిగతా 2లో



## కులగణన అంటే మోడీకి భయం

ఓబీసీలను అవమానపర్చవద్దు

వారిని మోసగించవద్దు

ఓబీసీ మహిళలకు కూడా లబ్ధి చేకూరాలని కోరుతున్నాం

రాహుల్ గాంధీ 2



# గ్రూప్-1 రద్దు

## అభ్యర్థుల్లో గుబులు!

ఇంతకుముందే ఓసారి రద్దయిన ప్రిలిమ్స్..

రెండోసారి నిర్వహించిన పరీక్షను రద్దు చేసిన హైకోర్టు

ఈ పరీక్షకు హాజరైన అభ్యర్థులు 2.33లక్షలకుపైనే..

ఇప్పుడు వారందరిలో తీవ్ర గందరగోళం

ఏళ్ల సమయం, పుస్తకాలు, శిక్షణ ఖర్చు అంతా వృథా అంటూ ఆవేదన

మళ్లీ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారోననే ఆందోళన

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మనం న్యూస్):** ఈ ఏడాది జూన్ 11న నిర్వహించిన గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్షను హైకోర్టు రద్దుచేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీని ఆదేశించింది. మొత్తం 503 గ్రూప్ 1 పోస్టుల భర్తీ కోసం జూన్ 11న నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 2.32 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. అయితే పరీక్షలో బయోమెట్రిక్ వివరాలు తీసుకోలేదని, హాల్ టికెట్ నంబర్ లేకుండా ఓఎంఆర్ షీట్లు ఇచ్చారని పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. పరీక్షను రద్దు చేయాలని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అభ్యర్థుల పిటిషన్లను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం పరీక్షను రద్దుచేస్తూ తీర్పు వెలువరించింది. పరీక్షను మళ్లీ నిర్వహించాలని ..మిగతా 2లో

గ్రూప్-1 పరీక్షలు వాయిదా

## దురదృష్టకరం

సీఎం కేసీఆర్ ప్రభుత్వ అసమర్థ ప్రజాపాలన

సరైన నిర్ణయాలు తీసుకోవడంలో వైఫల్యం

కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి



2

పేపర్లు లీక్ చేసి రూ.వేల కోట్లకు

## అమ్ముకున్నారు!



30 లక్షల మంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టిన కేసీఆర్

సీఎం కేసీఆర్‌పై ప్రవీణ్ కుమార్ ధ్వజం 2



క్రీడాకారులకు ఇది ఎంతో

# ప్రయోజనం

రూ.450 కోట్ల వ్యయంతో

30 ఎకరాల విస్తీర్ణంలో ప్రాజెక్టు నిర్మాణం

కాశీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

'మహదేవ్ 'కు అంకితం : ప్రధాని మోడీ

వివరాలు.. 2లో





## అటల్ అవాసీయ విద్యాలయాస్ స్కూళ్లు ప్రారంభం

అనాథ పిల్లల కోసం 16 స్కూళ్లను ప్రారంభించిన ప్రధాని

కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



## భారత్‌ను రెచ్చగొట్టడం మా ఉద్దేశం కాదు

ఖలిస్థానీ నేత హత్య వెనుక భారత్ ఏజెంట్ల పాత్ర..

ఆ విషయాన్ని భారత్‌కు అప్పుడే చెప్పాం

భారత్ మాకు సహకరిస్తారని ఆశిస్తున్నాం

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కీలక వ్యాఖ్యలు 2



## ఖలిస్థానీ తీవ్రవాది ఆస్తులు సీజ్

కెనడాలోని హిందువులకు వార్నింగ్ ఇచ్చిన వేర్పాటు వాది

గుర్‌పత్వంత్ సింగ్ పన్నూకు షాక్ ఇచ్చిన భారత్

ప్రస్తుత పరిణామం మరింత బలం చేకూరుస్తోంది: ఎన్ఐఏ 2

**మంచిమాట**

నీవు బ్రతికుండేది కేవలం ఈ రోజు మాత్రమే అన్నట్లు..
నీ కర్తవ్యాన్ని నిర్వహించు
ఫలితాన్ని మాత్రం భగవంతునికి వదిలివేయి అప్పుడు
ప్రపంచంలోని ఏ బాధా మీ దరి చేరదు !!

**శుభోదయం**

షెడ్యూల్ ప్రకారమే తెలంగాణ

# అసెంబ్లీ ఎన్నికలు



2

అక్టోబర్ 3, 4, 5 తేదీల్లో కేంద్ర ఎన్నికల బృందం పర్యటన

రాష్ట్రంలో కొత్తగా 15లక్షల మంది ఓటర్ల చేరిక

6.99 లక్షల యువ ఓటర్లను నమోదు

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ వెల్లడి

## క్యూఆర్ కోడ్ బందోబస్త్



ప్రతి గణేష్ మండపానికి జియో ట్యాగింగ్

రూట్ మ్యాప్, చెరువులు, ట్రాఫిక్ రద్దీ అన్నీ నిక్షిప్తం

నిరంతరం నిమజ్జనం తీరు పర్యవేక్షణ

ఆకతాయిలపై నిఘా కోసం రంగంలోకి షీ టీమ్స్ 8



మల్కాజిగిరి నుంచే

## పోటీ చేస్తా..

కార్యకర్తల కోసం ప్రాణత్యాగానికి సిద్ధమే

కావాలనే సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు 8

# మా కోటా మాకివ్వాల్సిందే

కాంగ్రెస్ బీసీ నేతల డిమాండ్

గళాన్ని వినిపించేందుకు నేడు గాంధీభవన్లో సమావేశం

హాజరు కానున్న వీహెచ్, పొన్నాల, యాష్కీ, మహేశ్‌గౌడ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మనం న్యూస్):** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో తమకు తగిన ప్రాధాన్యమివ్వాల్సిందేనని కాంగ్రెస్ బీసీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. మరోమారు తమ గళాన్ని వినిపించేందుకు ఆదివారం కాంగ్రెస్ బీసీ నేతలు గాంధీభవన్లో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి పార్టీ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, మధుయాష్కీగౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, మహేశ్కుమార్‌గౌడ్, సురేశ్ షట్కార్, పొన్నం ప్రభాకర్, కొండా మురళీ, సురేఖ, ఎర్రశేఖర్ తదితరులు హాజరవుతారని ఏఐసీసీ ఓబీసీ విభాగం జాతీయ సమన్వయకర్త కత్తి వెంకటస్వామి శనివారం విలేకరులకు తెలిపారు. ఈసారి ఎన్నికల్లో లోక్‌సభ నియోజకవర్గానికి రెండు స్థానాలు చొప్పున 34 అసెంబ్లీ స్థానాలను బీసీలకు కేటాయించే అవకాశముందని తెలుస్తోంది. ఇందుకోసం బీసీ నేతల జాబితాను ..మిగతా 8లో



## అట్టహాసంగా ఆసియా క్రీడలు ప్రారంభం

వివరాలు.. స్పోర్ట్స్‌లో



వచ్చే ఎన్నికల్లో బీజేపీని

## ఆశీర్వదించండి

అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తాం

ఎంఎల్ఏ ఈటెల రాజేందర్ 5

అధికార లాంఛనాలతో

## హరీశ్వర్‌రెడ్డి అంత్యక్రియలు



2

కొప్పుల హరీశ్వర్ రెడ్డి మృతికి మంత్రి కేటీఆర్ సంతాపం

# కొత్త పార్లమెంట్ మోడీ మల్టీప్లెక్స్

(మొదటిపేజీ తరువాయి)

అనిపిస్తోంది. పార్లమెంట్ ఆవరణలో కూడా ఇదే కొనసాగుతోంది. రాజ్యాంగంలో ఎలాంటి సవరణలు చేయకుండానే ప్రధాని విజయం సాధించారు. అని విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆయన పాత పార్లమెంట్‌ను గుర్తు చేసుకున్నారు. పాత పార్లమెంట్‌లో ప్రతిసభ్యుడితో చర్చలు జరిపే అవకాశం ఉండేదని అన్నారు. ప్రస్తుతం సభ్యులను చూసేందుకు బైనాక్యులర్ అవసరం ఉంటుందేమో అంటూ కేంద్రంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇవి సమావేశాలను చర్చలను బలహీన పరుస్తాయని ఆరోపించారు. గతంలో సెంట్రల్‌హాల్, కారిడార్లలో నడిచేందుకు వీలుండేదని, ఇక్కడ చాలా ఇరుకుగా ఉన్నట్టు అనిపిస్తోందని అన్నారు. మళ్లీ పాత పార్లమెంట్ వెళ్లేందుకు ఎదురుచూస్తుంటాను అని జైరామ్ రమేశ్ అన్నారు.

**ఇది భారతీయులను అవమానించడమే : బీజేపీ**

జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఈ అంశంపై బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా స్పందించారు. 'కాంగ్రెస్ పాటించే అత్యల్ప ప్రమాణాల్లో ఇదీ ఒకటి. ఈ చర్య ద్వారా కాంగ్రెస్ 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను అవమానిస్తోంది. పార్లమెంట్‌కు వ్యతిరేకంగా మాట్లాడడం ఆ పార్టీకి ఇది మొదటిసారి కాదు. గతం లోనూ ఈ విధంగా మాట్లాడి విమర్శల పాలైంది' అని కాంగ్రెస్‌కు కౌంటర్ ఇచ్చారు.

**అది రాష్ట్రపతిని అవమానించడమే.. : ఖర్గే**

పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవానికి కేంద్రం.. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకపోవడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. సినీ తారలను ఆహ్వానించిన బీజేపీ ప్రభుత్వం.. రాష్ట్రపతిని విస్మరించడం ఆ హోదాను.. ఆ హోదాలో ఉన్న ఆమెను అవమానించినట్లేనని మండిపడ్డారు. శనివారం రాజస్థాన్ జైపూర్లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన భవనం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఓ కార్యక్రమంలో ఖర్గేతో పాటు రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ ఈవెంట్లో ఖర్గే మాట్లాడుతూ.. ''భారత రాజ్యాంగాన్ని అనుసరించి.. అత్యున్నత హోదాలో ఉన్న ఓ వ్యక్తిని ఇలా అవమానించడం దారుణం. పార్లమెంట్ ప్రారంభం అయితే రాష్ట్రపతిని ఆహ్వానించకుండా.. సినీ తారలను ఆహ్వానిస్తారా. ఇది రాష్ట్రపతిని అవమానించడమే. కాంగ్రెస్లో అన్ని కమ్యూనిటీలకు ప్రాధాన్యం ఉంటుంది. కానీ, బీజేపీ ఎవరినీ దగ్గరకు రానివ్వదు అని ఖర్గే అన్నారు. అంతేకాదు.. గతంలో రామ్ నాథ్ కోవిందు్న సైతం పార్లమెంట్ భవన శంకుస్థాపన కార్యక్రమానికి బీజేపీ ఆహ్వానించలేదనే విషయాన్ని ఖర్గే ప్రస్తావించారు. అది అంటరానితనమే అవుతుందన్నారు. ఒకవేళ అంటరాని వాడిగా భావించే వ్యక్తితో శంకుస్థాపన జరిపించినా.. సహజనంగానే వాళ్లు గంగాజలంతో శుద్ధి కార్యక్రమం నిర్వహించేవాళ్లేమో అని ఖర్గే బీజేపీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశం బీజేపీ ప్రభుత్వానికి లేనేలేదని ఖర్గే అన్నారు. కేవలం ఇండియా కూటమికి భయపడే రిజర్వేషన్ అంశం.. అదీ ఎన్నికల ముందర బీజేపీ తెచ్చిందని విమర్శించారాయన.

# ఖలిస్థానీ తీవ్రవాది ఆస్తులు సీజ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 : కెనడా-భారత్‌లో మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నవేళ.. కెనడాలోని హిందువులకు వార్నింగ్ ఇచ్చిన వేర్పాటు వాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూకు భారత ప్రభుత్వం షాక్ ఇచ్చింది. పంజాబ్‌లోని అతడి ఇల్లు, భూమిని జాతీయ దర్యాప్తు సంస్థ స్వాధీనం చేసుకుంది. అమృత్‌సర్ శివారులోని పన్నూ పూర్వీకుల గ్రామమైన ఖాంకోట్లో ఉన్న దాదాపు ఆరు ఎకరాల భూమిని, చండీగఢ్‌లోని ఇంటిని దర్యాప్తు సంస్థ స్వాధీనం చేసుకుంది. ప్రస్తుత చర్యతో అతడు తన ఆస్తులపై హక్కుల్ని కోల్పోయాడు. ప్రస్తుతం వాటిని ప్రభుత్వ ఆస్తులుగా పరిగణిస్తారు. 2020లో దర్యాప్తు సంస్థలు అతడి ఆస్తుల్ని అటాచ్ చేశాయి. అతడు విక్రయించడానికి వీల్లేదని దానర్థం. వివిధ దేశాల నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోన్న వేర్పాటువాద సంస్థలపై తీసుకుంటోన్న చర్యలకు ప్రస్తుత పరిణామం మరింత బలం చేకూరుస్తోందని ఎన్ఐఎ తన ప్రకటనలో పేర్కొంది. సిఖ్ ఫర్జస్టిస్ (ఎస్ఎఫ్‌జె) అనే వేర్పాటు వాద సంస్థను భారత్ 2019లోనే నిషేధించింది. 2007లో ఈ సంస్థను స్థాపించగా, వ్యవస్థాపకుల్లో గురుపత్వంత్ సింగ్ పన్ను కూడా ఒకడు. చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం కింద భారత ప్రభుత్వం అతడిని 2020లో ఉగ్రవాదిగా ప్రకటించింది. తాజాగా కెనడాలో జరుగుతోన్న పరిణామాలపై పన్నూ స్పందించారు. కెనడా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఇండో కెనడియన్ హిందువులు వ్యవహరిస్తున్నారని ఆరోపించిన అతడు, అటువంటి వారు తిరిగి భారత్ వెళ్లిపోవాలని బెదిరించాడు. పన్నూ బెదిరింపులపై కెనడాలో హిందూ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

# అభిప్రాయలను స్వీకరిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

కమిటీ ఓ ప్రకటనను విడుదల చేసింది. కార్యాచరణ ప్రణాళికలు, అధికారిక సంప్రదింపులు ఎలా జరపాలన్న అంశాలపై కమిటీ చర్చించింది. కేంద్రం నిర్దేశించిన పనులకు పేపర్ వర్కు తయారు చేయడం, అవసరమైన విషయాలపై లోతైన పరిశోధనలు చేయడంపై చర్చలు జరిగినట్లు తెలిసింది. కమిటీలో కాంగ్రెస్ అధీర్ రంజన్ చౌదరి పేరును కేంద్రం సిఫార్సు చేసినా.. తాను ఉండబోనని ఆయన చెప్పారు. కమిటీ స్వతంత్రంగా కాక.. కేంద్రం చెప్పినట్లే వింటుందని అనుమానం వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికల సాధ్యానికి అవసరమయ్యే రాజ్యాంగ సవరణలు, వాటికి రాష్ట్రాల అంగీకారం అవసరమా.. ఒకేసారి ఎన్నికల నిర్వహణ సాధ్యం కాకపోతే.. కాలవ్యవధులపై సిఫార్సులు వంటి పనులను కేంద్రం.. కమిటీకి నిర్దేశించింది. వీటితోపాటు జమిలి ఎన్నికలకు పెద్దమొత్తంలో అవసరమయ్యే ఎన్నికల పరికరాలపై నివేదిక ఇవ్వాలని సూచించింది. 1952 నుంచి కొన్నేళ్లు ఒకేసారి దేశమంతా ఎన్నికలు నిర్వహించి మధ్యలో ఆ పద్ధతి మారడాన్ని తెలుసుకున్న కేంద్రం.. అలాంటిది మళ్లీ పునరావతం కాకుండా ఏం చేయాలో చెప్పాలని కమిటీకి సూచించింది. 'ఒకే దేశం- ఒకే ఎన్నికలు' నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు .. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతత్వంలో ఎనిమిది మంది నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది కేంద్రం. ఈ కమిటీలో అధికార, ప్రతిపక్ష నేతలతో పాటు.. శాసన, న్యాయ, ఆర్థిక నిపుణులకు స్థానం కల్పించింది. రామ్ నాథ్ కోవింద్‌తో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి, రాజ్యసభ మాజీ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్, 15వ ఆర్థిక సంఘం మాజీ ఛైర్మన్ ఎన్ కే సింగ్, సీనియర్ అడ్వొకేట్ హరీశ్ సాల్వే, లోక్ సభ మాజీ సెక్రటరీ జనరల్ డాక్టర్ సుభాశ్ సీ కశ్యప్, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారి ఉన్నారు.

# క్రీడాకారులకు ఇది ఎంతో ప్రయోజనం

లక్నో, సెప్టెంబర్ 23 : ప్రధాని నరేంద్రమోడీ తన సొంత నియోజకవర్గమైన ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి శనివారం శంకుస్థాపన చేశారు. మహదేవుని నగరంలో శివతత్వం ఉట్టిపడే డిజైన్తో నిర్మిస్తున్న ఈ స్టేడియాన్ని మహదేవునికే అంకితం చేయనున్నట్టు మోడీ ఈ సందర్భంగా ప్రకటించారు. కాశీలోని అంతర్జాతీయ స్టేడియం నిర్మాణంతో స్థానిక క్రీడాకారులకు ఎంతో ప్రయోనం చేకూరుతుందన్నారు. పూర్వాంచల్ ప్రాంతానికి ఈ స్టేడియం తలమానికమని పేర్కొన్నారు. ఈరోజు నుంచి ఆసియన్ గేమ్స్ ప్రారంభమవుతున్నాయని, ఈ క్రీడల్లో భారతదేశం సాధిస్తున్న విజయాలు క్రీడల పట్ల మన దృక్కోణం మారుతోందనడానికి సాక్ష్యంగా నిలుస్తోందన్నారు. క్రీడాకారులకు ప్రతిస్థాయి లోనూ ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని తెలిపారు. అలాంటి ప్రభుత్వ పథకాల్లో టీఓపీఎస్ ఒకటని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ప్రముఖ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్, సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి, మదన్లాల్, దిలీప్ వెంగ్సర్కార్, బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ, వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా, సెక్రటరీ జే తదితరులు పాల్గొన్నారు.

**రూ.450 కోట్లతో స్టేడియం**

ఇదిలా ఉండగా ఈ స్టేడియాన్ని కాశీవిశ్వేశ్వరుని స్ఫూర్తితో డిజైన్ చేస్తున్నారు. అర్ధచంద్రాకారం తరహాలో రూఫ్ కవర్, త్రిశూలం తరహాలో ఫ్లడ్లైట్లు, ఘాట్ మెట్ల తరహా సీటింగ్ ఏర్పాట్లు వంటివి ఉండబోతున్నాయి. 30,000మంది ప్రేక్షకులు కూర్చునేందుకు అవకాశం ఉన్న ఈ స్టేడియాన్ని 30 నెలల్లో పూర్తి చేయనున్నారు. రూ.450 కోట్ల వ్యయంతో 30 ఎకరాల విస్తీర్ణంలో ప్రాజెక్టు నిర్మాణం కానుంది. భూమి సేకరణ కోసం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం రూ.121 కోట్ల వెచ్చించింది. బీసీసీఐ రూ. 331 కోట్లు ఈ ప్రాజెక్టుకు ఖర్చు చేయనుంది

# అటల్ అవాసీయ విద్యాలయాస్ స్కూళ్లు ప్రారంభం

వారణాసి, సెప్టెంబర్ 23 : ఉత్తరప్రదేశ్‌లో కొవిడ్ మహమ్మారి ప్రభావంతో అనాధలైన కార్మికుల పిల్లల కోసం నిర్మించిన 16 రెసిడెన్షియల్ స్కూళ్లకు ప్రధాని మోడీ శనివారం ప్రారంభోత్సవం చేశారు. కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో అటల్ అవాసీయ విద్యాలయాస్ పేరున దాదాపు రూ.1,115 కోట్లతో ఈ స్కూళ్లను నిర్మించారు. ఈ రెసిడెన్షియల్ స్కూళ్లను జాతికి అంకితం చేసే ముందు ప్రధాని మోడీ కొంతమంది విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. ఒక్కో పాఠశాలలో దాదాపు వెయ్యిమంది విద్యార్థులకు వసతి కల్పిస్తారు. ఒక్కో స్కూలును 10 నుంచి 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. తరగతిగదులు, ఆటస్థలం, రిక్రియేషన్ ప్రాంతాలు, మినీ ఆడిటోరియం, హాస్టల్ కాంప్లెక్సు, మెస్ సౌకర్యం తోపాటు సిబ్బందికి నివాసాలు కూడా ఏర్పాటయ్యాయి.

# షెడ్యూల్ ప్రకారమే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మనం న్యూస్): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. బీఆర్‌కే భవన్‌లో ఆయన శనివారం మీడియా సెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా మీడియతో మాట్లాడారు. ఎన్నికలకు రెండు, మూడు నెలలు మాత్రమే సమయం ఉందని తెలిపారు. జిల్లాల్లో అధికారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 15లక్షల మంది ఓటర్లుగా చేరారన్నారు. ముఖ్యంగా యువత, మహిళా ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. 6.99లక్షల యువ ఓటర్లను నమోదు చేయించినట్లు చెప్పారు. మహిళా ఓట్ల సంఖ్య పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరుగుతుందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహణ జరగనుందని చెప్పారు. అక్టోబర్ 3,4,5 తేదీల్లో కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో పర్యటన ఉంటుందని చెప్పారు. ఈవీఎంల తనిఖీ జరుగుతోందని, తుది ఓటర్ల జాబితా పూర్తయ్యాక జిల్లాల్లో సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏజెన్సీలతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర పరిధిలో 20 ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు పనిచేయబోతున్నాయని, షెడ్యూల్ ప్రకారం ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో అడ్రస్ మార్పుల ఫిర్యాదులు వచ్చాయన్న ఆయన.. వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు.తెలంగాణలో షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర సీఈఓ వికాస్ రాజ్ స్పష్టం చేశారు. ఇప్పటివరకూ కొత్తగా 15 లక్షల మందిని ఓటర్ల జాబితాలో చేర్చామని చెప్పారు. అదే సమయంలో రాష్ట్రంలో 3.38 లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు చెప్పారు. థర్డ్ జెండర్‌లను, 80 ఏళ్లు పైబడిన వృద్ధులను, పీడబ్ల్యూడీలను గుర్తిస్తున్నామని చెప్పారు. ఈసీ ఆదేశాల మేరకు పీడబ్ల్యూడీలను లక్ష మందికి పైగా ఇటీవల గుర్తించినట్లు తెలిపారు. ఇంటి నుంచి ఓటింగ్ వేసే వారిని గుర్తించి అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈసీ అధికారులు, పరిశీలకులు త్వరలో జిల్లాల్లో పర్యటిస్తారు. రాజకీయ పార్టీలతో, కలెక్టర్లు, ఎస్పీలతో, సీఎస్‌తో ఎన్నికల అధికారులు సమావేశాలు నిర్వహించనున్నారు. తెలంగాణలో మరికొన్ని నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. అయితే నిర్ణీత సమయానికి ఎన్నికల షెడ్యూల్ రాకపోతే, వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే ఛాన్స్ ఉందని పలు పార్టీలు భావిస్తున్నాయి. త్వరలోనే పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో కమిషనర్ రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఆయా రాష్ట్రాల్లో ఏర్పాట్లను సమీక్షించనున్నారు. ఇందులో భాగంగానే సీఈసీ తెలంగాణలో తాత్కాలిక పర్యటన తేదీలను రాష్ట్ర అధికారులకు పంపింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో రాష్ట్ర ఎన్నికల అధికారులు ఓటర్ల జాబితా నుంచి పోలింగ్ కేంద్రాలు, పోలీసు బందోబస్తు, బోగస్ ఓటర్ల ఏరివేతపై పనిచేస్తున్నారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఏపీ సిరీస్‌తో 13 నుంచి 14 అంకెలతో ఉన్న ఓటరు గుర్తింపు కార్డులను అధికారులు గుర్తించారు. దేశవ్యాప్తంగా ఓటరు కార్డు సంఖ్య 10 అంకెలకు తగ్గించడం తెలిసిందే. రాష్ట్రంలోని 47 లక్షల 22 వేల మంది ఓటర్ల కార్డు నంబర్లు మారగా, నూతన ఫొటో ఓటరు కార్డులు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని కొత్త కార్డులను పొందవచ్చు అని తెలిపారు.

# అధికార లాంఛనాలతో హరీశ్వర్‌రెడ్డి అంత్యక్రియలు

పరిగి/హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మనం న్యూస్): ఉమ్మడి రాష్ట్ర ఉప సభాపతి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం పరిగిలో అధికార లాంఛనాలతో నిర్వహించారు. శుక్ర వారం రాత్రి ఆయన గుండెపోటుతో కన్నుమూసిన విషయం తెలిసిందే. హరీశ్వర్‌రెడ్డి భౌతికాయాన్ని ప్రజల సందర్శనార్థం పట్టణంలోని ఆయన నివాసంలో ఉంచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రముఖులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి నివాళులర్పించారు. అనంతరం పల్లవి డిగ్రీ కళాశాలలోని మైదానంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఆయన పెద్ద కుమారుడు, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి.. తండ్రి చితికి నిప్పంటించారు.

ప్రముఖుల నివాళి.. శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితారెడ్డి, మహేందర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, తీగల కృష్ణారెడ్డి, బీజేపీ నేత ప్రహ్లాద్‌రావు, టీడీపీ నేత కాసాని వీరేశ్ తదితరులు హరీశ్వర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాగా హరీశ్వర్‌రెడ్డి మరణ వార్త తెలుసుకున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం ఒక ప్రకటనలో తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

గన్ మిస్ ఫైర్.. అంత్యక్రియల సందర్భంగా గాలిలో కాల్పులు చేసే క్రమంలో ఒకరి చేతిలోని గన్ అకస్మాత్తుగా పేలింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# భారత్‌ను రెచ్చగొట్టడం మా ఉద్దేశం కాదు

కెనడా, సెప్టెంబర్ 23 : భారత్‌ను రెచ్చగొట్టడం తమ ఉద్దేశం కాదంటూనే.. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో మరోసారి అదే తరహా వ్యాఖ్యలు చేశారు. ఖలిస్థానీ నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ ఏజెంట్ల పాత్ర ఉండొచ్చన్న విశ్వసనీయమైన సమాచారాన్ని కొద్దివారాల క్రితమే భారత్‌కు కెనడా వెల్లడించిందని ట్రూడో చెప్పారు. ఖలిస్థానీ నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య విషయంలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో మరోసారి పాతరాగమే అందుకున్నారు. హర్దీప్ సింగ్ హత్యలో భారత ఏజెంట్ల ప్రమేయంపై విశ్వసనీయమైన సమాచారాన్ని కొద్ది వారాల క్రితమే భారత్ తో కెనడా పంచుకుందని తెలిపారు. తాజాగా మీడియాతో మాట్లాడుతూ కెనడా-భారత్ మధ్య ఉద్రిక్తతలను జస్టిన్ ట్రూడో మరింత పెంచారు. 'ఖలిస్థానీ నేత హర్దీప్ సింగ్ హత్య గురించి సోమవారం నేను మాట్లాడిన విషయానికి సంబంధించి విశ్వసనీయ సమాచారాన్ని కొన్ని వారాల క్రితమే భారత్‌కు అందించాం. ఈ విషయంలో మేం భారత్‌తో నిర్మాణాత్మకంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఈ తీవ్రమైన అంశంలో వాస్తవాలను గుర్తించేందుకు భారత్ .. మాతో కలిసి పనిచేస్తుందని ఆశిస్తున్నాం' అని ట్రూడో అన్నారు. మరోవైపు.. భారత్‌పై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో లేవనెత్తిన ఆరోపణలపై అమెరికా తీవ్ర ఆందోళన చెందుతోందని ఆ దేశ విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ తెలిపారు. కెనడాతో వివాదంపై అమెరికా నేరుగా భారత్ తో సంప్రదించిందని వెల్లడించారు. 'ఈ వివాదంలో జవాబుదారీతనాన్ని అమెరికా చూడాలనుకుంటోంది. కెనడాతో భారత్ కలిసి పనిచేస్తోందని ఆశిస్తున్నాం' అని బ్లింకెన్ అన్నారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణల వల్ల భారత్ కంటే ఆ దేశానికే ఎక్కువ ప్రమాదమని అన్నారు పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రూబిన్. వ్యూహాత్మకంగా కెనడా, భారత్ లలో ఏదో ఒక దేశాన్ని ఎంచుకోవాల్సి వస్తే.. అమెరికా భారత్‌నే ఎంచుకుంటుదని తెలిపారు. వ్యూహాత్మకంగా కెనడా కంటే అమెరికాకు భారత్ చాలా ముఖ్యమైనదని అభిప్రాయపడ్డారు. అలాగే కెనడా.. భారత్‌తో పోరాటానికి దిగడాన్ని 'ఏనుగుపై చీమ పోరాటం'గా అభివర్ణించారు. 'ఇరు మిత్ర దేశాల్లో దేన్ని ఎంచుకోవాలని అమెరికాకు ప్రతిష్టంభన ఉంటుంది. మిత్రదేశాల్లో అమెరికాకు భారత్ చాలా ముఖ్యమైనది. భారత్.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం' అని తెలిపారు. కాగా.. ఖలిస్థానీ నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ఏజెంట్ల ప్రమేయమున్నట్లు కెనడా ప్రధాని ఇటీవలే ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటి నుంచి తన వ్యాఖ్యలను కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సమర్థించుకుంటూ వస్తున్నారు.

# కులగణన అంటే మోడీకి భయం

జైపూర్, సెప్టెంబర్ 23 : దేశంలో కులగణన పేరెత్తితే ప్రధాని నరేంద్రమోడీ ఎందుకు భయపడుతున్నారు? అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్‌లోని జైపూర్లో శనివారం పార్టీ కార్యకర్తల సదస్సులో రాహుల్ మాట్లాడారు. ఇండియా పేరును భారత్‌గా మార్చేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి పిలుపు నిచ్చారని, కానీ దానికి బదులుగా మహిళా రిజర్వేషన్ బిల్లును ఉభయసభల్లో ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. 'మొదట్లో మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి వాళ్లు మాట్లాడలేదు. ఇండియా వెర్సస్ భారత్ వివాదంపై చర్చించేందుకు ప్రత్యేక సదస్సు అని ప్రకటించారు. ప్రజలు ఈ అంశాన్ని ఏమాత్రం ఇష్టపడకపోవడం, అప్పటికే పార్లమెంట్ ప్రత్యేక సదస్సు గురించి ప్రకటించడంతో వాళ్లకు ఏం చేయాల్లో పాలుపోలేదు. దాంతో మహిళా రిజర్వేషన్ బిల్లును తెరపైకి తెచ్చారు. బిల్లుకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. కానీ ఈ రిజర్వేషన్ బిల్లు కార్యరూపం దాల్చాలంటే జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అవసరమని బీజేపీ అంటోంది. తద్వారా కనీసం 10ఏళ్లపాటు రిజర్వేషన్ల అమలును జాప్యం చేయాలనుకుంటోంది. తక్షణం రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఓబీసీ మహిళలకు కూడా లబ్ధి చేకూరాలని కోరుతున్నాం' అని రాహుల్ తెలిపారు. ఓబీసీల పట్ల తమకు గౌరవం ఉందని ప్రతిరోజూ మాట్లాడే ప్రధాని కులగణన పేరెత్తితే ఎందుకు భయపడుతున్నారని రాహుల్ ప్రశ్నించారు. ఈసారి జనాభా సేకరణ కులం ఆధారంగా చేపట్టాలని, ఓబీసీలను అవమానపర్చవద్దని, వారిని మోసగించవద్దని రాహుల్ సూచించారు. పార్లమెంట్లో తాను కులగణన అంశాన్ని ప్రస్తావించినప్పుడు బీజేపీ ఎంపీలు తన గొంతు వినపడకుండా చేయాలనే ప్రయత్నం చేశారని విమర్శించారు.

# గ్రూప్-1 రద్దు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహణా సంస్థను ఆదేశించింది. అయితే హైకోర్టు తీర్పుపై టీఎస్‌పీఎస్సీ డివిజన్ బెంచ్‌కు వెళ్లనున్నట్లు తెలుస్తున్నది.

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష మరోసారి రద్దుకావడం కలకలం రేపుతోంది. ఇప్పటికే ఓసారి రద్దుకావడంతో రెండోసారి పరీక్ష రాయాల్సి వచ్చిందని, ఇప్పుడు మళ్లీ పరీక్ష రాయాలంటే ఎలాగని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లూ కష్టపడి చదివామని, వేలు, లక్షలు ఖర్చుపెట్టి శిక్షణ తీసుకున్నామని.. ఇప్పుడంతా వృధా అయినట్లే అని ఆవేదన చెందుతున్నారు. మళ్లీ ప్రిలిమ్స్ నిర్వహించినా అది ఎప్పుడు ఉంటుందో, అప్పటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని వాపోతున్నారు.

**లీకేజీతో ఓసారి.. నిర్లక్ష్యంతో మరోసారి**

వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 503 గ్రూప్-1 ఉద్యోగాలభర్తీకి గతేడాది ఏప్రిల్లో నోటిఫికేషన్ జారీకాగా.. 3,80,081 మంది దరఖాస్తు చేసుకున్నారు. టీఎస్పీఎస్సీ గతేడాది అక్టోబర్ 16న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించింది. 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి మెయిన్స్ పరీక్ష తేదీలను కూడా ప్రకటించింది. కానీ టీఎస్పీఎస్సీ కార్యాలయం నుంచి ప్రశ్నపత్రాలు లీకైన వ్యవహారం బయటపడటంతో గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను పరీక్షను రద్దు చేసింది. మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు ఈ నిర్ణయంతో గందరగోళంలో పడ్డారు. ఆ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అందరికీ తిరిగి జూన్ 11న ప్రిలిమ్స్ పరీక్షలను నిర్వహిస్తామని టీఎస్పీఎస్సీ ప్రకటించింది. ఈ క్రమంలో రెండోసారి ప్రిలిమ్స్‌కు 3,09,323 మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోగా.. 2,33,248 మంది పరీక్ష రాశారు. ఈసారి ప్రిలిమ్స్ నిర్వహణ లోపభూయిష్టంగా, అక్రమాలకు తావిచ్చేలా ఉందని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. రెండో ప్రిలిమ్స్‌ను రద్దు చేయాలని సర్కారును ఆదేశించింది.

**రద్దయితే వచ్చే ఏడాదే?**

గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు తీర్పుపై హైకోర్టు డివిజన్ బెంచ్లో అప్పీలు చేయాలని టీఎస్పీఎస్సీ నిర్ణయించింది. ఒకవేళ రద్దు తీర్పును డివిజన్ బెంచ్ సమర్థిస్తే.. మూడోసారి ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించాల్సి వస్తుంది. ఇదే జరిగితే ఇప్పట్లో ప్రిలిమ్స్ నిర్వహణ సాధ్యంకాకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకారం.. పరీక్ష కోసం కనీసం రెండు నెలల గడువు ఇస్తూ తేదీని ప్రకటించాల్సి ఉంటుంది.

వచ్చే నెలలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వస్తుందని ఎన్నికల సంఘం అధికారులు చెప్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వస్తే తర్వాత రెండు నెలల పాటు అధికార యంత్రాంగం ఎన్నికల పనిలోనే బిజీగా ఉంటుంది. ఈ క్రమంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహించడం కష్టమనే అభిప్రాయం ఉంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత లోక్‌సభ ఎన్నికలూ జరగాల్సి ఉంది. ఈ క్రమంలో వచ్చే ఏడాది మే వరకు గ్రూప్-1 పరీక్షలు వాయిదాపడే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**అభ్యర్థులు ఆగమాగం**

గతేడాది ఏప్రిల్లో గ్రూప్-1 నోటిఫికేషన్ రావడంతోనే లక్షలాది మంది అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమవడంపై దృష్టిపెట్టారు. చిన్నపాటి ఉద్యోగాలు చేస్తున్నవారు అది మానేసి, కొందరు దీర్ఘకాలిక సెలవులు పెట్టి పరీక్ష కోసం శిక్షణ తీసుకున్నారు. దీనికితోడు ఏళ్లుగా పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్నవారు మరింత ఫోకస్ పెట్టారు. పకడ్బందీగా చదువుకుని ప్రిలిమ్స్ పరీక్షలు రాశారు. కానీ లీకేజీ వ్యవహారంతో పరీక్ష రద్దుకావడంతో నిరుత్సాహానికి గురయ్యారు. అయితే టీఎస్పీఎస్సీ వేగంగా చర్యలు చేపట్టి, తిరిగి ప్రిలిమ్స్ నిర్వహించే తేదీని ప్రకటించడంతో.. అభ్యర్థులంతా ఎంతో ఆశతో రెండోసారి పరీక్ష కోసం సిద్ధమయ్యారు. అలా ఈ ఏడాది జూన్ 11న పరీక్ష రాశారు. ఫలితాల విడుదల, మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో ఎంపిక జాబితా కోసం ఎదురు చూస్తున్న తరుణంలో.. తాజాగా హైకోర్టు తీర్పుతో దిక్కుతోచని స్థితి లో పడ్డారు. మూడోసారి పరీక్ష కోసం చదవాల్సి రావడమేంటన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గ్రూప్-1 పరీక్షలు వాయిదా దురదష్టకరం

హైదరాబాద్, : గ్రూప్-1 పరీక్షలు మళ్లీ వాయిదా పడటంపై కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి స్పందించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ అసమర్థ ప్రజాపాలన, సరైన నిర్ణయాలు తీసుకోవడంలో వైఫల్యం కారణంగా.. వరుసగా రెండోసారి రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు వాయిదా పడటం దురదష్టకరం అని అన్నారు. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న 4 లక్షల మంది యువతలో నైరాశ్యం నింపేలా కేసీఆర్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నాడు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో.. నీళ్లు, నిధుల విషయంలో ఎలాగూ దగాపడుతున్నాం.. ఇప్పుడు నియామకాల విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం యువతకు శాపంగా మారింది అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవలే జరిగిన పేపర్ లీక్ ఘటన ఈ సందర్భంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం కాస్తయినా జాగ్రత్తగా వ్యవహరిస్తోందనుకుంటే.. మళ్లీ అదే అసమర్థత, అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది అని కిషన్ రెడ్డి అన్నారు.

## పేపర్లు లీక్ చేసి రూ.వేల కోట్లకు అమ్ముకున్నారు!

పెద్దపల్లి: టీఎస్పీ ఎస్సీ పరీక్ష పేపర్లు లీకే చేసి రూ.వేల కోట్లకు అమ్ముకున్న గజదొంగ కేసీఆర్ అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఉద్యోగ నోటి ఫికేషన్ల పేరిట రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టిన కేసీఆర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పార్టీ శ్రేణులను కోరారు. శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 11న టీఎస్పీఎస్సీ రెండోసారి నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు టీఎస్పీఎస్సీ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పేపర్ల లీకేజీ సూత్రధారులు ముఖ్యమంత్రి కార్యాలయంలోనే ఉన్నారని ఆరోపించారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు హాజరైన వారికంటే అదనంగా 270 ఓఎంఆర్ షీట్లు ఎలా వచ్చాయో ఆ సంస్థ చైర్మన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సభ్యులను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి హనుమయ్య, కార్యదర్శి దేవునూరి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల నాణ్యతను పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ



హుస్నాబాద్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద వేసిన రహదారులను అధికారులతో కలిసి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా శనివారం పరిశీలించారు. హుస్నాబాద్ మండలంలోని మడద, పోతారం(ఎస్),మహమ్మదాపూర్, ఉమ్మాపూర్, నాగారం గ్రామాల్లో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద వేసిన రహదారుల నాణ్యతను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసారు. రహదారులు చెడిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. రహదారుల నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ లకావత్ మానస, జడ్పీవైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, పంచాయతీ రాజ్ అధికారులు స్నేహ, తదితరులున్నారు.

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- నాణ్యతలో ఎలాంటి లోపం ఉండద్దు
- అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్



హుస్నాబాద్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): పట్టణ కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. పట్టణ కేంద్రంలో వైకుంఠదామం, నూతన మున్సిపల్ కార్యాలయ భవనం, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో గరిమా అగ్రవాల్ మాట్లాడుతూ భవన నిర్మాణాల్లో ఎలాంటి నాణ్యత లోపించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. డిసెంబర్‌లోగా మున్సిపల్ కార్యాలయ భవనాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆమె సూచించారు. ఆనంతరం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీలు బ్యాంకును ఆమె సందర్శించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్ నళిని, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, ఈఈ వీరప్రతాప్, కో-ఆప్షన్ మెంబర్ శంకర్‌రెడ్డి, ఏఈ సాయి ప్రణీత్, ఆర్.ఐ. కృష్ణ, మెప్మా సీవో రాజు, ఈఈ రవి, తదితరులున్నారు.

## మల్లన్న సాగర్ పంప్‌హౌజ్ వద్ద నీటి పంపింగ్

- డిఈఈ శ్రీనివాస్‌రావు
- ప్రస్తుత నీటి మట్టం 15.5 టిఎంసీలు
- 16 రోజుల్లో 4.5 టిఎంసీల పంపింగ్



తొగుట, సెప్టెంబర్ 23, మనం న్యూస్: తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలోని మల్లన్న సాగర్‌లో ఈనెల 7వవ తేదీ ప్రారభమైన నీటి పంపింగ్ ద్వారా శనివారం వరకు 16 రోజుల్లో 4.5 టిఎంసీలు రిజర్వాయర్‌లోకివిడుదల చేయడం జరిగిందని డిఈఈ శ్రీనివాస్ రావు తెలిపారు. మల్లన్న సార్ ప్రాజెక్టును గత 2022 ఫిబ్రవరి 23న సీఎం కేసీఆర్ ప్రారంభించగానే నీటిని పంపింగ్ చేసి సిరిసిల్ల నియోజకర్గంలో గరిష్టంగా 15 టిఎంసీల సామర్థ్యంతో నిల్వ ఉంచామన్నారు. సిద్దిపేట, దుబ్బాక, సిరిసిల్ల నియోజకవర్గాల్లోన 91 ట్యాంక్‌లు, చెక్‌డ్యామ్‌లు, రెండు సీజన్‌లలో నింపేందుకు రిజర్వాయర్లలో నిల్వ ఉన్న నీటి నుండి 24 టిఎంసీల ద్వారా కూడా ట్యాంకుల ఫీడింగ్ చేస్తున్నామని, నిండు వేసవిలో కమాండ్ ఏరియాలో భూగర్భ జలాలు 76 అడుగుల నుండి 36 అడుగుల వరకు పెరగడం వల్ల కమాండ్ ఏరియాలో పంటలకు బోర్‌వెల్‌ల ద్వారా పుష్కలంగా నీరు అందించడం జరుగుతుందన్నారు. ఈనెల 7వ తేదీ నాటికి మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో నీటి పరిమాణ 10.90 టిఎంసీల నీరు అందుబాటులో ఉంటుందన్నారు ఈ నెల 26 రోజుల్లో మరో 4.5 టిఎంసీల నీటిని చేయడం పూర్తి కాగా మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 15.50 టిఎంసీల నీరు నిల్వ ఉంటుందన్నారు.



# రాజకీయ లబ్ధి కోసమే మహిళా రిజర్వేషన్ బిల్లు

- మెజార్టీ ఉన్నా ప్రవేశపెట్టేందుకు పదేళ్లు
- కమ్యూనిస్టులకు గౌరవం లేకపోతే ప్రజలకు లేనట్టే
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



హుస్నాబాద్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): ఎన్నికల ప్రచార అస్త్రంగా వాడుకునేందుకే, రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో స్థానిక అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో శనివారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హజరై మాట్లాడారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు సిపిఐ ఆనాడే గీతా ముఖర్జీ నాయకురాలు పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ కోసం పోరాడరని ఆయన గుర్తు చేసారు. పార్లమెంటరీ సెలెక్ట్ కమిటీ అధినేత్రిగా గీతా ముఖర్జీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని సిఫార్సు చేసారన్నారు. 2014 నుండి పార్లమెంట్‌లో బిజేపికి మెజారిటీ ఉన్నప్పటికి బిల్లును ప్రవేశపెట్టేందుకు పదేళ్లు పట్టిందని ఆయన విమర్శించారు. 2024 లో ఎన్నికలు జరగనుండడం, ఇండియా కూటమి ఏర్పాటుతో ప్రతిపక్షాలు బిజేపీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడంతో ఎన్నో వైరుధ్యాలు ఉన్నప్పటికీ రాజకీయ లబ్ధి పొందేందుకు పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టిందని ఆయన ఆరోపించారు. ఓబిసి రిజర్వేషన్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడం, చర్చించకపోవడం బాధకరమన్నారు. మహిళా రిజర్వేషన్లు 2026లో లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల డీలిమిటేషన్ ప్రక్రియ తర్వాత, 2029 ఎన్నికల్లో మాత్రమే అమలుకు నోచుకుంటుండడం విచారకరం అన్నారు. తెలంగాణలో పాగ వేసేందుకు బీజేపీ ఎన్నో ప్రయత్నాలు చేసిందని కానీ అవన్నీ పూర్తిగా విఫలమయ్యాయి అన్నారు. తెలంగాణలో ప్రజల గొంతుకగా సిపిఐ ఉంటుందన్నారు. పొత్తులంటేనే ఇచ్చిపుచ్చుకోవడమన్నారు. హుస్నాబాద్‌లో సిపిఐ ఇప్పటికే ఆరు సార్లు విజయం సాధించిందని ఆయన గుర్తు చేసారు. కర్ణాటకలో 15 నుండి 20 స్థానాల్లో సిపిఐ మద్ధతుతోనే గెలిచాయి అన్నారు. తెలంగాణలో పొత్తు విషయంలో జాతీయ నాయకులు మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. తెలంగాణలో హుస్నాబాద్, కొత్తగూడెం, వైరా, బెల్లంపల్లి, మునుగోడులో సీట్లు కావాలని అడుగుతున్నామని ఆయన స్పష్టం చేసారు. కాంగ్రెస్‌తో పొత్తు లేకున్నా హుస్నాబాద్‌లో మాత్రం సిపిఐ ఒంటరిగా కూడా పోటీ చేసేందుకు సిద్ధమవుతుందన్నారు. తెలంగాణలో ఇప్పటికే ఎన్నికల వాతావరణం వేడెక్కిందన్నారు. వచ్చే నెలలో తెలంగాణకు ఎన్నికల కమిషన్ రానుందన్నారు. ప్రజా ఉద్యమాల చరిత్ర సిపిఐ పార్టీకే ఉందన్నారు. కమ్యూనిస్టులకు గౌరవం లేకపోతే ప్రజలకు గౌరవం లేనట్టే అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కలపల్లి శ్రీనివాసరావు, సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపే మల్లేశ్, సిపిఐ నాయకులు ఎడల వనేష్, కొయ్యడ సృజన్ కుమార్, జేరిపోతుల జనార్ధన్, తదితరులున్నారు.

## తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలి

- తడి చెత్తతో ఎరువుల తయారీ
- అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్



హుస్నాబాద్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్) : ఇళ్లల్లో తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి మున్సిపల్ వాహనానికి ఇవ్వాలని సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ అన్నారు. పొడి చెత్త సేకరణ కేంద్రం, సేంద్రీయ ఎరువు తయారీ కేంద్రాలను చూపడానికి సివి రామన్ పాఠశాల పిల్లలను స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా తీసుకువచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ పిల్లలందరూ తమ తల్లిదండ్రులకు ఇంట్లో ఉన్న చెత్తను తడి, పొడి చెత్తలుగా వేర్వేరు డబ్బాల్లో వేసి మున్సిపల్ వాహనానికి అందించాలని కోరాలని ఆమె అన్నారు. పొడి చెత్తను సేకరించిన తర్వాత జరిగే రీసైక్లింగ్ ప్రక్రియను తడి చెత్తతో ఎరువు తయారు చేసుకొనే పద్ధతిని ఆమె వివరించారు. శానిటేషన్ కార్మికులు చేసే సేవను పిల్లలకు వివరించారు. ఆనంతరం శానిటేషన్ జవాన్ సారయ్యని పిల్లలతో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు కొంకటి నళిని దేవి, కో-ఆప్షన్ మెంబర్ శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకన్న, మున్సిపల్ అధికారులు ఏఈ సాయిప్రణీత్, ఆర్ఐ కృష్ణ, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవి, శంకర్, డిఆర్‌సిసి ఆపరేటర్ సమత, సివి రామన్ స్కూల్ అధ్యాపకులు కిరణ్, మున్సిపల్ సిబ్బంది, తదితరులున్నారు.

## దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులుగా దొమ్మాట భూపాల్ నియామకం

- నియామక పత్రాన్ని అందించిన ఎంపి ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక, సెప్టెంబర్ 23, మనం న్యూస్: పార్టీ సిద్ధాంతానికి ఎప్పుడైతే కట్టుబడి ఉంటారో అప్పుడే పార్టీ నమ్మిన కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తుందని దుబ్బాక మున్సిపల్ యూత్ అధ్యక్షులు దొమ్మాట భూపాల్ అన్నారు. శనివారం ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి హైదరబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో దుబ్బాక బిఆర్ఎస్ యూత్ అధ్యక్షునిగా దొమ్మాట భూపాల్‌కు నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగాఎంపి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తెరాస పార్టీలో కార్యకర్తలకు ఎల్లప్పుడూ సముచిత స్థానం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు కార్యకర్త స్థాయి నుండి కంకణబద్ధులై పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నూతన పట్టణ అధ్యక్షులు దొమ్మాట భూపాల్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు అప్పగింఇన పదవిని ఎంపి ప్రభాకర్ రెడ్డి గెలుపుకై కృషి చేస్తానన్నారు. ఈకార్యక్యక్రమంలొ రేకులకుంట మల్లన్న ఆలయ చైర్మన్ రొట్టె రమేష్ః, కౌన్సిలర్‌లు ఆస యాదగిరి , ఇల్లందుల శ్రీనివాస్, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ ఆస స్వామి, బిఆర్ఎస్ నాకులు పల్లె రామస్వామి, మూర్తి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## సమాజ సహకారంతో పాఠశాలల్లో విద్యాభివృద్ధి

- విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి



కొండపాక, సెప్టెంబర్, 23, మనం న్యూస్: సమాజ సహకారం ఉంటే పాఠశాలలు పటిష్టపడి విద్యాభివృద్ధికి ఆస్కారం ఉంటుందని జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో ప్రతిభా పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడఉత ఉపాధ్యాలుగా సమిష్టిగా విద్యార్థుల తల్లిదండ్రులు సహకారంతో పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల స్థాయి పెంచడానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమంతోపాటు ప్రభుత్వ పాఠశాలలను పటిష్టపరిచేందుకు ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. తల్లిదండ్రుల సహక్షంలో వారి పిల్లలను పిలిపించి సమావేశంలో విద్యార్థులను వివిధ విషయాలలో ప్రశ్నలు అడిగి విద్యార్థులచే వచ్చిన సమాధానాలతో సంతృప్తి చెందారన్నారు. అనంతరం పాఠషాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయలు బి. సత్తయ్య మాట్లాడుతూ పాఠశాలను రాష్ట్ర స్థాయిలో కాకుండా ఉపాధ్యాయులంతా జాతీయ స్థాయికి తీసుకువెళ్లడానికి ఎలాంటి చర్యలైనా చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఉపాధ్యాయులు సంఘటితంగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ఎస్ఎస్‌ంసి చైర్మన్ మల్లం ఐలయ్య , ఉప సర్పంచ్ పోల్కంపల్లి జయంతి నరేందర్, జిల్లా సక్టోరియల్ అధికారి రంగనాథ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

- శాంతి భద్రతల అడిషనల్ డిసిపి ఎస్. మల్లారెడ్డి



తొగుట, సెప్టెంబర్, 23, మనం న్యూస్ః తమ సమస్యల పై ఫిర్యాదు చేయడానికి వచ్చే వారి పట్ల పోలీసులు మర్యాదగా మాట్లాడాలని డిసిపి శాంతిభద్రతల అడిషనల్ భద్రతల అడిషనల్ ఎస్. మల్లారెడ్డి సూచించారు. శనివారం తొగుట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిసిపి తొగుట సర్కిల్ కార్యాలయంలో తొగుట, రాయపోల్, దౌల్తాబాద్ ఎస్ఐలతో స్టేషన్‌ల పరిధిలోని సస్పెక్ట్, కేడి, డిసి, రౌడీషట్సీపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరుచుగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సస్పెక్ట్, కేడి, డిసి, రౌడీలపై ప్రత్యే నిఘా ఏర్పాటు చేయాలని, తరుచుగా సంబంధిత ఎస్ఐలు బ్లూకోల్ట పెట్రోక్రార్ సిబ్బంది వారి కదలికల పై నిఘా ఉంచాలని సూచించారు. ఏరకమైన కేసులు నమోదువుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్, బ్లూ కోల్ట్ విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కేసుల ఛేదనలో టెక్నాలజీ బాగా ఉపయోగించాలని సూచించారు. పరిశుభ్రత పచ్చదనంతో మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో పోలీస్ స్టేషన్‌లు ఉంచాలన్నారు. తొగుట, రాయపోల్ దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల మండపాల గురించి అడిగి తెలుసుకున్నారు. పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తొగుట సిఐ కమలాకర్, ఎస్ఐ లింగం, దౌల్తాబాద్ ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి, రాయపోల్ ఎస్ఐ రఘుపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రంగనాయక సాగర్ వద్ద వ్యక్తి మృతి



చిన్నకోడూరు, సెప్టెంబర్ 23, మనం న్యూస్: రంగనాయక సాగర్ వద్ద వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం పెద్దకోడూరు గ్రామ శివారులో వ్యక్తి మృతదేహం ఉందని గ్రామ సెక్రటరీ రాజు దరఖాస్తు ఇవ్వగా మృతదేహాన్ని పరిశీలించి పోస్టు మార్టం సంఘటనా స్థలం వద్ద నిర్వహించామన్నారు. గత వారం రోజుల క్రితం పెద్దకోడూరు, గంగాపూర్, లింగారెడ్డిపల్లి గ్రామ శివార్లలో అపరిచిత వ్యక్తి తిరి గినట్లుగా స్థానికులు గుర్తించారని, ఆ వ్యక్తే ప్రాజెక్టు శివారులో కాలు జారి మృతి చెందినట్లు కేసు నమోదు చేశామన్నారు.

## నేడు ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులకు ఉచిత వైద్య శిబిరం



సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 23, మనం న్యూస్: తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు సహకారంతో సిద్దిపేట ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆంబిటస్ పాఠశాలలో 24వ తేదీన ఆదివారం ఉచిత వైద్య శిభిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రైవేటు పాఠశాల యాజమాన్య సంఘం కార్యదర్శులు ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ ప్రైవేటు పాఠశాల యాజమాన్య సంఘం అధ్యక్షులుఉ బి. మోహన్ కుమార్, ట్రెజరరీ సి.హెచ. రవిలు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ నిత్యం పాఠశాలలో విద్యార్థులతో తీరిక లేకుండా పాఠాలను బోధిస్తూ అనేక రకాల మానసిక ఒత్తిడిలకు గురవుతున్న ఉపాధ్యాయులకు ఇది ఒక మంచి అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా. కాశీనాథ్, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు,వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, పాల సాయిరామ్, కొండం సంపత్ రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో రుద్రాక్ష ఎగ్జిబిషన్ మేళా

- ఈనెల 25న ప్రారంభం




సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 23, మనం న్యూస్: అతి పవిత్రమైన రుద్రాక్ష ఎగ్జిబిషన్ మేళాను సిద్దిపేటలో మొట్టమొదటి సారిగా ఈ నెల 25 నుండి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు రుద్రాక్ష నిపుణులు మేనేజింగ్ గైడరెక్టర్‌దుర్గా ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలోని రత్నదీప్ సూపర్‌మార్కెట్ పైన సుశీల్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 25న ప్రారంభించనున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు ఈ మేళా కొనసాగుతుందని, ఇందులో ద్విముఖి, త్రిముఖి, చతుర్ముఖి, పంచముఖి మొదలైన ఇరవై ఒక్క ముఖాలతో కలిగిన రుద్రాక్షలతో పాటు స్పటిక తులస, నవరత్న మాలలు, సాలిగ్రాములు, మర్కట శివలింగాలకు సంబంధించిన దైవమైన వస్తువులు లభిస్తాయన్నారు. ఈ ఎగ్జిబిషన్ నాలుగు రోజుల పాటు కొనసాగుతుందని, దీన్ని పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# జనగామ బరిలో ఆరడుగుల బుల్లెట్

- రాజయ్యను ముత్తిరెడ్డిని బుజ్జగించిన కేటీఆర్
- కడియం శ్రీహరికి సహకరించాలంటూ ఆదేశాలు
- ఈనెల 24 న జనగామ శాసనసభ అభ్యర్థిగా పల్లాను ప్రకటించే అవకాశం



జనగామ, సెప్టెంబర్ 23, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన టిఆర్ఎస్ శాసనసభ అభ్యర్థులను ఈనెల 24న ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగా జనగామ శాసన సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆరడుగుల బుల్లెట్ పల్లా రాజేశ్వర్ రెడ్డిని ప్రకటించే అవకాశం ఖరారు అయినట్లే ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ ను రాజయ్య కడియం శ్రీహరి వల్ల రాజేశ్వర్ రెడ్డిలు శని వారం కలిసి రాజకీ య చర్చలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎలాగైనా హ్యాట్రిక్ సాధించాలని ఆలోచనలతో మంత్రి కేటీఆర్ వి నూత్న ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. 60 సంవత్సరాలుగా అభివద్ధికానీ తెలంగాణ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా సాధించుకుని 10 సంవత్సరాలలో అనేక సంక్షేమ పథ కాలను ప్రవేశపెట్టి దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దామని దీమాతో ముందుగానే అభ్యర్థులను ప్రకటించారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఒకేసారి ప్రకటించని అభ్యర్థులను తెలంగాణ రాష్ట్ర రథసారథి ప్రకటించడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఐదుగురు అభ్యర్థులను ఈనెల 24న ప్రకటించనున్నట్లు తెలుస్తుంది. జనగామ జిల్లా స్టేషన్ ఘ న్పూర్ నియోజకవర్గ అభ్యర్థిగా కడియం శ్రీహరిని ప్రకటించి కడియం శ్రీ హరికి సహకరించాలని రాజయ్యను బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే జనగామ నియోజకవర్గం రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన ముత్తిరెడ్డి స్థానంలోపల్లా రాజేశ్వర్ రెడ్డిని బరిలో ఉంచనున్నారు. గత నెల



రోజులుగా జనగామ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పల్లా రాజేశ్వర్ రెడ్డి పోటా పోటీగా కార్యకర్తల బలం చూపించుకుంటూ నాకేం అంటే నాకే అని అధిష్టానం వద్ద పడిగాపులు కాశారు. శుక్రవారం ప్రగతిభవంలో చర్చల అనంతరం పల్లారాజేశ్వర్ రెడ్డికి జనగామ సీటు ఖరారైనట్లు తెలిసింది. శుక్రవారం మంత్రి కేటీఆర్‌ను కడియం శ్రీహరి రాజయ్యలు పల్లా రాజేశ్వర్ రెడ్డి కలిసినట్లు వార్తలు రావడంతో పల్లావర్గానికి ఆశలు చిగురించాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడడంతో ఎలాగైనా దీటైన అభ్యర్థులను బరిలో దించాలనె ఆలోచనలతో అధిష్టానం సీట్ల మార్పిడి చేస్తున్నారు.

**పల్లాకు ముత్తిరెడ్డి సహకరించెనా ?**

పది సంవత్సరాలుగా జనగామ నియోజకవర్గాన్ని ఏలిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి టిఆర్ఎస్ అభ్యర్థిగా దిగనున్న పల్లా రాజేశ్వర్ రెడ్డికి సహకరిస్తాడా లేడా అని అనుమానంతో అధిష్టానం ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిని పిలిపించుకొని రాష్ట్ర సమన్వయ సమితి చైర్మన్ గా, తాటికొండ రాజయ్యకు ఆర్టీసీ చైర్మన్ గా ఇస్తామని బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. జనగామ శాసన సభ అభ్యర్థిగా దిగనున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి కి సహకరిస్తే వల్లా గెలుపు ఖాయమని అనుకుంటున్నారు. పల్లకి సీటు ప్రకటిస్తే ఇటు పోచంపల్లి అటు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అనుచరులు కాంగ్రెస్ అభ్యర్థికి సపోర్ట్ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసమే అధిష్టానం బుజ్జగించే ప్రయత్నంలో తల మునకలవుతున్నారు.

**మార్చితే రెండు సీట్లకు గండమా ? విజయమా ......**

జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యేగా 10 సంవత్సరాలుగా ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి 10 సంవత్సరాలుగా స్టేషన్గన్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తాటికొండ రాజయ్యలు తమ తమ వర్గాలను రాజకీయ బలంగా తీర్చిదిద్దుకున్న నియోజకవర్గాలలో సిట్టింగ్ అభ్యర్థులను మారిస్తే కాంగ్రెస్ చేతిలో పడే అవకాశం ఉందని పలువురు అనుకుంటున్నారు. టిఆర్ఎస్ తనంతట తానే నెత్తిలో చేతులు పెట్టుకునే పరిస్థితి తెచ్చుకుంటున్నారని పలువురు అనుకుంటున్నారు. సీట్లు మారిస్తే భయపడే సీట్లు మార్చారంటు ప్రజల్లో సంకేతం పోయి కాంగ్రెస్ జెండా ఎత్తడం ఖాయమని అనుకుంటున్నారు. కానీ జనగామ నియోజకవర్గానికి దిగనున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజకీయంలో తలలు పండిన నేతగా పేరుంది. కార్యకర్తలను ఏకం చేసుకునే సత్తా తనలో ఉండడంతో అధిష్టానం వల్లా రాజేశ్వర్ రెడ్డి వైపు మొగ్గు చూపారు. ఏది ఏమైనా జనగామ శాసనసభ ఎన్నికలు ఈసారి హాట్ టాపిక్ గా మారనున్నది.

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



పరకాల, సెప్టెంబర్ 23, మనం న్యూస్ : బీఆర్ఎస్ పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతున్నది. జిల్లాలోని పరకాల నియోజకవర్గం పరకాల పట్టణానికి చెందిన వై.ఎస్సార్.టి.పి. పార్టీ శ్రేణులు ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు.వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివద్ధి, సంక్షేమ పథకాల అమలుతో పాటు.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేస్తున్న అభివద్ధి పనులకు ఆకర్షితులై ఆయనకు అండగా నిలువాలని బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గ అభివద్ధి, ఈ ప్రాంతంలోని పేద ప్రజలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారికి అండగా నిలిచి. ఆయన గెలుపుకోసం తమవంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. పార్టీలో చేరినవారిలో. పట్టణ మహిళా అధ్యక్షురాలు ఏకు కష్ణవేణి, మహిళా మండల అధ్యక్షురాలు సి.ఎచ్.లావణ్య,ఆటో యూనియన్ అధ్యక్షులు జూపాక ప్రశాంత్ ,మండల యూత్ అధ్యక్షులు గూడెపు రాజకుమార్ లతో పాటు పలువురు చేరారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్ పర్సన్ సోడా అనిత రామకష్ణ,వైస్ చైర్మన్ రేవూరి విజయపాల్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు మడికొండ శ్రీను,నాయకులు జిన్నా రామకష్ణ రెడ్డి,బోట్ల నరేష్,ఏకు కార్తిక్,జన్నారపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లిపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సుపోసన దివాస్



కాటారం, సెప్టెంబర్ 23, మనం న్యూస్ : కాటారం మండలంలోని అ ల్లిపూర్ అంగన్వాడీ కేంద్రంలో శ్రీమం త కార్యక్రమం, అన్నప్రాసన, సుపోస నదివాస్ కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్ ముస్కుల శ్రీలత రెడ్డి శని వారం నిర్వహించారు. ఎల్లవేణి మమత అనే గర్భిణికి శ్రీమంతం నిర్వహించారు. అ నంతరం పీక ఆర్యన్‌కు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి అపర్ణ, ఏఎన్ ఎం శ్యామల తోపాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఓల వినతిపత్రం



బచ్చన్నపేట, సెప్టెంబర్ 23, మనం న్యూస్ : బిఎల్‌ఓ లకు కనీస వేతనం పెంచాలని బచ్చన్నపేట తహసిల్దార్ విశాలాక్షికి మండలంలోని పిఎల్‌ఓలు వినతిపత్రం అందించారు. శనివారం బచ్చన్నపేట మండలంలోని గ్రామపంచాయతీలలో విధదులు నిర్వహిస్తున్న బిఎల్‌ఓ లు మాట్లాడుతూ ఎన్నో సంవత్స రాల నుండి బిఎల్వోలుగా పనిచేస్తున్న తమకు గౌరవ వేతనం పెంచాలని అంతేకాకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి గౌరవ వేతనం అందించాలని కోరారు. అలాగే ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించినప్పుడు ఓటర్ నమోదు ఆన్లైన్ చేయుట గురించి కొత్త ట్యాబులను అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి ,లలిత, సంతోష, ఉపేంద్ర, శ్యామల, కనక లక్ష్మి, రేణుక ,లత, మానస, వసంత, శ్రీలత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# 15 కిలోల గంజాయి పట్టివేత

- రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్, మరో ఇద్దరు పరారీ
- స్టేషన్గన్పూర్ ఏసిపి శ్రీనివాసరావు



స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 23, మనం న్యూస్ : అక్రమంగా తరలిస్తున్న గంజాయి 3 లక్షల విలువ చేసే 15 కిలోలు. స్వాధీనం చేసుకుని రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్ పంపినట్లు ఏసిపి ఎస్.శ్రీనివాస్ తెలిపారు స్టేషన్ ఘన్ పూర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలోని పూనేలో ఒక జ్యూస్ కంపెనీ యజమాని యూనిస్ ఖాన్ వద్ద రాజ్ కుమార్ కౌల్ రోజు కూలిగా పని చేస్తున్నాడు. రాజ్ కుమార్ కు మామ అనే వ్యక్తిని పరిచయం చేసి గంజాయి రవాణా చేయించేందుకు వారిద్దరిని ఒడిస్సా పంపాడు. ఒడిస్సాలో పడవ అనే గ్రామానికి వెళ్లి దశరథ్ అనే వ్యక్తిని కలిసి అతడి వద్ద నుండి 15 కిలోల గంజాయిని కోణార్క్ ఎక్స్ప్రెస్‌లో ముంబై తరలిస్తున్నారు. ఈ క్రమంలో తనతో వచ్చిన మామ రైల్‌లో కనబడకపోవడంతో ఆందోళన చెందిన రాజ్ కుమార్ కౌలు ట్రైన్ చైన్ లాగి స్టేషన్ ఘన్ పూర్‌లో దిగిపోయాడు. రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజేష్ కుమార్ కౌలు ను పోలీసులు అదుపులోనికి తీసుకొని విచారించగా వివరాలు వెల్లడించినట్టు ఎసిపి శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు మరో ఇద్దరు నిందితులు పరారులో ఉన్నట్లు ఏసిపి తెలిపారు. నిందితుడు మధ్యప్రదేశ్ కు చెందిన రాజ్ కుమార్ కోల్, ఇటావురా గ్రామం విజయరాగవగర్, కట్ని జిల్లాకు చెందినవాడుగా గుర్తించారు.

# ఎస్పీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో మాక్ ఎలక్షన్స్





హసన్‌పర్తి, సెప్టెంబర్ 23, మనం న్యూస్ : హసన్‌పర్తి మండలంలోని 65వ డివిజన్ ఎల్లాపూర్ శివారులో గల ఎస్‌పిఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సెన్స్ పాఠశాలలో శనివారం మాక్ ఎలక్షన్స్ నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ జగన్మోహన్ తెలిపారు. ఈ ఎన్నికలలో 1458 మంది విద్యార్థులు, 150 మంది బోధన బోధనేతర సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జగన్ మోహన్ మాట్లాడుతూ పాఠశాలలో స్కూల్ పీపుల్ లీడర్, అసిస్టెంట్ పీపుల్ లీడర్, హౌస్ లీడర్, అసిస్టెంట్ హౌస్ లీడర్, జూనియర్ అసిస్టెంట్ హౌస్ లీడర్ పదవులకు ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పదవులకు 62 మంది విద్యార్థిని విద్యార్థులు పోటీలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలు భారతదేశంలో జరిగే సాధారణ ఎన్నికలు, దేశంలోని రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ మాదిరిగా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం, నామినేషన్లు వేయడం, నామినేషన్ల ఉపసంహరణ ఎన్నికల బరిలో నిలిచిన విద్యార్థులకు గుర్తులను కేటాయించి ప్రచారం నిర్వహించడం మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియలో భాగంగా ఏడు పోలింగ్ బూతులు ఏర్పాటు చేసి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్ శనివారం ఉదయం 8 గంటల నుండి ఒంటి గంట వరకు నిర్వహించినట్లు తెలిపారు. 95% విద్యార్థిని విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం ఏడు గంటలకు ఓట్ల లెక్కింపు మొదలుపెట్టి పూర్తి చేసి ఫలితాలను ప్రకటించినట్లు ఆయన తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ ఈ ఎన్నికలు మాలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే కాకుండా ఆత్మవిశ్వాసాన్ని కలిగించిందని వారు తెలిపారు. ఓటు హక్కు చాలా విలువైనదని రానున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శేషగిరిరావు, మాట్లాడుతూ రాజ్యాంగం మన కల్పించిన ఓటు హక్కు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఉద్దేశంతో మాక్ ఎన్నికలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. సమాజంలో పౌరులు వారి ఓటు హక్కును వినియోగించుకొనేలా చేయడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికైన విద్యార్థిని విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ జగన్ మోహన్, ప్రిన్సిపాల్ శేషగిరిరావు అభినందించారు.

## శివునిపెల్లి గ్రామసభలో అధికారులపై మండిపాటు

- డిపిఓ, ఎంపీడీవో జీతాలు నిలుపుదల చేయండి కలెక్టర్ కోరిన గ్రామస్తులు




స్టేషన్గన్పూర్, సెప్టెంబర్ 23, మనం న్యూస్ : శివునిపెల్లి గ్రామపంచాయతీ పరిధిలో కిషోర్ చేసిన అవినీతి డబ్బులు ఎప్పటికీ రికవరీ చేయలేదని డిపిఓ ఎంపీడీవో జీతాలు నిలుపుదల చేస్తేనే మా డబ్బులు మాకు వస్తాయని గ్రామస్తులు గ్రామసభలో అధికారులను నిలదీశారు. శివునిపెల్లి గ్రామ ఏకైక వార్డు సభ్యులు బూర్ల విష్ణు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఇన్చార్జి ఎంపీడీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గ్రామస్తులు పాల్గొన్నారు గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని పట్టించుకోవడంలో అధికారుల విఫలమయ్యారని ఇన్చార్జి ఎంపీడీవో ఉండడం వలన ఇబ్బందులు పడుతున్నామని గ్రామపంచాయతీ పరిధిలో రావలసిన నిధులు విధులు సక్రమంగా రావడం లేదని రోడ్డు వెడల్పు కార్యక్రమంలో వేసిన విద్యుత్ స్తంభాలకు డబ్బులు కట్టామని అయితే గ్రామంలో ఇంకా దాదాపు 30 విద్యుత్ స్తంభాల అవసరం ఉండగా డబ్బులు కట్టమని అడగడం ఎంతవరకు సమంజసం అన్నారు అదేవిధంగా స్మశాన వాటికలో ఇప్పటివరకు అభివద్ధి జరగలేదని సిసి రోడ్లు వెయ్యలేదని. చుట్టూ ఫెన్సింగ్ చేస్తామని చెప్పారు తప్ప ఇప్పటివరకు చేయలేదని. గ్రామసభలో అధికారులు చెబుతున్న మాటలకు తర్వాత పనులకు పొంతన లేకుండా పోతుందని తోట లక్ష్మి నారాయణ తీవ్రంగా విమర్శించారు తోట రమేష్ మాట్లాడుతూ అధికారులు సరిగా పనిచేయడం లేదని సభలకే పరి మితం కావడం వలన తర్వాత ఇష్టం వచ్చిన రీతిలో పనులు చేస్తున్నారని కలెక్టర్ ప్రత్యేకమైన దష్టి శివునిపల్లి పైన పెట్టాలని వారు కోరారు గ్రామంలో దాదాపు 30 రోడ్లకు సిసి రోడ్లు వేయాలని తీర్మానం పెట్టారు అదేవిదంగా విద్యుత్ స్తంభాలు. డ్రైనేజీ. ఇతర పనుల కోసం గ్రామస్తులు కలిసి తీర్మానాలు చేసుకుంటే నేను వచ్చి తప్పకుండా పనులు చేస్తారని ఎంపీడీవో తెలిపారు స్థానిక ఎంపీటీసీ రాజు మాట్లాడుతూ అభివద్ధి పనులు చేయుటలో గ్రామస్తులందరూ కలసి పనిచేస్తేనే పనులు పూర్తయితాయని వారన్నారు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామాల అభివద్ధి చెందాయని లక్షల నిధులు వచ్చాయని అవి ప్రస్తుతం మనం కొన్నింటిని వినియోగించుకున్నామని ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయని వారన్నారు. ఈ సభలో పలువురు ప్రజాప్రతినిధులు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## డాక్టర్ పాల్సన్ రాజును ప్రశంసించిన ప్రముఖులు



కరుణాపురం, సెప్టెంబర్ 23, మనం న్యూస్: లండన్‌లో ఇంటర్నేషనల్ ఎక్సెలెన్స్ అవార్డు 2023 అందుకున్న కరుణాపురం క్రీస్తుజ్యోతి మినిస్ట్రీస్, సొసైటీ ఆఫ్ క్రైస్ట్ పౌండర్ రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్‌రాజ్ ను శనివారం నాడు నూతన క్రీస్తుజ్యోతి ప్రార్ధన మందిరంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ప్రముఖులు ఘనంగా సన్మానించారు. సొసైటీ జనరల్ సెక్రటరీ రెవరెండ్ డాక్టర్ జయప్రకాశ్ గోప్పు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఆసియా లోనే అతిపెద్ద ప్రార్ధన మందిరం నిర్మించడంలో పాల్సన్‌రాజ్ కషి అనిర్వచనీయమైనదని అన్నారు. లండన్ బ్రిటీష్ పార్లమెంటులో ఇటీవల అవార్డు అందుకోవడం భారతదేశానికే గర్వకారణమని కొనియాడారు. ఈ మందిరంలోని రాగానే గొప్ప అనుభూతి, సంతోషం, సమాదానము పోందామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమీషన్ వైస్ చైర్మన్ శంకర్ లూకె, నెహెమ్యా బిషప్, ఎల్‌పి రాజు, మంద కుమార్, దర్మన్ సింగ్, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికలను చదివిస్తేనే మహిళా సాధికారత సాధ్యం



చెన్నారావుపేట, సెప్టెంబర్ 23, మనం న్యూస్ : చెన్నారావుపేట మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమముపై శనివారం అవగాహన కల్పించడం జరిగిందని జిల్లా మహిళా సాధికారత బందం తెలిపారు. ఈ సందర్భంగా డి హెచ్ ఈ డబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ హర్షిత మాట్లాడుతూ. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, బాలికలను చదివిస్తే మహిళా సాధికారత సాధ్యమైతుందని పేర్కొన్నారు. స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్సియల్ లిట్రసి సుజాత బాలికలకు బాల్య వివాహాలు, బాల కార్మికులు, గహహింస చట్టం, చైల్డ్ లైన్, సఖి సెంటర్, భరోసా సెంటర్, హెల్ప్ లైన్ సెంటర్, 181, 100, 1098 వాటిపై అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, పాఠశాల అధ్యాపకులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## నర్మెట్ట చౌరస్తాలో బస్సులు నిలపడంతో ప్రమాదాలు



నర్మెట్ట, సెప్టెంబర్ 23, మనం న్యూస్ : నర్మెట్ట మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బస్సులు ఇతర వాహనాలు చిరు వ్యాపారులు రోడ్లపై దుకాణాలు పెట్టడంతో రోడ్డు వైపు వెళ్లే ప్రజలకు వాహనదారులకు ఇబ్బందికరంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కొన్ని సందర్భాలలో ప్రయాణికులకు ప్రమాదాలు జరిగి ఆసుపత్రి పాలైన రోజులు ఉన్నాయి చౌరస్తా సమీపంలోని వైన్ షాపులు ఉండడంతో మద్యం తాగి చౌరస్తాలో అతివేగం వాహనాలు నడపడంతో వద్ధులకు పిల్లలకు వాహనాలు తగిలి గాయాలైన రోజులు కూడా ఉన్నాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు సర్పంచు స్పందించి వెంటనే డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సులను పాత బస్టాండ్ లో నూతనంగా నిర్మాణం చేసిన పాత బస్టాండ్ వద్ద ఆపే విధంగా చూడాలని గ్రామ ప్రజలు కోరుచున్నారు. కాగా చిరు వ్యాపారులు కూడా రోడ్డుపైన దుకాణాలను పెట్టకుండా రోడ్డుకు దూరంగా పెట్టే విధంగా సర్పంచ్ చర్యలు గైకొనాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పాక రాజయ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదానం



కాజీపేట, సెప్టెంబర్ 23, మనం న్యూస్ : కాజీపేట పట్టణంలోని 62వ డివిజన్లో రహమత్ నగర్‌లో పాక రాజయ్య యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు పాక ఓంప్రకాష్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా "మహా అన్నదానం" కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మాజీ డిసిసిబి చైర్మన్ జంగా రాఘవరెడ్డి, స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్,సిఐ సంతోష్ లు అజయ్ మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.సి.సీ.యస్ డైరెక్టర్ రాజ్ కుమార్, రైల్వే డాక్టర్ హరిబాబు,రైల్వే జేఏసి కన్వీనర్ రాఘవేందర్, కొండ్రా నర్సింగ్, రైల్వే మజ్దూర్ యూనియన్ చైర్మన్ డీజల్ షేడ్ బ్రాంచ్ పాక వేద ప్రకాష్, పాము యాదగిరి, చంద్రగిరి యాదగిరి స్వామి, పాకచంద్ర ప్రకాష్, జిన్నా రాజిరెడ్డి, పాము రాజేష్ కుమార్, సదానందం,గోపు సుధాకర్, బొందయ్య, మహేష్, ప్రదీప్, టోనీ, పాము రాజ్ కుమార్, స్వప్న, రజియా, అజయ్ తదితరు పాల్గొన్నారు.

## వైశ్య గర్జనకు హాజరు కావాలని అమరవాదికి ఆహ్వానం అందజేత



ఎల్బీనగర్, సెప్టెంబర్ 23. (మనం న్యూస్): అక్టోబర్ 1 న సరూర్ నగర్ స్టేడియంలో జరుగబోయే వైశ్య గర్జనకు హాజరు కావాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మినారాయణకి ఆహ్వానం అందిస్తున్నా రాష్ట్ర మహాసభ కార్యదర్శి, వికాస వేదిక చైర్మన్, వైశ్య ఘర్జన నిర్వాహకులు కాచం సత్యనారాయణ గుప్త. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య చైతన్య పోరాట సమితి నేషనల్ అధ్యక్షుడు ప్రేమ్ గాంధీ, మోగిల్ల పల్లి ఉపేందర్ గుప్త, బుక్క ఈశ్వరయ్య, దయాకర్, రమేష్ తదితరులు ఉన్నారు.

## గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అరవింద్ శర్మ



ఎల్బీనగర్, సెప్టెంబర్ 23. (మనం న్యూస్): ఆర్కే పురం డివిజన్లోని టెలిఫోన్ కాలనీలో గణేష్ యువజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానంలో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, కంచర్ల శేఖర్, నిర్వాహకులు వెంకటరెడ్డి ,లతీష్, బాలరాజ్, విజయ్ కుమార్, సురేష్, పవన్, శివ, శ్రవణ్, రాము, శ్రీధర్, విశాల్, దయాకర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## జనహృదయనేత మంత్రి మహేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్



తాండూరు. సెప్టెంబర్ 23. మనం న్యూస్; రాష్ట్ర గనులు భూగర్భ సమాచారం శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి కి తాండూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విటల్ నాయక్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్ లోని మంత్రి మహేందర్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకో వాలని కోరారు. అదేవిధంగా మరెన్నో ఉత్తమ పదవులు చేపట్టాలని భగవంతుని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో యాలల మండలం ఎంపీపీ బాలేశ్వర గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఆశన్న, సప్తగిరి గౌడ్, యలల పిఎసిఎస్ వైస్ చైర్మన్ వడ్డె రాములు, అమర్నాథ్ రెడ్డి లాలప్ప శేఖర్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు తదితరులు ఉన్నారు.

## నేడు బుచన్ పల్లిలో అన్నదాన కార్యక్రమం



మర్పల్లి, సెప్టెంబరు 23. మనం న్యూస్: వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని బుచన్‌పల్లి గ్రామంలో అన్నదానం కార్యక్రమం ఉన్నందున అందరూ ఆహ్వానితులే అని పేర్కొన్నారు ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు పూజ అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించ గలరని గ్రామ యువకుడు అన్నదాన కార్యక్రమం కర్త మరికింది శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు

## ప్రజా నాయకుడు పట్నం మహేందర్ రెడ్డి

- మంత్రికి గజమాలతో సత్కరించి
- శుభాకాంక్షలు తెలిపిన బిర్కడ్ రఘు



తాండూరు, సెప్టెంబరు 23. మనం న్యూస్ : తెలంగాణ రాష్ట్ర సమాచార, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి మహేందర్ రెడ్డిపై యువ అభిమానం ఏమాత్రం తగ్గలేదు. శనివారం హైదరాబాద్ లోని మంత్రి నివాసంలో బీఆర్ఎస్ యువనాయకులు మంత్రి మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాండూరకు చెందిన నాయకులు బిర్కడ్ రఘు ఆధ్వర్యంలో యువనేతలు మహేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. జన్మదినం సందర్భంగా మంత్రి మహేందర్ రెడ్డికి భారీ గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిడ్కర్ రఘు మాట్లాడుతూ మంత్రి మహేందర్ రెడ్డి ప్రజా నాయకుడు అని అభివర్ణించారు. తాండూరు ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. మంత్రి మహేందర్ రెడ్డి వెంట నడుస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు దత్తు, పునీత్ తదితరులు ఉన్నారు.

# నిరుద్యోగులతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం

- మినీ డీఎస్సీ కాదు మెగా డీఎస్సీ వేయాలి
- తాండూరులో ఆందోళన చేపట్టిన డీఎస్సీ అభ్యర్థులు
- సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ పార్టీల నేతలు,
- బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్ కుమార్
- విద్యార్థి సంఘాల నాయకులు ధ్వజమెత్తారు






తాండూరు, సెప్టెంబరు 23. మనం న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో సర్కారు నిరుద్యోగులతో చెలగాటం ఆడడం మంచిది కాదని తాండూరు సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు ధ్వజమెత్తారు. శనివారం డీఈడీ, బీఈడీ అభ్యర్థులు సంఘం, నిరుద్యోగుల, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థుల నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి కల్వ సుజాత, కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్ తదితరులు మద్దతు తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు ఆరోపించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ పోస్టులపై అభ్యంతరం తెలియజేస్తూ తాండూర్ పట్టణంలో నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచిందన్నారు. ఉద్యోగ విరమణ, బదిలీలు తదితర ఖాళీలతో పాటు పూర్తిస్థాయిలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా, కేవలం కంటి తుడుపుగా అరకొర పోస్టులను ప్రకటించిందన్నారు. ప్రస్తుతం అన్ని కలిపి సుమారు 23 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మినీ డీఎస్సీ వద్దని మెగా డీఎస్సీని వేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులు, ప్రజలు గట్టి గుణపాఠం చెప్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ సంఘం నాయకులు సయ్యద్ షుకూర్, లక్ష్మణాచారి, విద్యార్థి సంఘాల నాయకులు శివకుమార్, దీపక్ రెడ్డి లతోపాటు పలువురు నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థులు ఆందోళనలో పాల్గొన్నారు.

## నేడు విపంచి కళా నిలయంలో బిసి సాధికారతపై సదస్సు




సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 23, మనం న్యూస్: 33 శాతం మహిళా బిల్లులు, బిసి మహిళా వాటా ఎంత అనే అంశంపై స్పష్ట ఇవ్వాలని బిసి కులాల ఐక్యవేదిక కన్వీనర్ పోచబోయిన శ్రీహరి యాదవ్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యునతి కోసం మహాత్మా జ్యోతి రావుపూలే, సావిత్రిబాయి పూలేలు ఏర్పాటు చేసిన సత్యశోధక సమాజం ఏర్పడ్డ సెప్టెంబర్ 24వ రోజున సిద్దిపేట విపంచి కళా నిలయంలో బిసి సాధికారతపై సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఆలోచపరులారా రండి.... సమాలోచ చేద్దాం. అనే పేరుతో బిసి ఐక్యవేతిక ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ సదస్సులో మహిళా బిల్లులో బిసి మహిళలకు వాటా ఎంత దక్కుతుందని, చట్ట సభల్లో బిసిలకు రిజర్వేషన్‌కల్పించాలనే పలు డిమాండ్‌లపై చర్చ జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ఆలోచనరపరులు, మేధావులు, ప్రజలు అధక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# బీడి కార్మికులకు ఎమ్మెల్సీ కవిత భరోసా



సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 23, మనం న్యూస్: బీడి కార్మికులకు ఇచ్చే ఆసరా పెన్షన్‌కు 2014 సంవత్సరం నుండి పిఎఫ్ కటాఫ్ తేదీ ఎత్తివేసేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర బీడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందించారు. శనివారం తెలంగాణ రాష్ట్ర బీడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బీడి కార్మికులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసానికి వెళిల వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూఇనయన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుల రూప్‌సింగ్, రాష్రట అధ్యక్షులు మంచె నర్సింలు, టేకేదారులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి ఐలారెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వా తెరాస ప్రభుత్వంబీడి కార్మికులకు మొట్టమొదటిసారిగా గుర్తించి వారికి పెన్షన్ ఇచ్చిన సీఎం కేసీఆర్ కార్మిక్కల కుటుంబాల్లో భరోసాల కల్పిస్తూ వారి ముఖాల్లో చిరునవ్వులు చిందేలా చేస్తున్నారన్నారు. బీఇ కార్మికులకు ఇచ్చే ఆసరా పింఛన్లకు పిఎఫ్ కటాఫ్ తేదీ 2014 సంవత్సరం తీసివేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కొన్ని యూనియన్ల నాయకులు కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాయమాటలకు మోసపోవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా జిల్లాల బీడి టేకేదార్ల ప్రతినిదులు, బీడి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఆశీర్వదించండి

- అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తాం
- ఎంఎల్‌ఏ ఈటెల రాజేందర్



మణుగూరు, సెప్టెంబర్ 23. (మనం న్యూస్) : వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఆశీర్వదించండి, అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామని హుజురాబాద్ ఎంఎల్‌ఏ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని స్థానిక గిరిజన భవన్ నందు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. తొలిత పినపాక నియోజకవర్గం బిజెపి నాయకులు అందరూ కలిసి మెయిన్ రోడ్ నందు ర్యాలీ నిర్వహించారు. తదుపరి బోనం ఎత్తి సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన వెలిగించారు. నియోజకవర్గం బిజెపి నాయకులు మణుగూరు మండల అధ్యక్షుడు పున్నమ్ బిక్షపతి ఆధ్వర్యంలో పినపాక నియోజకవర్గం సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బిజెపి నాయకులు హుజరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని సీఎం కేసీఆర్ పై తీవ్ర విమర్శలు చేశారు. రైతుబంధు పేరుతో అధిక భూమి ఉన్న వారికి కూడా రైతుబంధు ఇవ్వడం సరికాదని కౌలు రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇక టెన్షన్ విషయానికొస్తే ఒక ఇంట్లో ఒకరికి పెన్షన్ ఇవ్వడం కేసీఆర్‌కి సాధ్యమని మా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధాప్య పెన్షన్ ఒకే ఇంట్లో ఇద్దరికి పెన్షన్ ఇస్తామని తెలియజేశారు. కేసీఆర్ 10 సంవత్సరాలలో వారి కుటుంబం బాగు పడిందే తప్ప ప్రజలకు చేసిన మంచి కనబడటం లేదని కావున ప్రజలందరూ కేసీఆర్ మాయమాటలు నమ్మకుండా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పూర్తి ఏజెన్సీ నియోజకవర్గలలో కెసిఆర్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని వచ్చే ఎన్నికల్లో బిజెపికి ఓటు వేసి ప్రజలు గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామని రాజేందర్ అన్నారు. కెసిఆర్ బంగారు తెలంగాణ అని ఎంతో అభివృద్ధి చేశానని చెప్పుకుంటున్నారు తప్ప ఆ మాయమాటలు నమ్మొద్దని ప్రజలకు తెలియజేశారు. ప్రజలు బిజెపిని గెలిపిస్తే అసలు బంగారు తెలంగాణ ను అభివృద్ధి చేస్తానని చెప్పి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాకు మాట ఇచ్చారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం బిజెపి నాయకులు సభ అధ్యక్షులు పున్నం బిక్షపతి పినపాక అసెంబ్లీ కన్వీనర్ ముఖ్య అతిథి ఈటల రాజేందర్ ఎమ్మెల్యే హుజురాబాద్, అతిధులు గరికపాటి మోహన్రావు మాజి ఎంపీ, చాడా సురేష్ రెడ్డి మాజీ ఎంపీ, కూన శ్రీశైలం గౌడ్ మాజీ ఎమ్మెల్యే, రాజా యాదవ్ , భద్రాద్రి జిల్లా ఇన్చార్జి రుక్మారావు, అజ్మీర కృష్ణవేణి నాయక్, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ,జంపన సీతారామ రాజు, ముసుకు శ్రీనివాసరెడ్డి ,పుల్లారావు జాడి దేవేంద్ర వరప్రసాద్ , బుక్యా సీతారాం నాయక్, ఎడ్లపల్లి శ్రీనివాస్, సోమ సుందర్ ,ఏనుగుల వెంకటరెడ్డి, ఈసాల వెంకటేశ్వర్లు, మెరుగు రవీంద్రనాథ్ ,ముఖ్య దివ్యశ్రీ బాలు నాయక్, బిజ్జం శ్రీనివాసరెడ్డి ,పార్లమెంట్ విస్తారక్ శ్రీనివాసచారి, అసెంబ్లీ విస్తరణ చిర్ర సరస్వతి, దాట్ల రామచందర్, రామచంద్ర ముత్యాల వెంకటేశ్వర్లు, బత్తుల రామకృష్ణ, శ్రీరామ్ చంద్రయ్య, యానం వెంకటేశ్వర్లు, మణుగూరు పట్టణ అధ్యక్షులు లింగంపల్లి రమేష్ .మండల అధ్యక్షులు కుంజా రామకృష్ణ. తదితరలు పాల్గొన్నారు.

# ఎంఎల్‌ఏ ఇల్లు ముట్టడించిన అంగన్‌వాడీలు

- కాంగ్రెస్‌కు అధికారం వస్తే పర్మినెంట్ చేస్తాం
- భద్రాచలం శాసనసభ్యులు పొదెం వీరయ్య



భద్రాచలం, సెప్టెంబర్ 23. (మనం న్యూస్) : అంగన్వాడీలచే భద్రాచలం శాసనసభ్యులు ఇల్లు ముట్టడించారు. తెలంగాణ రాష్టంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అంగన్వాడీలను సమాన పనికి సమాన వేతనం ఇస్తామని సర్వీస్ రెగ్యులర్‌కు తగు చర్యలు తీసుకుంటాం అని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య హామీ ఇచ్చారు. శనివారం భద్రాచలంలో ఏఐటీయూసీ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఇల్లు ముట్టడి సందర్భంగా పొదెం వీరయ్య మాట్లాడుతూ తెలంగాణ సీఎం కెసిఆర్ అంగన్వాడీల సమస్యలుపై ద్రుష్టి సారించాలి అని మంత్రి సత్యవతి రాథోడ్ అసత్య ప్రచారాలు చేస్తుంది అని సిత్త శుద్ధిలేని వైఖరితో ప్రభుత్వం ఉన్నది అని తెలంగాణలో రాష్టంలో కాంగ్రెస్ అదికారం రావటంతో అందరికి కనీస వేతనము ఇస్తాం అని కాంగ్రెస్ అని అన్నారు, ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ కెసిఆర్ ఎన్నికల హామీలో చెప్పిన హామీలు అమలు చెయ్యాలి అని అంగన్వాడీలు కోరుతున్నారు అని అందరిని పర్మినెంట్ చేస్తా సమాన పనికి సమాన వేతనమ్ ఇస్తాం అని హామీ అమలుకు పది ఏళ్ళు అవుతున్న కెసిఆర్‌కు టైం దొరకటం లేదా అని విమర్శించారు ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మచారి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఆకోజు సునీల్, వి, మల్లికార్జున్, రామి రెడ్డి, నర్సారెడ్డి, ఏఐటీయూసీ అంగన్వాడీ రాష్ట్ర నాయకులు రెడ్డి అరుణ, కృష్ణ కుమారి, పార్వతి, మీనా, సమ్మక్క, నర్సమ్మ, రత్నకుమారి, చిన్నారి, తదితరులు పాల్గొన్నారు

## హరీశ్వర్ రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించిన మంత్రులు



పరిగి, సెప్టెంబర్ 23. మనం న్యూస్ ; పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్ రెడ్డి భౌతిక కాయానికి మంత్రులు కేటీఆర్ హరీష్ రావు జగదీశ్వర్ రెడ్డి శ్రీనివాస గౌడ్ రంజిత్ రెడ్డి అందరూ నివాళులు అర్పించారు కన్నీరు మున్నిరవుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులను మంత్రులు ఓదార్చుతూ ప్రగాఢ సానుభూతిని తెలిపారు

## ఆ పార్టీ వీడి సొంత గూటికి డాక్టర్ సంపత్ కుమార్

- రాష్ట్ర వ్యవహాల ఇంచార్జి మాణిక్యం ఠాగూర్ సమక్షంలో చేరిక



తాండూర్, సెప్టెంబర్ 23. మనం న్యూస్ : తాండూర్ పట్టణానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ సంపత్ కుమార్ ఆపార్టీ వీడి సొంత గుడికి చేరారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పనిచేసిన డాక్టర్ సంపత్ కుమార్ బిఆర్ఎస్ పార్టీలో చేరి కొంతకాలం పాటు ఆ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. టిపిసిసి రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఖమ్మం జిల్లా సీనియర్ నాయకుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల ద్వారా రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మాణిక్యం ఠాగూర్ సమక్షంలో ఢిల్లీ వేదికగా డాక్టర్ సంపత్ కుమార్ కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో కాంగ్రెస్ పార్టీ టికెట్ ను ఆశించిన డాక్టర్ సంపత్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు కొన్ని నెలలుగా వస్తున్న వార్తలు నిజమయ్యాయని పలువురు చర్చించుకుంటున్నారు

## ఘనంగా మంత్రి మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



తాండూరు, సెప్టెంబర్ 23. మనం న్యూస్ : రాష్ట్ర ఫౌర సమాచార, గనులు భూగర్భ వనరుల శాఖ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం రోజు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, మంత్రి నివాసంలో జరిగిన జన్మదిన వేడుకలలో పాల్గొని భారీ గజమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఫౌర సమాచార, గనులో భూగర్భ జలా వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీలో కీలక పాత్ర పోషించడమే కాకుండా పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. అదేవిధంగా రెండుసార్లు మంత్రి పదవిని చేపట్టి తాండూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేశారని గుర్తు చేశారు. ఈ జన్మదిన సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులు అభిమానులతో కలిసి కేక్లు కట్ చేశారు. అనంతరం మంత్రి మహేందర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రంజిత్ రెడ్డి, బషీరాబాద్, తాండూర్, పెద్దేముల్, యాలాల మండలాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పలువురు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక అందజేయాలి

- కలెక్టర్

సూర్యాపేట, సెప్టెంబర్ 23. మనం ప్రతినిధి: 2014 నుండి ఇప్పటి వరకు జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రగతి నివేధికను తయారు చేసి అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. అభివృద్ధి నివేధికలతో పాటు ఆసర పెన్షన్ కేటగిరివారిగా లబ్ధిదారుల వివరాలు, రైతుబంధు, బీమా, రుణమాఫి జాబితాతో పాటు 24గం. ఉచిత విద్యుత్ పొందుతున్న అన్నదాతల వివరాలు అందించాలని, దీంతోపాటుగా వివిధ సంక్షేమ శాఖల లబ్ధిపొందుతున్న వారి వివరాలు తయారు చేసి వెంట నే అందించాలని, ఇందులో ఎలాంటి పోరపాట్లు లేకుండా నివేదికలు రూపొందించాలని, మరింత సమాచారం కొరకు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిని సంప్రదించాలని




సూచించారు. అనంతరం ఎన్నికల విధివిధానలపై సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సెక్టోరల్ అధికారులు తమకు కేటాయించిన విధులను సమవర్ధవంతంగా చేపట్టాలని తెలిపారు. సెక్టోరియల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కోన్నారు.



ఈ కార్యక్రమంలో అధనపు కలెక్టర్‌లు ప్రియాంక, వెంకట్‌రెడ్డి, ఎస్పీ రాజేంద్ర ప్రసాద్, ఆర్‌డిఓలు వీరబ్రహ్మాచారి, సూర్యనారాయణ, జగదీశ్వర్ రెడ్డి, డీఎస్పీలు నాగభూషణం, రవి, పిడి కిరణ్, సిపిఓ వెంకటేశ్వర్లు, డిఎఓ రామరావు నాయక్, డిహెచ్ఓ శ్రీధర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గోన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పహారం



తిరుమలగిరి, సెప్టెంబర్ 23. మనం న్యూస్: పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం బాటసారులు, రోగులకు అల్పహారాన్ని పంపిణి చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పద్మారెడ్డి మాట్లాడుతూ. నిరుపేద, సామాన్య ప్రజలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ ఉద్దేశ్యమని, క్లబ్‌లో సభ్యత్వం తీసుకుని ప్రతి ఒక్కరికి సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కందుకూరి లక్ష్మయ్య, సభ్యులు డా. సురేష్‌కుమార్, రాంచందర్ గౌడ్, శ్రీను, సోమేష్ పాల్గోన్నారు.

## మోడీకి పాలాభిషేకం



తిరుమలగిరి, సెప్టెంబర్ 23. మనం న్యూస్: ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదింపచేసి, మహిళా సాధికారతను కల్పించినందుకు ప్రధాని మోడీకి మహిళా మోర్చా నాయకురాళ్లు శనివారం క్షిరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బిజేపి పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ చీరబోయిన హన్మంతుయాదవ్, మహిళా నాయకురాలు ఈదునూరి జ్యోతి, మంజులారెడ్డి, రమాదేవి, ప్రమీలా, నాయకులు యాదగిరి, ఇమ్మడి వెంకటేశ్వర్లు, శుభాష్‌రెడ్డి, నిర్మల, మల్లయ్య, నవీన్, సురేష్‌రెడ్డి, రత్నాకర్, సోమనర్సయ్య, ప్రమీలా, అంజమ్మ, ఉపేంద్ర, పద్మా, సైదమ్మ, మంజులా, సోమమ్మ, యాకమ్మ, శోభ, లావాణ్య, బాలమ్మ, నాగమ్మ, తదితరులు పాల్గోన్నారు.

## పల్లె దవఖానాను పరిశీలించిన అధికారి



తిరుమలగిరి, సెప్టెంబర్ 23. మనం న్యూస్: మండల పరిధిలోని వెలిశాల గ్రామ పల్లె దవఖానాను జిల్లా వ్యాధినిరోధక అధికారి పెండెం వెంకటరమణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక కార్యక్రమాన్ని అడిగితెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ. గర్భిణి అయినప్పటి నుండి ఐదు సంవత్సరాల పిల్లల వరకు విధిగా సకాలంలో తప్పనిసరిగా వ్యాధినిరోధక టీకాలను అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ బిచ్చు నాయక్, రామచంద్రు, ఆశవర్కర్లు తదితరులు పాల్గోన్నారు.

## అన్నదాన కార్యక్రమం



సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 23. మనం న్యూస్: పట్టణంలోని 29వ వార్డు తాళ్లగడ్డ నందు గణనాధుడికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శనగాని రాంబాబు గౌడ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ. వినాయక చవితి ఉత్సవాలు భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారని, ప్రతినిత్యం విఘ్నేషున్ని ఆరాధిస్తు కులమతాలకు అతీతంగా యువత ఉత్సహంగా పాల్గోనటం ఎంతో సంతోషమని పేర్కోన్నారు. అనంతరం అన్నధాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# అక్రమాలు ఆనాడు కనబడలేదా

సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 23. మనం న్యూస్: మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తన పక్కన 9 ఏండ్లుగా తిరిగినప్పుడు డిసిఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ అక్రమాలు కనబడలేదా అని బిసి వైపి వ్యవస్థాపక అధ్యక్షుడు పోడే రామచంద్రయ్య యాదవ్ ప్రశ్నించారు. శనివారం గాంధీనగర్‌లోని జానయ్య యాదవ్ నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. సూర్యాపేటలో ప్రజాస్వామ్యం చచ్చిపోయినట్లు పోలీసులు ప్రవర్తించడం సరికాదన్నారు. యాదవులు గొర్రెలను కాసే కాపరులుగా మాత్రమే చూస్తున్నారని, దేవతకు గొర్రెలను బలి ఇచ్చినట్లు యాదవులను రాజకీయంగా బలి తీసుకుంటున్నారని ఆరోపించారు. అగ్రనాయకులు అధికారంలోకి రావడానికి బిసిలను వాడుకుంటున్నారని, అధికారంలోకి రాగానే అక్రమకేసులు బనాయించి రాజకీయంగా ఎదగనీయడంలేదన్నారు. ఒక బిసి నాయకుడిపై అక్రమ కేసులు పెట్టి హింసించడం సరికాదని, దీనికి బహుజనులంతాకలిసి అగ్రకులా



లకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అంతకుముందు జానయ్య యాదవ్ కుటుంబ సభ్యులను కలిసి సంఘిభావంతెలిపి, భరోసా కల్పించారు.

# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



పాలకీడు, సెప్టెంబర్ 23, మనం న్యూస్ : డెక్కన్ సిమెంట్స్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ప్రజల మన్నలను అందుకుంటూ శనివారం మండల పరిధిలోని రావిపహడ్ గ్రామంలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రూ. 45లక్షలతో అదనంగా సీసీరోడ్డు, సోలార్ విద్యుత్ దీప స్థంబాలు, మరుగు దోడ్లు, బాడీ ఫ్రీజర్ అంగన్వాడీ సెంటర్ల రిపేర్లు, రోడ్డు రిపేర్లు, డ్రైనేజీ, బృహాత్ నిర్మాణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీనివాసరాజు, ఛీఫ్ జనరల్ మేనేజర్ నాగమల్లేశ్వర్‌రావులు ప్రారంభించి మాట్లాడుతూ. గ్రామ స్వరాజ్య లక్ష్యాలు నెరవేరాలంటే గ్రామాల్లో మౌలిక సదుపాయాల రూపకల్పన అనేది ఎవరు కూడా నిర్లక్ష్యం చేయలేని అతి ముఖ్యమై అంశమని అందరికి స్ఫూర్తిని కల్పించారు. అత్యంత వ్యయ ప్రయాసలతో ఈ సౌకర్యాలు కల్పిస్తున్న డెక్కన్ సిమెంట్స్ యాజమాన్యానికి గ్రామప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నంబూరి కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ చిమట లక్ష్మమ్మ, వార్డు మెంబర్లు రామాంజనేయులు, సుందర్‌రావు, గ్రామపెద్దలు కంజుల సంజీవ్ రెడ్డి, గంగ్ర బాలకృష్ణ, వీరయ్య, వీరబాబు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ స్వచ్ఛత లీగ్‌పై విద్యార్థులకు అవగాహన

హుజూర్‌నగర్, సెప్టెంబర్ 23, మనం న్యూస్: ఇండియన్ స్వచ్ఛత లీగ్ -2.0 కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 2వరకు పారిశుద్యం, తడి పొడి చెత్తను వేరు చేయడం, హోం కంపోస్ట్ తయారీ పైన పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. పట్టణం నుండి వాలంటీర్స్‌గా రిజిస్టర్ అయిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థినివిద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల వారి సహయసహకారాలతో క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు, ఉపాధ్యాయులకు తడిచెత్త, పొడి, హానికరమైన చెత్తను వేరు చేయుట పైన, హోం కంపోస్ట్ తయారీపై ప్రయోగాత్మక అవగాహణ కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా పాఠాలు బోధించే ఉపాధ్యాయులకు సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిర్మూలించుటలో ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ యాకూబ్ పాషా, కళాశాల ప్రిన్సిపల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్, వార్డు అధికారులు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




# పీడీఎస్‌యూ జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

- పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందర్‌రావు



హుజూర్‌నగర్, సెప్టెంబర్ 23, మనం న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగ పరిస్థితులపై ఈనెల 25న సూర్యాపేట జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్య సదస్సు విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చందర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి పిడిఎస్‌యూ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సదస్సులో విద్యా రంగ సమస్యలు, సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై విద్యార్థులకు సంబంధిత మేదావుల చే అవగాహణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.ఈ సదస్సులో విద్యార్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సుజాత, సైదమ్మ, జరినా బేగం, జ్యోతి, స్వాతి, రాజేశ్వరి, పవని, తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుని ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలి

- కోదాడ మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతి



హుజూర్‌నగర్, సెప్టెంబర్ 23, మనం న్యూస్: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని 3వ వార్డు పరిధిలో ఉన్న గణేష్ నగర్ నందు నిర్వహిస్తున్న వినాయకుని ఉత్సవాల్లో కోదాడ మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతి శనివారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహఅన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ. వినాయకుని ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని ఉత్సవాల నిర్వహణ ద్వారా ప్రజలందరూ ఎటువంటి బేదాభిప్రాయాలు లేకుండా ఐక్యమత్యంగా ఉంటారన్నారు. అన్నదానం ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవకమిటీ సభ్యులను ఆమే అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోతి సంపత్‌రెడ్డి, ఆదెర్ల శ్రీనివాస్‌రెడ్డి, కోతి లింగారెడ్డి, ఉత్సవకమిటీ సభ్యులు, వట్టికూటి శ్రీనివాస్,సక్రునాయక్, సురేష్‌నాయక్, శోభన్, అంజయ్య, వెంకటేశ్వర్‌రావు, గంజి శివ, రామిశెట్టి శ్రీనివాస్, చేపూరి అనంత రాములు,సాయి, భక్తులు పాల్గొన్నారు.



## చెత్త నుండి అద్భుతాలు పోటీలు



సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 23. మనం న్యూస్: చెత్త నుండి అద్భుతాలు అనే పోటీలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమీషనర్ రామాంజులరెడ్డిలు తెలిపారు. శనివారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా వెస్ట్ టు వండర్ కంపిటేషన్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. మున్సిపాలిటీలోని వార్డులలో నుండి వచ్చే చెత్తతో ప్రజోపయోగ వస్తువుల తయారిపై ఆసక్తి ఉన్నవారు ఈ పోటీలో పాల్గోనాలనుకుంటే చరవాణి సంఖ్య 9908487165 ను సంప్రదించి తమ వివరాలను ఈ నెల 28లోపు నమోదు చేసుకోవాలని, వివరాలు నమోదు చేసుకున్న వక్తులు వారు ఈ నెల 30న తయారు చేసిన వస్తువుల ప్రదర్శించాల్సి ఉంటుందని, అనంతరం విజేతలను ప్రకటించి బహుమతులను ఇవ్వనున్నట్లు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, ఎఈ జికెడి దుర్గాప్రసాద్, ఆర్ఓ జ్ఞానేశ్వరీ, ఈఇ శివప్రసాద్, ఎస్ఎస్ ఆర్ ప్రసాద్, తదితరులు పాల్గోన్నారు.

## సినీ గాయకుడు ఎస్పీ బాలు తృతీయ సంస్కరణ సభ

సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 23. మనం న్యూస్: పద్మభూషణ్ గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మాణ్యం తృతీయ సంస్కరణ సభను ఈ నెల 25న స్థానిక పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో మనం వికాస వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు పెద్దిరెడ్డ గణేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్కరణ సభకు ముఖ్య అథితులుగా మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, విశిష్ట అథితిగా రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ హాజరవుతున్నట్లు పేర్కోన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, పుర ప్రముఖులు అధికారులు తదితరులు పాల్గోనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బాలబాలికలకు, వయోజనులకు పాటల పోటీలు నిర్వహిస్తున్నామని, ఇందులో గెలుపొందిన విజేతలకు నగదుబహుమతులు, ప్రసంశ పత్రాలు ప్రధానం చేయనున్నట్లు పేర్కోన్నారు.

## పోషణ అభియాన్‌పై అవగాహన



పాలకీడు, సెప్టెంబర్ 23, మనం న్యూస్: మండల పరిధిలోని శూన్యపహడ్ గ్రామపంచాయితీ పరిదిలోని అంగన్వాడీ కేంద్రాలలో పోషణ అభియాన్ కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమవత్ భీకి, సీడీపీవో విజయలక్ష్మీ, సూపర్‌వైజర్ రమాదేవి, కార్యదర్శి నరేందర్, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ప్రజాప్రతినిదులు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవ



గరిడేపల్లి, సెప్టెంబర్ 23, మనం న్యూస్: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వనజ మాట్లాడుతూ. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం కార్యాలయంలో అవరణలో గల చెత్తచెదారాన్ని శుభ్రం చేసి పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మౌలానా, ఏపీవో సురేష్, కో ఆప్షన్ మెంబర్ బొంత వెంకట్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత, మండల కేంద్రంలోని అంగన్వాడీ టీచర్లు, గ్రామపంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపీణీ



గరిడేపల్లి, సెప్టెంబర్ 23, మనం న్యూస్: మండల పరిధిలోని తుంబాయిగడ్డ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థుల ప్రగతి, పాఠశాల అవసరాలు, పిల్లల చదువుల పై చర్చించడం జరిగింది. అనంతరం మొదాల రాజు పూజితల కుమార్తె మనుశ్రీ మొదటి పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు పరీక్షప్యాడ్స్ పంపీణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొదాల గంగయ్య, సునిత, తల్లిదండ్రులు, పాఠశాల విద్యకమిటీ చైర్మన్ గొడుగు స్వాతి, ప్రధానోపాధ్యాయులు మానస, ఉపాధ్యాయలు స్వర్ణలత, శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది నాగేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల బతుకుల్లో చీకట్లు నింపుతోన్న 'కరీంనగర్ రైతు బజార్'

- వ్యాపారస్తులకు కొమ్ము కాస్తూ.. స్నదాతల పట్ల నిర్లక్ష్యం
- చిమ్మ చీకట్లో విక్రయించలేక.. దళారుల బారిన పడుతోన్న రైతులు
- కరీంనగర్ వీక్లీ మార్కెట్ రైతు బజార్‌లో రైతన్నల యాతనలు





కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): అన్నదాతల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని పాలకులు చేస్తోన్న ప్రకటనలు అక్కడి వరకే పరిమితమవుతున్నాయి. పండించిన పంటలను రైతులే నేరుగా తీసుకుని వచ్చి విక్రయించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన రైతు బజార్లు ఆ దిశగా ప్రయోజనాన్ని చేకూర్చడం లేదు. మార్కెట్ కమిటీ సిబ్బంది ఓ వైపు, దళారులు మరో వైపు, వ్యాపారస్తులు ఇంకోవైపు చేరి రైతన్నలను నిలువునా దగా చేస్తున్నారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన వసతులను కూడా వారు పొందకుండా చేస్తూ, దిక్కులేని పరిస్థితుల్లో దళారుల బారిన పడేలా చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు.. ఈ తతంగమంతా సాక్షాత్ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్ రైతు బజారులో నిత్యకృత్యంగా మారుతోంది. కరీంనగర్ వీక్లీ మార్కెట్ లో ఏర్పాటు చేసిన రైతు బజార్‌లో దళారులు, వ్యాపారస్తుల రాజ్యమే కొనసాగుతోంది. తాము పండించిన కూరగాయలను ఇక్కడకు విక్రయించేందుకు తీసుకువస్తోన్న రైతన్నలు నిలువునా దగా పడుతున్నారు. సంబంధిత కింది స్థాయి సిబ్బంది, దళారులు, వ్యాపారస్తులు కలిసి రైతన్నల చుట్టూ అసౌకర్యాల ఉచ్చును బిగిస్తున్నారు. విక్రయాలు జరిపేందుకు యత్నించే రైతులకు కనీస వసతులు లేకుండా చేస్తూ తప్పనిసరి పరిస్థితుల్లో దళారుల బారిన పడే పరిస్థితులు కల్పిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు తాము పండించిన కూరగాయలను నేరుగా ప్రజలకు విక్రయించేందుకు ఇక్కడకు వస్తుంటారు. రాత్రి వేళల్లో ఇక్కడకు పంటలను తీసుకువచ్చే రైతన్నలు, తెల్లవారేవరకు విక్రయాలు సాగిస్తుంటారు. శుభకార్యాలు జరిగే సమయాల్లో రాత్రి నుంచి తెల్లవారే జాము వరకు విక్రయాలు సాగిస్తుంటారు. ఈ వీక్లీ మార్కెట్ లోపల రైతు బజార్ నిర్వహిస్తుండగా, బయట హోల్ సేల్ కూరగాయల వ్యాపారాలు సాగుతుంటాయి. అయితే ఈ వ్యాపారస్తులు, సంబంధిత మార్కెట్ సిబ్బంది మధ్య ఏం అవగాహన కుదిరిందో గానీ..? రైతులు కూరగాయలు విక్రయించే రైతు బజార్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో చిమ్మచీకట్లోనే అన్నదాతలు విక్రయాలు సాగించే దుస్థితి దాపురించింది. అదే విధంగా ఇదే ప్రాంతంలో రైతుల నుంచి కూరగాయలు కొనుగోలు చేసి మారు వ్యాపారం నిర్వహించే వారు కూడా ఇక్కడే విక్రయాలు సాగిస్తుంటారు. అయితే వీరితో పాటు హోల్ సేల్ వ్యాపారాలు నిర్వహించే స్థలాల్లో విద్యుత్ దీపాలు మాత్రం దేదీప్యమానంగా వెలుగొందుతుంటాయి. ఈ పరిస్థితిపై అనేక సార్లు రైతులు సంబంధిత సిబ్బంది, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకపోగా, ఫిర్యాదు చేసిన రైతన్నలకు మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. సంబంధిత సిబ్బంది వ్యవహరిస్తోన్న తీరుతో చీకట్లో విక్రయాలు జరపలేక, తెల్లవారిన తర్వాత అమ్ముకునే పరిస్థితులు లేక, తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు తెచ్చిన కూరగాయలను చచ్చీ చెడి దళారులకు, మారు వ్యాపారస్తులకు తక్కువ ధరతో విక్రయించాల్సిన దుస్థితి దాపురించింది. రైతు బజార్లో చోటుచేసుకుంటున్న పరిస్థితుల కారణంగా తాము తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంటోందని అనేక మంది రైతులు వాపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలను సిబ్బంది, వ్యాపారస్తుల నిర్వాకం వల్ల తక్కువ ధరలకే విక్రయించి నష్టపోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ రైతు బజార్‌పై దృష్టి సారించి, తమ సమస్యలను పరిష్కరించి పంటలను నేరుగా ప్రజలకు విక్రయించేలా చర్యలు చేపట్టాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### అధికారులు పట్టించుకోరా..?



కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు. వీక్లీ మార్కెట్‌లోని రైతు బజార్‌లో రైతుల పట్ల వివక్ష కొనసాగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు..? రైతులకు ప్రయోజనం కలిగించేందుకు ఏర్పాటు చేసి న రైతు బజార్లలో ఇలాంటి దుస్థితి దాపురిస్తుంటే సంబంధిత అధికా రులు చర్యలెందుకు చేపట్టడంలేదు. ఇది సరైంది కాదు. ఆరుగాలం కష్టిం చి పండించిన కూరగాయలను విక్రయించేందుకు వస్తున్న రైతులకు అ న్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముంది. ఇప్పటికైనా సంబం ధిత అధికారులు కళ్లు తెరిచి రైతులకు ఉపయోగ పడే రీతిలో రైతు బజా ర్ ముందుకుసాగేలా చర్యలు చేపట్టాలి.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



వీణవంక, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 1977-78 బ్యాచ్ పూర్వవిద్యార్థులు నాలుగవ ఆత్మీయసమ్మేళనాన్ని కన్వీనర్ సురోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులి అశోక్‌రెడ్డి అధ్యక్షతన శనివారం ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఉద్వేగబరితులయ్యారు. పాఠశాలలో వ్యాసరచన,ఉపన్యాసం,క్రీడలు వంటి వివిధ రంగాలలో నిష్ణాతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం అదే బ్యాచ్‌కు చెందిన రైతు మిత్రులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. వివిధ వ్యాపారరంగాలలో స్థిరపడి సేవలందిస్తున్న పూర్వ విద్యార్థులనను సైతం సన్మానించారు. రూ. 25000ల తో నూతనంగా నిర్మించిన కిచెన్‌షెడ్‌ను హెచ్‌ఎం అశోక్‌రెడ్డి ప్రారంభించారు. 2016 నుండి ప్రతి సంవత్సరం వరుసగా లైబ్రరీ పుస్తకాలు, సైన్స్ ,మ్యాథ్స్ మెటీరియల్స్, టై,బ్యాడ్జ్, బెల్టులు అందించిన సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పూర్వ విద్యార్థులను అభినందించారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో విద్యార్థులు జిల్లా స్థాయిలో రాణించుటలో కృషి చేస్తున్న సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు ముల్కల కుమార్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ..



వీణవంక, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన లకోట రాజవీరు ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఋణవిమోచన చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆరెకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శెట్టిపెల్లి శివాజీ, నాయకులు జండా రాజేశ్వర్‌రావు, ఇంగ్లే రామారావు, ఇరువాల శ్రీను, నాగేశ్వర్‌రావు, రాజేందర్, మాజీ సర్పంచ్ లకోట రాజవీరు, మోర్తాల బాపురావు, విజేందర్, మోర్తాల రఘువరణ్, కృష్ణారావు, రాజు, లడే వీరన్న, కృష్ణ, ఇంగ్లే ప్రభాకర్‌రావు, లోనే రాజు, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం కోసం హోమం

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవనం కొనసాగించాలని జయ దుర్గాదేవి ఆలయంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హోమం నిర్వహించారు. తెలిపారు.శనివారం గోదావరిఖని జవహర్ నగర్ స్టేడియం వద్ద గల జయ దుర్గాదేవి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే చందర్ హోమం చేశారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ అఖండ మెజార్టీతో గెలవాలని, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో పాలన సాగించాలని ఎమ్మెల్యే అమ్మ వారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన కొడుకు, కోడలు మణిదీప్, స్నేహిత దంపతులు తదితరులున్నారు.

## గొల్లపల్లిలో గడప గడపకు కాంగ్రెస్



తిమ్మాపూర్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కార్యదర్శి మామిడి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పల్లె పల్లెకు కవ్వంపల్లి- గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా గ్రామంలో పాదయాత్ర నిర్వహిస్తూ పార్టీ గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు ఎస్.ఎల్ గౌడ్, ఎంపీటీసీ సభ్యులు బండారు రమేష్, గొల్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు పింగిలి కృష్ణ రెడ్డి, మండల కార్యదర్శి జాంగా రామకృష్ణ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ఉప అ. ధ్యక్షుడు కర్ర మణికంత, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేల్పుల మధు, నాయకులు కొమ్మేరా సుధాకర్ రెడ్డి, మల్లెతుల తిరుపతి, వెన్నం సుధాకర్ రెడ్డి, కొమ్మేరా శ్రీనివాస్ రెడ్డి, గడ్డం మహేందర్, దులం శంకర్, దేవా రాజు, సాయిల్ల రజినీకాంత్, కాల్వ రాజు, కాల్వ సందీప్, సాయిల్ల రాకేష్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 20.5 కిలోల గంజాయి దగ్ధం చేసిన పోలీసులు



కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 23 (మనం న్యూస్): కరీంన గర్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని పోలీసులు దగ్ధం చేశారు. శనివారం జిల్లా మాదక పదార్థాల నియంత్రణ కమిటి సభ్యులు, అడిషనల్ డిసిపి సి.రాజు, ఎసిపిసి.ప్రతాప్, ఇతర అధికారుల సమక్షంలో ఎన్డీపిఎస్ నిబంధనల ప్రకారం కమిషనరేట్ హెడ్ క్వార్టర్ లోని నిర్దేశిత డ్రగ్ డిస్పోజ్ ప్రదేశంలో 20కిలోల 500గ్రాముల గంజాయిని ద హనం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ త్రీటౌన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్, సంబంధిత పోలీస్ స్టేషన్లకు చెంది న అధికారులు పాల్గొన్నారు.

## టిడిపి మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో గురుద్వారలో ప్రత్యేక ప్రార్థనలు



కరీంనగర్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో క్షేమంగా జైలు నుండి తక్షణమే విడుదల కావాలని కోరుతూ ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి. బసాలాత్ ఖాన్, ఉపాధ్యక్షులు సర్దార్ జోగేంద్ర సింగ్‌ల ఆధ్వర్యంలో సిక్కువాడిలోని గురుద్వారలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ నియోజక వర్గ అధ్యక్షులు వంచ శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ గంగాధర కనకయ్య ముదిరాజ్, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కళ్యాణపు ఆగయ్య, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి దామెర సత్యం, పార్లమెంట్ ఉపాధ్యక్షులు సందబోయిన రాజేశం, ప్రధాన కార్యదర్శి తీ గుట్ల రమేష్, అధికార ప్రతినిధి దాసరి రామ కృష్ణారెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ బసాలత్ ఖాన్, వాణిజ సెల్ అధ్యక్షులు ఎలిమిళ్ళ కిషన్, పట్టణ అధ్యక్షులు రొడ్డ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి హయగ్రీవా చారి, పార్లమెంట్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు సర్దార్ జోగేందర్ సింగ్, ఎస్ కే అహ్మద్, మేకల రాజమల్లు, అనవేని రజిత, సురేందర్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో మీడియా పాత్ర మరువలేనిది

- జూనియర్ సివిల్ జడ్జి అసదుల్ల షరీఫ్



లక్షెట్టిపేట్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): సమాజంలో మీడియా పాత్ర మరువలేనిదని జూనియర్ సివిల్ జడ్జి అసదుల్ల షరీఫ్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ భవన్ ఆవరణలో అంగన్వాడీ, మెప్మా, జర్నలిస్ట్‌లకు ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలేకరుల వృత్తి చాలా విలువైందని, సమాజంలో దానికంటూ ఒక ప్రత్యేక గౌరవం ఉందన్నారు. ప్రపంచంలో ఏ మూలకు ఏమి జరిగిన మీడియా ద్వారానే పౌరులకు తెలుస్తుందని వివరించారు. రాజ్యాంగంలో ఫోర్త్ ఎస్టేట్ కు ప్రత్యేకత ఉందని అవగాహన కల్పించారు. స్వాతంత్ర్యం రాకముందు మీడియాపై బ్రిటిష్ ఆంక్షలు ఉండేవని, తర్వాత ఎంతో మంది త్యాగాల ఫలితంగానే మీడియాకు స్వేచ్ఛ లభించిందని వివరించారు. జర్నలిస్ట్ లు బాధ్యతగా వి. దులు నిర్వహించాలని సూచించారు. ఫోక్సో చట్టం, గృహహింస చట్టం, వినియోగదారుల చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్ మాట్లాడుతూ విలేకరు వృత్తి అనేది కత్తి మీద సాములాంటిదన్నారు. మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడికొప్పుల కిరణ్ మాట్లాడుతూ మీడియా నేటి సమాజంలో అత్యంత శక్తి వంతమైందని, దాని పరిమితులు గుర్తించి జర్నలిస్టులు నడుచుకోవాలని సూచించారు. పరిశీలించి, తగిన జాగ్రత్తలు పాటించి, విలువలతో కూడిన న్యూస్ ఉండాలన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బోనగిరి కుమార్ మాట్లాడుతూ సమాజం కోసం విలేకరులు కేవలం అతి తక్కువ గౌరవ వేతనంపై పని చేస్తారని, విలేకరుల సేవలు గుర్తించాలని, న్యాయ విజ్ఞాన సదస్సులో పలు చట్టాలపై అవగాహన కల్పించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీపి పద్మ, సీనియర్ న్యాయవాదులు కోమిరెడ్డి సత్తన్న, సురేందర్, ఐసిడిఎస్ సిడిపిఓ రేష్మ, మెప్మా అధికారి శంకర్, సత్యం,గణేష్, మల్లిఖార్జున్, అంగన్వాడి టీచర్స్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్, గౌరవ అధ్యక్షులు ప్రసన్న కుమార్, ప్రధాన సలహాదారులు చీకటి తిరుపతి, ఉపాధ్యక్షులు తిరుమలేష్, సౌడం రాజు, నోవా, భాను, ప్రచార కార్యదర్శి ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## పరేడ్‌తో క్రమశిక్షణ, శారీరక ధృడత్వం

- ఎస్సై సుధాకర్

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): పోలీస్ శాఖలో నిర్దేశించిన దాని ప్రకారం పరేడ్‌లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ కలిగి ఉండడంతో పాటు మానసిక ఉల్లాసం, శారీరక ధృఢత్వం లభిస్తుందని ఇల్లంతకుంట ఎస్సై డి.సుధాకర్ అన్నారు. శనివారం ఉదయం ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ ఆవరణలో వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వీక్లీ పరేడ్ కు హాజరుకావాలని తద్వారా క్రమశిక్షణ పెరగడంతో పాటు పోలీస్ శాఖలో నిత్యం జరుగుతున్న విషయాలని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. పోలీసుల క్రమశిక్షణ పరేడ్ తోనే సాధ్యమవుతుందని, దీని మూలంగానే సమాజంలో పోలీసులకు ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోతీరాం, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు మోహన్, అనిల్, రాజు, మధు, అనిల్, హోంగార్డు బాపుచందర్‌లు పాల్గొన్నారు.

## వినాయక మండపాలను సందర్శించిన మేయర్ సునీల్ రావు



కరీంనగర్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను మేయర్ యాదగిరి సునీల్ రావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా 53వ డివిజన్ పరిధిలోని ఫండస్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుని దర్శించుకుని స్కూల్ చైర్మన్ తో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం కాశ్మీర్ గడ్డ హనుమాన్ దేవాలయములో ప్రతిష్ఠించిన వినాయక మండపాన్ని సందర్శించి స్థానిక కార్పొరేటర్ శ్రీదేవి చంద్రమౌళితో కలిసి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. 33వ డివిజన్ పెద్దమ్మ టెంపుల్ దేవాలయం సమీపంలో పెద్దమ్మ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుని, భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం అయ్యప్ప దేవాలయంలో సమీపంలో ఆదర్శయూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక పండపాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి... భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను నగర ప్రజలు సంతోషాల మధ్య జరుపుకోవాలన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు ప్రకటించారు. గణేష్ నిమజ్జనాలకు నగరపాలక సంస్థ ద్వారా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రేన్ సౌకర్యం, మంచి నీటి సౌకర్యం, జిల్లా యంత్రాంగంతో ప్రత్యేక గజ ఈతగాల్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీస్ శాఖ వారి సహకారంతో కట్టుదిట్టమైన భద్రత మధ్య నిమజ్జనానికి వినాయకులను తరలిస్తామన్నారు. ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పలు వినాయక మండపాల నిర్వాహకులు, యూత్ క్లబ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బిసి సంక్షేమ సంఘం మండల కమిటీ నియామకం

చిగురుమామిడి, సెప్టెంబర్ 23 (మనం న్యూస్): బిసి సంక్షేమ సంఘం చిగురుమామిడి మండల కమిటీని మండల అధ్యక్షులు శ్రీరామోజు రాజ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాసుగౌడ్‌లు శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శిగా పెనుకుల తిరుపతి, ఉపాధ్యక్షులుగా చెప్యాల సంతోష్, చెరుకు సంజీవ్, చీకుట్ల సది, కార్యదర్శులుగా అల్లెపు సంపత్, జక్కుల బాబు, ముసాపురి సంపత్, సంయుక్త కార్యదర్శులుగా కందుకూరి శ్రీనివాస్, శిలువెరి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా నిలిగొండ దశరథం, కోశాధికారిగా ముంజ ప్రకాష్, సోషల్ మీడియా ఇంచార్జ్ పచ్చిమట్ల రాజు కుమార్ గౌడ్ కార్యవర్గ సభ్యులుగా చందబోయిన పర్శరాములు, కంది రమేష్, మొలుగూరి కుమార స్వామి, పెద్దపెల్లి రవీందర్, బొల్లి రవిలను నియమించారు.

## ఇల్లంతకుంట కోర్టు కానిస్టేబుల్‌కు ప్రశంసా పత్రం



ఇల్లంతకుంట, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తోన్న కోర్టు కానిస్టేబుల్ చందు నాయక్‌కు పోలీసు శాఖ ప్రశంసా పత్రం అందించింది. మండలంలోని ఎక్కువ కక్షి దారులను కోర్టులో హాజరు పరచడంతో పాటు, ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేసిన చందు నాయక్‌కు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్సై డి.సుధాకర్ చందునాయక్‌ను అభినందించారు.

# సబ్బండ కులాల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం

- రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యుడు కిషోర్ రెడ్డి

తొర్రూర్, సెప్టెంబర్ 23. (మనం న్యూస్): తొర్రూర్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డ్‌కు చెందిన పోలేపల్లి రమేష్ ఇటీవల రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బందు పథకానికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం అరుడుగా గుర్తించి బిసి బంధు పథకాన్ని లక్ష రూపాయల చెక్కును విడుదల చేశారు. శనివారం రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ మెంబర్ రామ సహాయ సహాయం కృష్ణ కిషోర్ రెడ్డి రమేష్ కి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ సబ్బండ కులాల సంక్షేమం కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చేతి వృత్తుల అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టి బీసీలను ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం ద్వారా మధ్యతరగతి బీసీ కుటుంబాలు కొంతవరకు ఆర్థికపరమైన ఇబ్బందుల నుండి ఉపశమనం పొందటానికి ఉపయోగపడునని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేర్పుల ఆమని ఐలయ్య, ఉప సర్పంచ్ రామ లింగం, మాజీ ఉప సర్పంచ్ రావుల వెంకటరెడ్డి, బీఆర్ఎస్ పార్టీనాయకులు అనిల్ రెడ్డి,రెడ్యా,కిషన్, సోమేశ్, రవి మరియు చందు తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వానికి మారు పేరు రాంసింగ్

- నిరుపేదలకు అండగా నిలుస్తు సహాయం



గార్ల, సెప్టెంబర్ 23. (మనం న్యూస్): గార్ల మండలం కి ష్టాపురం గ్రామానికి చెందిన గంగావత్ రాంసింగ్ సహాయ మంటు తనకాడికి వచ్చిన శరణార్ధులకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తు మానవత్వానికి మారుపేరుగా నిలుస్తున్నారు. శనివారం స్థానిక కృష్ణతార ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రాంసింగ్ మాట్లాడుతూ తనకు పేదవారికి సహాయం చేయాలనే ఆలోచన తన స్నేహితుడేనని తనన చదివించి ఇన్కాంమ్ ట్యాక్స్ అధికారిగా చేశారన్నారు. అప్పటి నుండి తన స్నేహితుడిని ఆదర్శంగా తీసుకొని నిరుపేదలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తు చేదోడు వాదోడుగా ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. పుట్టిన ఊరుకే కాక నియోజకవర్గ స్థాయిలో ఆపదలో ఉన్న నిరుపేదలకు లక్షల్లో ఆర్థిక సహాయం చేస్తు ఆదుకుంటు మనసున్న మహారాజుగా ప్రజల మన్ననలను పొందుతున్న రాంసింగ్ ప్రత్యక్ష రాజకీయాలలోకి వస్తే తన సేవలు నిరుపేదలకు మరింత చేరువ అవుతుందని ఇలాంటి దాన గుణం గల రాంసింగ్‌రాజకీయాలకు రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## గణపతి నవరాత్రులు సందర్భంగా భక్తులకు అన్నదానం



కురవి, సెప్టెంబర్ 23. (మనం న్యూస్) : కురవి మండలం అయ్యగారి పల్లి గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని పూర్ణ చందర్ రెడ్డి సోమప్ప నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిఆర్ఎస్ జిల్లా నాయకులు బజ్జూరు పిచ్చి రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నందిగామ రామకృష్ణారెడ్డి మోహన చారి మధు కరుణాకర్, ఉప సర్పంచ్ లింగన్న వీరమల్లు వెంకన్న లక్ష్మణ్ మాజీ సర్పంచ్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



గూడూరు, సెప్టెంబర్ 23. (మనం న్యూస్) : గూడూరు మండల కేంద్రంలోని చంద్రునికి చెందిన రెంటాల నాని భార్య రెంటాల రజిత గతవారం కిందట అనారోగ్యంతో మరణించారు. దీనిని తెలుసుకున్న రిటైర్డ్ టీచర్ నాయిని వెంకటేశ్వర్లు ఆ కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యాన్ని చెప్పి 50 కేజీల బియ్యాన్ని అందించారు. గత నాలుగు సంవత్సరాల నుండి ఏ పేద కుటుంబాలలో అన్యాయం జరిగిన కూడా తన వంతు సహాయం అందిస్తున్నారు. దళిత కుటుంబంలో ఆణిముత్యం నాయనీ వెంకటేశ్వర్లు అని, పలు రాజకీయ పార్టీలు నాయకులు అతనిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాల మానుడు జిల్లా నాయకులు చీదురు వెంకన్న, నీలం సతీష్, బత్తుల యాదగిరి, భక్తుల సురేష్, వెంకన్న, సాంబయ్య, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్



కొత్తపల్లి, సెప్టెంబర్ 23 (మనం న్యూస్): బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం తీరుతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇటీవ ల ఆ పార్టీకి రాజీనామా చేసిన కరీంన గర్ రూరల్ మండలం బొమ్మకల్ స ర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఢిల్లీలో తెలం గాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని కలిసిన ఆయన పార్టీ తీ ర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రేవంత్‌రెడ్డి కండువా ను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

# క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

- మేయర్ యాదగిరి సునీల్ రావు
- కరీంనగర్ అర్బన్ జోన్ విజేతలకు ట్రోఫీలను అందించిన మేయర్



కరీంనగర్, సెప్టెంబర్ 23. (మనం న్యూస్): క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రీడల్లో రాణించిన వారు అన్ని రంగాల్లో రాణిస్తారని కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. శనివారం స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో జరిగిన కరీంనగర్ అర్బన్ జోన్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కబడ్డీ, కోకో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీల్లోని విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడాపాలసీని అమలులోకి తెస్తున్నట్లు, ఈక్రీడా పాలసీతో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తూ నిఖత్ జరీన్ లాంటి క్రీడాకారులకు భారీ నజరానాలను ఇస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ నగర్ పాలక సంస్థ ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాలుగా క్రీడాకారులను వెలుగులోకి తీయాలనే ఉద్దేశ్యంతో వేసవిలో సమ్మర్ క్యాంప్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించినట్లే విద్యలోను రాణించాలని అప్పుడే వారు సాధించిన సర్టిఫికేట్లకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. నాలుగు రోజుల పాటు అండర్ 14, 17 లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌ల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విజేతలు అదే స్ఫూర్తితో, ఓడిన క్రీడాకారులు గెలవాలనే స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ కీర్తి రాజవీరు, ఎంఈఓ మధుసూదనాచారి సిస్టర్ ఇన్నాలు, సిస్టర్ జోసెఫ్లతో పాటు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు దివాకర్, వేణుగోపాల్, ప్రేంరెడ్డి, సిలివేరి మహేందర్, బార విద్యాసాగర్, బత్తిని శ్రీధర్, ముజాఫర్, మహేష్, వికాస్, గౌతమ్, సురేందర్ సింగ్, రఘు, తిరుపతి, మణి, తదితరులు పాల్గొన్నారు.

## క్యూఆర్ కోడ్ బందోబస్త్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మనం న్యూస్): వినాయక నిమజ్జనానికి రాచకొండ పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలోని చెరువులు, రూట్ మ్యాప్లను సిద్ధం చేసిన పోలీసులు.. సాంకేతిక వినియోగంపై దృష్టిసారించారు. ఈసారి గణేష్ బందోబస్తు ప్రక్రియను క్యూఆర్ కోడ్ ద్వారా పరిశీలించనున్నారు. దీని కోసం కమిషనరేట్ పరిధిలో దాదాపు 10 వేల వినాయక మండపాలకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ఇచ్చారు. ఇందులో విగ్రహ ప్రతిష్టాపన తేదీ, నిమజ్జనం తేదీ, రూట్ మ్యాప్ వంటి వివరాన్నీ ఈ కోడ్లో భద్రపరిచారు. నిమజ్జనానికి సిద్ధం చేసిన చెరువుల వద్ద ఏర్పాటు చేసిన 500 సీసీటీవీ కెమెరాల లొకేషన్స్ను జియో ట్యాగింగ్ చేశారు. వీటిని ఈ క్యూఆర్ కోడ్కు జత చేశారు. విశేషంగా ఈ క్యూఆర్ కోడ్లో ఏ వినాయక మండపం వద్ద ఏ తరహా వినాయకుడిని నిలబెట్టారు? ఎన్ని విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఇంకాఎన్ని ఉన్నాయనేవి రియల్ టైంలో తెలిసిపోతాయి.

### ఆకతాయిలపై షీ టీమ్స్ నిఘా..

సాధారణ ప్రయాణికులు, భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిమజ్జన ఏర్పాట్లు సాగేలా గట్టి చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకించి నిమజ్జనానికి వచ్చే మహిళ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించారు. అలాగే ఆకతాయిలపై నిఘా పెట్టేందుకు 10 షీ టీమ్స్ బృందాలు మఫ్టీలో తిరుగుతుంటాయి. వీటితో పాటు రాచకొండలో ఉన్న 1.83 లక్షల సీసీటీవీ కెమెరాలతో శాంతి భద్రతల పరిస్థితులను పోలీసు ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణతో పాటు విశ్లేషిస్తున్నారు. కమిషనర్ డీఎస్ చౌహాన్ నిమజ్జన బందోబస్తుతో పాటు నిరంతరం మండపాల వద్ద తనిఖీలను చేస్తూ పరిస్థితులను తెలుసుకుంటున్నారు.

# మల్కాజిగిరి నుంచే పోటీచేస్తా.. : మైనంపల్లి

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మనం న్యూస్): వేరే నియోజకవర్గం నుంచి మైనంపల్లి పోటీ చేస్తారంటూ వస్తున్న వదంతులపై ఆయన స్పందించారు. తనపై కావాలనే కొందరు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. మల్కాజిగిరి నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని మైనంపల్లి హన్మంతరావు స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్, మేడ్చల్ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నానంటూ వదంతులు పుట్టిస్తున్నారని పేర్కొన్నారు. పలువురు కార్యకర్తలు ఇవాళ భారీగా తరలిరావడంతో మైనంపల్లి నివాసం వద్ద సందడి నెలకొంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నాయకుడు నర్సారెడ్డి భూపతిరెడ్డి.. మైనంపల్లిని హన్మంతరావును .. హస్తం పార్టీలోకి ఆహ్వానించారు. తమకు పదవులు ముఖ్యం కాదని.. కార్యకర్తలే ముఖ్యమని మైనంపల్లి స్పష్టం చేశారు. అవసరమైతే వారి కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమని వెల్లడించారు. తమ కోసం బయటకు వచ్చిన కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. మల్కాజిగిరి నియోజకవర్గం నుంచే పోటీ చేస్తాను. కొందరు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్నారు. వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని పుకార్లు పుట్టిస్తున్నారు. పదవులు ముఖ్యం కాదు.. కార్యకర్తలే ముఖ్యనామి అన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. వచ్చే ఎన్నికల్లోనూ మల్కాజిగిరి అభ్యర్థిగా మైనంపల్లిని.. ఇటీవల భారత్ రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. అయితే తనకు మల్కాజిగిరి, కుమారుడికి మెదక్ టికెట్ ను ఆయన ఆశించారు. కుమారుడు రోహిత్ కు మెదక్ టికెట్ ఇవ్వలేదనే అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు మంత్రి హరీశ్ రావుపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం పట్ల బీఆర్ఎస్ అధిష్ఠానం కూడా మైనంపల్లి హన్మంతరావుపై ఆగ్రహంతో ఉంది.మైనంపల్లి హన్మంతరావు వ్యాఖ్యలను కేటీఆర్, కవితతో పాటు పలువురు నాయకులు బహిరంగంగానే ఖండించారు. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి అభ్యర్థిని మారుస్తారని ఓ వైపు.. మైనంపల్లి కాంగ్రెస్ లో చేరతారని మరోవైపు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత్ రాష్ట్ర సమితిని వీడుతున్నట్లు మైనంపల్లి హన్మంతరావు అధికారికంగా ప్రకటించారు.ఇటీవలేమైనంపల్లి హన్మంతరావు తిరుమలలో బీఆర్ ఎస్ కీలక నేత, మంత్రి హరీశ్ రావుపై విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. మెదక్ నియోజకవర్గంలో హరీశ్ రావు పెత్తనమేంటని ఆయన ప్రశ్నించారు. మెదక్‌లో మంత్రి నియంతగా వ్యవహరిస్తున్నారని.. ఆయన తన గతం గుర్తుంచుకోవాలని అన్నారు. అక్కడి నుంచి తిరిగివచ్చిన అనంతరం మైనంపల్లి.. మల్కాజిగిరి, మెదక్ నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. తాను ఏ రాజకీయ పార్టీని దూషించనని.. ప్రాణం పోయే వరకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని ఆయన వివరించారు. మెదక్ జిల్లాలో రామాయంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచానని.. తనకు మెదక్ ప్రజలు రాజకీయ భిక్ష పెట్టారని మైనంపల్లి హన్మంతరావు గుర్తు చేశారు. ఆ తర్వాత తెలంగాణ కోసం టీడీపీకి రాజీనామా చేసి.. టీఆర్ ఎస్ లో చేరానని అన్నారు. ఉద్యమంలో ప్రజలంతా కలిస్తే తెలంగాణ సాకారమైందని.. ప్రాణం పోయే వరకు మాటపైన ఉంటానని స్పష్టం చేశారు. ఎవరైనా తన జోలికి వస్తే ఉపేక్షించనని మైనంపల్లి హన్మంతరావు హెచ్చరించారు.

## మా కోటా మాకివ్వాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

టీపీసీసీ రూపొందించింది. ఈ జాబితాలో 40-42 మంది పేర్లుండగా, ఇందులో కనీసం 34 మందికి క చ్చితంగా టికెట్లు ఇవ్వాలని యోచిస్తోంది. ఇటీవల జరిగిన స్క్రీనింగ్ కమిటీ సమావేశాల్లో చర్చించిన అనంతరం 10 మంది పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపాలని, మిగిలిన పేర్లపై తదుపరి సమావేశాల్లో చర్చించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

### స్క్రీనింగ్ కమిటీ పరిశీలన కోసం ప్రతిపాదించిన పేర్లు ఇవీ...

పొన్నాల లక్ష్మయ్య (జనగామ), కొండా సురేఖ (పరకాల), మధుయాష్కీగౌడ్ (ఎల్బీనగర్), అంజన్‌కుమార్ యాదవ్ (ముషీరాబాద్), పొన్నం ప్రభాకర్ (హుస్నాబాద్), సురేశ్ షెట్కార్ (నారాయణఖేడ్), ఈరవత్రి అనిల్ (బాల్కొండ), ఎర్ర శేఖర్ (జడ్చర్ల), ఆది శ్రీనివాస్ (వేములవాడ), బి.మహేశ్‌కుమార్ గౌడ్ (నిజామాబాద్ అర్బన్), గండ్రత్ సుజాత (ఆదిలాబాద్), కాసుల బాలరాజు (బాన్సువాడ), కత్తి వెంకటస్వామి (వరంగల్ ఈస్ట్), నందికంటి శ్రీధర్ (మల్కాజ్గిరి), పోతంశెట్టి వెంకటేశ్ (భువనగిరి), కాటా శ్రీనివాస్ (పఠాన్‌చెరు), గాలి అనిల్‌కుమార్ (నర్సాపూర్), అనిల్ కుమార్ యాదవ్ (ముషీరాబాద్), మక్కన్సింగ్ రాజ్ఠాకూర్ (రామగుండం), ఎ. సంజీవ్ (మహబూబ్నగర్), కాటం ప్రదీప్కుమార్ (దేవరకద్ర), వాకిటి శ్రీహరి (మక్తల్), వీర్లపల్లి శంకర్ (షాద్నగర్), కడెంపల్లి శ్రీనివాస్ (షాద్నగర్), ఎం.వేణుకుమార్ (రాజేంద్రనగర్), ఎడవల్లి కృష్ణ (కొత్తగూడెం), నాగ సీతారాములు (కొత్తగూడెం), బీర్ల అయిలయ్య (ఆలేరు), నేరెళ్ల శారద (కరీంనగర్), జె.జైపాల్ (శేరిలింగంపల్లి), ఆనందరావు పాటిల్ (ముధోల్), అంబటి రాజేశ్వర్ (నిర్మల్), ఎం.చంద్రశేఖర్‌గౌడ్ (నిజామాబాద్ రూరల్), ఆంజనేయులు (నర్సాపూర్), కత్తి కార్తీక (దుబ్బాక), నగేశ్ ముదిరాజ్, సంగిశెట్టి జగదీశ్వరరావు (ముషీరాబాద్), మెట్టు సాయికుమార్ (గో షామహల్), లక్ష్మణ యాదవ్ (అంబర్‌పేట), ధర్మపురి సంజయ్ (నిజామాబాద్ అర్బన్).

## వేస్ట్ టు వండర్‌లో భాగస్వాములు కావాలి

- మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య



తొర్రూర్, సెప్టెంబర్ 23. (మనం న్యూస్): వేస్ట్ టు వండ ర్‌లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కమిషనర్ సరస్వతి అన్నారు. శ నివారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హే సేవ కార్యక్ర మంలో భాగంగా వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డితో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పనికిరాని వస్తువులతో నూతన ఆవిష్కరణలు తయారుచేసి ఈ నెల 27వ తేదీలోగా మున్సిపల్ కార్యాలయంలో అందజే యాలన్నారు ఎంపికైన వారికి ఈనెల 30న ప్రశంసా పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. వివరాల కోసం 818682 4749 నెంబర్ ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు. వార్డ్ కౌన్సిలర్లు గుగులోత్ శంకర్. నాయకులు దొంగరి శంకర్. కర్నే నాగరాజు. బిజ్జాల అనిల్. ధారావతు జై సింగ్. తూర్పాటి రవి. పేర్ల జంపా తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిపై దాడి

ఖానాపూర్, సెప్టెంబర్ 23. (మనం న్యూస్) : బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిపై దాడికి తెగబడిన ఘటన నిర్మల్ జిల్లాలో జరిగింది. బీఆర్ఎస్ నుంచి ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న భూక్యా జాన్సన్ నాయక్ శుక్రవారం రాత్రి రజూరా గ్రామంలో పర్యటించారు. అదే సమయంలో బీజేపీ మాజీ ఎంపీపీ భర్త గడ్డం రవీందర్ తన అనుచరులతో కలిసి అటుగా వచ్చారు. మద్యం మత్తులో ఉన్న రవీందర్, ఆయన అనుచరులు. జాన్సన్ నాయక్ కారును ఢీకొట్టారు. అంతేకాకుండా జాన్సన్ మీద దాడికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. బీఆర్ఎస్ నాయకులు సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మద్యం మత్తులో దాడిచేసిన బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. విషయం తెలుసుకున్న బీజేపీ నేత, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ తన అనుచరులతో కలిసి పోలీస్ స్టేషన్ కు చేరుకొని వీరంగం సృష్టించారు. పోలీసులపై దాడి చేసేలా కార్యకర్తలను రెచ్చగొట్టారు. అంతేకాకుండా. స్టేషన్‌లోని కిటికీలు, తలుపులను విరగ్గకొట్టి హంగామా చేశారు.

## రాష్ట్రంలో 'సింటెక్స్' పెట్టుబడి రూ.350 కోట్లు

- ఈనెల 28న శంకుస్థాపనకు కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 23. (మనం న్యూస్): వెల్‌స్పన్ గ్రూపు కంపెనీల్లో భాగస్వామిగా ఉన్న 'సింటెక్స్' హైదరాబాద్‌లో రూ.350 కోట్ల పెట్టుబడితో తయారీ యూనిట్ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. వాటర్ ట్యాంకులు, ప్లాస్టిక్ పైపులు, ఆటో కాంపొనెంట్స్, ఇతర పరికరాలను తయారుచేసే ఈ యూనిట్ ద్వారా వేయి మందికి ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వెల్స్పన్ ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న చందన్వెల్లిలోనే సింటెక్స్ తయారీ యూనిట్ ఏర్పాటవుతుంది. ఈ నెల 28న జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్రఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావుతో పాటు వెల్స్పన్ కంపెనీ చైర్మన్ బీకే గోయెంకా హాజరవుతారు. కాగా, ఇప్పటికే తెలంగాణలో భారీగా పెట్టుబడులతో కార్యకలాపాలు నిర్వహిసున్న వెల్స్పన్ గ్రూప్ రాష్ట్రంలో మరింత విస్తరించనుండటం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో అందుబాటులోని మౌలిక వసతుల వలన అనేక నూతన పెట్టుబడులు రాష్ట్రానికి తరలివస్తున్నాయని కేటీఆర్ అన్నారు.

## బీసీల హక్కుల కోసం ఎందాకైనా..

- ఎంపీ ఆర్.కృష్ణయ్యతో భేటీలో ఎమ్మెల్సీ కవిత స్పష్టీకరణ
- 26న జలవిహార్‌లో జరిగే బీసీ సంఘాల సభకి సంఘీభావం

హైదరాబాద్, సెప్టెంబర్ 23. (మనం న్యూస్): చట్ట సభల్లో బీసీలు, బీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు బీసీ కుల గణన చేపట్టాలనే డిమాండ్తో ఈ నెల 26న బీసీ సంఘాలు నిర్వహించే సమా వేశానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చట్ట సభల్లో బీసీల వాటా, హక్కుల కోసం జరిగే ఉద్యమానికి తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ప్రకటించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య శనివారం హైదరాబాద్లో కవితతో భేటీ అయ్యారు. బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్రావు, ఎంపీలు మాలోత్ కవిత, బోర్లకుంట వెంకటేశ్ నేత, ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్లు గెల్లు శ్రీనివాస్ యాదవ్, పల్లె రవికుమార్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఈ భేటీలో పాల్గొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొట్టమొదటి శాసనసభ సమావేశాల్లోనే 2014 జూన్లో చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే బిల్లుపై తమ పార్టీ తీర్మానం చేసిందని కవిత గుర్తు చేశారు. నామినేటెడ్ పదవులు, మార్కెట్ కమిటీలు, పార్టీ పదవుల్లో బీసీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పించిందన్నారు.

### తెలంగాణ నుంచే బీసీ ఉద్యమం: కృష్ణయ్య

కవితతో భేటీ అనంతరం బంజారాహిల్స్లోని ఆమె నివాసం వద్ద ఎంపీ కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. తెలంగాణ నుంచే బీసీ ఉద్యమానికి శంఖారావం పూరిస్తామని ప్రకటించారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించటం, కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు, బీసీ కులగణన అనే మూడు డిమాండ్లతో తమ జాతీయ ఉద్యమం కొనసాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన మహిళా బిల్లును సవరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 26న జలవిహార్లో సదస్సు నిర్వహించిన తరువాత బీసీ రిజర్వేషన్ బిల్లు కోసం ముఖ్యమంత్రుల సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## వలస ఆదివాసీల పట్ల వివక్ష ఎందుకు

- కనీస సౌకర్యాలు కల్పించడంలో వైఫల్యం
- వలస ఆదివాసీలకు ఎస్టి కుల సర్టిఫికెట్ లు ఇవ్వాలి
- సిపిఎం ఆధ్వర్యంలో ఐటిడిఏ ముట్టడి



భద్రాచలం, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): నీరు, రోడ్లు, సంక్షేమం కోసం, మౌలిక సదుపాయాల కల్పన కోసం రోడ్డెక్కిన వేలాది మంది గిరిజనులు సీపీఎం అధ్వర్యంలో భారీ ప్రదర్శనగా ఐటీడీఏ ముట్టడించారు. వలస ఆదివాసీలకు మౌలిక సదుపాయాలు,సంక్షేమ పథకాల అమలులో వివక్ష చూపెట్టడం దారుణమైన విషయం అని, అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం లో గిరిజనుల పట్ల నిర్లక్ష్య వైఖరి సరైనది కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య విమర్శించారు. భద్రాచలం పట్టణంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ నుండి ఐటిడిఏ వరకు వలస ఆదివాసీలు సీపీఎం పార్టీ అధ్వర్యంలో భారీ ర్యాలీ వెళ్లి ముట్టడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం పీఓకి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, బ్రహ్మాచారి జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, మర్మం చంద్రయ్య, చిలకమ్మ,నిమ్మల వెంకన్న, కొండబోయిన వెంకటేశ్వర్లు, గడ్డం స్వామి, భూక్యా రమేష్, మర్లపటి రేణుక, కారం నరేష్, కాంతారావు, కే.సత్య, యాస నరేష్, మధు పాల్గొన్నారు

## హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన అధ్యాపక బృందం



భద్రాచలం, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): భద్రాచలం పట్టణానికి విచ్చేసిన హైకోర్టు జడ్జి బి.నగేష్ గారిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. భద్రయ్య, అధ్యాపక బృందం మర్యాదపూర్వకంగా కలిసి దృశ్యాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రగతి విద్యార్థుల పురోగతి గురించి చర్చించారు. విద్యార్థుల,విద్యార్థు క్యారియర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమంలో పాలుపంచుకుంటానన్నారు. న్యాక్ లోకళాశాలకు బిగ్రేడ్ సాధించినందుకు సిబ్బందిని అభినందించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులుడి.భద్రయ్య, అధ్యాపక బృందం నరేందర్ రెడ్డి, వీరన్న, కామేశ్వరరావు, శ్యాం ప్రసాద్, కలిసిన వారిలో ఉన్నారు.

## విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి



భద్రాచలం, సెప్టెంబర్ 23, (మనం న్యూస్) : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో పాసయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం నాడు ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాల్లో గిరిజన సంక్షేమ శాఖ హెచ్ఎంలు ఉపాధ్యాయులతో రాబోయే రోజులలో 10వ తరగతి పరీక్షలపై తీసుకోవలసిన జాగ్రత్తలు పరీక్షలకు సంబంధించిన అంశాల గురించి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థిని, విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనకబడి ఉన్నారో ముఖ్యంగా గణితం, సామాన్య శాస్త్రం, ఇంగ్లీషు, దానితోపాటు సాంఘిక శాస్త్రం సబ్జెక్టులను పిల్లలు పరీక్షలలో సులభంగా రాయడానికి దానికి సంబంధించిన పాఠ్యాంశాలను పుస్తకం రూపంలో సిద్ధం చేయడం జరిగిందని, పిల్లలు ఎవరు పదో తరగతి లో ఫెయిల్ కాకూడదని త్వరలో సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ శిక్షణ ఇస్తామని ప్రస్తుతం ఉపాధ్యాయులు తయారుచేసిన సబ్జెక్టులకు సంబంధించిన వివరాలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ, దీనికి సంబంధించిన ప్రతి అంశాన్ని పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఇప్పటినుండే వారికి విద్యా బోధన చేయాలని తెలిపారు.

తెలుగు, ఇంగ్లీష్, సామాన్య శాస్త్ర, సాంఘిక శాస్త్రం కానీ ఏ అక్షరం తప్పు పోయిన మార్కులు కట్ అవుతాయని అందుకు సంబంధిత ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరికి అర్థమయ్యే వి.దంగా విద్యార్థిని విద్యార్థులకు బోధించి 10/10 ర్యాంకులలో పాస్ అవ్వాలని ఆయన ఉపాధ్యాయులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, సంబంధిత పాఠశాలకు సంబంధించిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థను దివాలా తీయిస్తున్న కెసిఆర్

- బిజెపి ఎన్నికల కమిటీ చైర్మన్ హుజురాబాద్ ఎంఎల్ఏ ఈటెల రాజేందర్
- సింగరేణి రిజర్వ్ బొగ్గు నిల్వలు 15 ఏళ్ళలో ఖతం
- ఒకప్పుడు 10 వేలమంది అవుట్సోర్సింగ్ కార్మికులు నేడు 30 వేలు
- కోల్ ఇండియాలో దినసరి వేతనం 973 రూపాయలు, సింగరేణిలో 474

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 23, (మనంప్రతినిధి): సింగరేణి సంస్థను సీఎం కేసీఆర్ దివాలా తీయిస్తున్నాడని హుజురాబాద్ శాసనసభ్యులు, బిజెపి ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ విమర్శించారు. శనివారం కొత్తగూడెంలో పర్యటించిన సందర్భంగా, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే వి రంగాకిరణ్ నివాసంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణకు వెన్నుదన్నుగా నిలుస్తున్న సింగరేణి సంస్థను మెల్లమెల్లగా దివాలా వైపు నడిపిస్తున్నారని, బొగ్గు గనుల టెండర్లలో సింగరేణి సంస్థను పాల్గొననీయకుండా ప్రైవేటు వ్యక్తులకు బొగ్గు గనులను అప్పజెప్పి సింగరేణి సంస్థ మనుగడను దెబ్బతీసేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఈటెల ఆరోపించారు. కోయలగూడెం, కేకే సిక్స్, సత్తుపల్లి, శ్రావణపల్లి నాలుగు మైన్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించి, సింగరేణి కేవలం కొన్ని బాధ్యతలు చేస్తున్నదని ఈటెల ఆరోపించారు. ఈ గనుల టెండర్లలో సింగరేణి సంస్థను పాల్గొననీయకుండా కేసీఆర్ అడ్డుకున్నారని ఈటల ఆరోపించారు. గతంలో సింగరేణి గనులలో బొగ్గును వెలికి తీసేందుకు ముందుగా మట్టిని తీసే పనిని మాత్రమే ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఇచ్చేవారని, ప్రస్తుతం మట్టి తీసే పనే కాకుండా బొగ్గుని తీసే పనిని కూడా టన్నుల లెక్క ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ కాంట్రాక్టర్లు లాభాల కోసం పనిచేస్తారు కానీ సోషల్ సర్వీస్ చేయరని తద్వారా సింగరేణి సంస్థ నష్టపోతోందని ఈటెల విమర్శించారు. సింగరేణి సంస్థలు నిపుణత కలిగిన కార్మికులు ఉన్నారని, అత్యాధునిక టెక్నాలజీ వాడుతున్నారని అయినా కూడా సింగరేణి సంస్థను బొగ్గు గనుల టెండర్లకు వెళ్ళనీయకుండా అడ్డుకొని ప్రైవేటు కాంట్రాక్టర్ల దగ్గర నుండి సూట్ కేసులు అందుకోవడమే కేసీఆర్ పనిగా పెట్టుకున్నారని ఈటల విమర్శించారు.



### అంతా అవుట్‌సోర్సింగ్‌మయం ....

తెలంగాణ రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తాత్కాలిక ఉద్యోగులు ఉండబోరని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఈటెల పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో గతంలో 10 వేల మంది ఔట్సోర్సింగ్ కార్మికులు ఉండగా, ప్రస్తుతం 30 వేల మంది ఔట్సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని సీఎం కేసీఆర్ మాట తప్పారనడానికి ఇదే నిదర్శనమని ఈటెల తెలిపారు. సింగరేణి సంస్థలు గతంలో 63 వేల మంది కార్మికులు ఉండగా ప్రస్తుతం 43 వేల మంది కార్మికులు మాత్రమే పనిచేస్తున్నారని ఈటల తెలిపారు. సింగరేణిలో 42 మైన్లకు గాను, 20 మైండ్లు ఓపెన్ కాస్ట్ మైన్లేనని ఈటెల తెలిపారు. వెయ్యి మంది కార్మికులు పనిచేసే ప్రదేశంలో కేవలం 100 మందితోనే పనులు చేస్తున్నారని ఈటెల ఆరోపించారు.

### కార్మికుల కష్టానికి విలువ లేదు...

ఈ ప్రభుత్వంలో కార్మికుల కష్టానికి విలువలేదని, కోల్ ఇండియా పరిధిలో దినసరి వేతనం 973 రూపాయలు ఉండగా, సింగరేణి సంస్థలు కేవలం 474 రూపాయలుగా ఉందని, ముమ్మాటికి శ్రామికుల కష్టాన్ని దోచుకోవడమేనని ఈటల విమర్శించారు. సింగరేణి సంస్థలు 51 శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వాన్నిదని, 49 శాతం వాటా కేంద్ర ప్రభుత్వానిదని, సింగరేణి సంస్థకు సంబంధించి నిర్ణయాధికారాలన్నీ రాష్ట్రానికే ఉంటాయని ఈటల గుర్తు చేశారు. సింగరేణి సంస్థలో చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఏ అధికారి అయిన మూడు నుండి నాలుగేళ్లు మాత్రమే పని చేస్తారని, కానీ ప్రస్తుతం ఉన్న సి.ఎం.డి 9 సంవత్సరాలుగా ఆ పదవిలో కొనసాగుతున్నారని, ఇదే విషయమై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పలుమార్లు గుర్తుచేసినా సీఎం కేసీఆర్ ఒంటెద్దు పోకడలు పోతూ, సింగరేణి సంస్థ ను దోచుకుంటున్నాడని ఈటల విమర్శించారు.

### సింగరేణి సంస్థ మూతపడే ప్రమాదం....

సింగరేణి సంస్థ బొగ్గు గనుల టెండర్లకు వెళ్లకుండా ఇదే పద్ధతిలో కొనసాగితే సంస్థ మూతపడే ప్రమాదం ఉందని ఈటల వ్యాఖ్యానించారు. ఒరిస్సాలోని నైని, భాద్రపద గనులలో ఒకదానిలో 14 వందల మిలియన్ టన్నులు, మరో దానిలో 18 వందల మిలియన్ టన్నులు బొగ్గు ఉత్పత్తి జరగనున్నదని, సింగరేణి బొగ్గు ఉత్పత్తి రిజర్వ్ వాల్యూ పెంచుకోకపోతే సంస్థ మూతపడే ప్రమాదం ఉందని, దీంతో సంస్థను నమ్ముకున్న వేలాది మంది కార్మికులు, సంస్థతో ముడిపడి జీవనం సాగిస్తున్న లక్షలాదిమంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారని ఈటెల ఆందోళన వ్యక్తం చేశారు.

### కార్మిక సంఘాలను కాలరాస్తున్న కేసిఆర్ ....

తెలంగాణ సీఎం కేసీఆర్ కు కార్మిక సంఘాలు అంటే అసలు గిట్టడం లేదని, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన దగ్గర నుండి కార్మిక సంఘాలను అణిచివేస్తున్నారని ఈటల ఆరోపించారు. ఇందుకు సాక్ష్యంగా సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపడం లేదని ఈటెల గుర్తు చేశారు. ఇచ్చేది నేను తీసుకునేది మీరు మధ్యలో ఈ సంఘాలు ఎందుకు అని కెసిఆర్ సెలవిస్తున్నారని ఈటల వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసిన సమయంలో 39 మంది కార్మికుల చావులకు కారణమైన కెసిఆర్ కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

### బెదిరింపులతోనే పాలిస్తున్న కెసిఆర్...

తెలంగాణ సీఎం కేసీఆర్ బెదిరింపులతో పాలన కొనసాగిస్తున్నారని, ప్రజల పక్షాన పోరాడే మీడియా సంస్థలను తన గుప్పెట్లో పెట్టుకుని, ప్రభుత్వ వ్యతిరేక వార్తలను ప్రసారం కానివ్వకుండా బెదిరింపులకు గురిచేస్తున్నారని ఈటెల ఆరోపించారు. చిన్న చిన్న పత్రికలు చిన్నచిన్న చానళ్ల యాజమాన్యాలను జర్నలిస్టులను బెదిరిస్తూ పబ్బం గడుపుకుంటున్నాడని ఈటెల ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఈటెల తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి, బిఎంఎస్ నాయకులు మాధవ నాయక్, బిజెపి జిల్లా ఇంచార్జ్ రుక్మారావు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు ఆకుల నాగేశ్వరరావు గౌడ్, చుంచుపల్లి మండల అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, నాళ్ళ సుందర్, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం

- రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, సెప్టెంబరు 23, (మనం బ్యూరో): ప్రతి పేదవానికి స్వంత ఇంటి కల నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో నగరంలోని 5,7,9,10,11,12, 20,32, 37,38,47 డివిజన్లలోని లబ్ధిదారులకు జీవో 58 క్రింద పట్టాలు, గృహలక్ష్మి పథక మంజూరు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి




మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాల్లో 2020 నాటికి నివాసం ఉంటున్న పేదలకు జీవో 58 క్రింద ఆధీనంలో ఉన్న ఇంటి స్థలంపై వారికే పూర్తి హక్కులు కల్పించి, నిశ్చింతగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని అన్నారు. అదేవిధంగా ఇంటి స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేని వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందించేందుకు గృహలక్ష్మి పథకానికి రూపకల్పన చేయడం జరిగిందని ఆయన తెలిపారు. నివాస ధృవ పత్రాల ఆధారంగా మీ సేవ ద్వారా దరఖాస్తు సమర్పించిన అర్హులందరికి క్షేత్రపరిశీలన చేసి పారదర్శకంగా మొదటి విడతగా 3 వేల 2 వందల 53 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రతి పేదవారికి స్వంత ఇల్లు ఉండాలనే మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యుల సంకల్పంతో పట్టణంలో ఇప్పటికే 2 వేల మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వడం జరిగిందన్నారు. స్వంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునే స్తోమత లేని వారికి ఆర్థిక చేయూతనందించేందుకు గృహలక్ష్మి పథకం క్రింద మూడు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించేందుకు నియోజకవర్గానికి 3 వేల మంది చొప్పున జిల్లాలో 15 వేల 5 వందల మంది లబ్ధిదారులకు మూడు విడతలుగా బేస్మెంట్, స్లాబ్ లెవల్, నిర్మాణం పూర్తి దశలలో ఒక్కో లక్ష రూపాయల చొప్పున మూడు లక్షలు అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఖమ్మం నియోజకవర్గానికి అదనంగా మరో వేయి గృహలక్ష్మి ఇండ్లు మంజూరు చేశారని, దీంతో నియోజకవర్గంలో 4 వేల ఇండ్లు గృహలక్ష్మి క్రింద మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. నగరంలోని ఇప్పటికి 2 వేల డబల్ బెడ్ రూమ్‌లు రూ. 120 కోట్లతో, రూ. 120 కోట్లు గృహలక్ష్మి పథకానికి, మొత్తంగా రూ. 240 కోట్లు ప్రభుత్వం అందజేసిందని ఆయన అన్నారు.



జీవో 58 క్రింద నగరంలో దాదాపు 5 వేల మంది పేదలకు ఇండ్ల స్థల పట్టాలు ఇస్తున్నట్లు ఇట్టి స్థలం ధర రూ. 250 కోట్లకు తక్కువ ఉండదని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఒక్క ఖమ్మం నగరంలోని ఇండ్లు, ఇండ్ల స్థలాలకు రూ. 500 కోట్లు అందించిందని ఆయన అన్నారు. గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని, ప్రతి అర్హులైన పేదవారికి పథక లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ఐటి, పురపాలన శాఖ మంత్రి కే. తారకరామారావు ఈ నెల 30న జిల్లాలో పర్యటించి, రూ. 1266 కోట్ల అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేయనున్నట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివాసం వుంటున్నవారికి జీవో 58 ఒక వరప్రసాదమని అన్నారు. తర తరాలుగా ఉంటున్న ఇప్పటివరకు ఆ స్థలంపై హక్కు లేక, ఏ రోజు తమ స్థలం పోతుందో అని భయంగా వుండేవారన్నారు. అట్టి వారి స్థితిగతులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి హక్కు కల్పించాలనే సంకల్పంతో జీవో 58 క్రింద రెగ్యులరైజ్ చేయాలని ఆదేశించిందన్నారు. ప్రతి లబ్ధిదారుని వద్దకు వెళ్లి, విచారణ చేసి, లబ్ధిదారులచే దరఖాస్తు చేయించి వారికి పట్టా వచ్చేలా జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు కృషి చేసినట్లు, ప్రక్రియ పూర్తి పారదర్శకంగా చేపట్టినట్లు తెలిపారు. జీవో 58 అమలులో ఖమ్మం జిల్లా ముందంజలో ఉందని, గృహలక్ష్మి పథక మంజూరులు లబ్దిదారులకు అందజేయడం జిల్లాలోనే ప్రారంభం అయినట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో 315 మందికి జీవో 58 పట్టాలు, 215 మందికి గృహలక్ష్మి పథక మంజూరు ఉత్తర్వులు మంత్రి చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్కుమార్, డి.సి.సి.బి చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఏఎంసి చైర్ పర్సన్ దోరేపల్లి శ్వేత, నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, డిప్యూటీ కమీషనర్ మల్లీశ్వరీ, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, ఖమ్మం అర్బన్ తహశీల్దారు స్వామి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చెవులు కదిలిస్తున్న వినాయకుడు

- భక్తులను పరవశింపజేస్తున్న వైనం
- సబ్ ఇంజనీరు మణికుమార్ ప్రతిభకు మంత్రం ముద్దులగుతున్న భక్తులు

కల్లూరు, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయకుని విగ్రహాలతో జరుగుతున్న నష్టాన్ని ప్రజలకు అవగాహన కల్పించడం, పర్యావరణమే పరిరక్షణగా మట్టి విగ్రహాలను తయారుచేసి ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సత్తుపల్లి మండలంలోని గంగారం లోని విధులు నిర్వహిస్తున్న సబ్ ఇంజనీరు పూరేటి మణికుమార్ వినూత్నంగా



గణపతుని చెవులు కదిలించేలా, ఆయన వాహనమైన మూషికాలు వాయిద్యాలు వాయించే వి.దంగా, కొండమీద నుంచి పాలతో శివలింగానికి సరాసరి అభిషేకం చేస్తున్నట్లుగా సృష్టించిన తీరు మండలంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన ఇంజనీర్ ప్రతిభను పర్యావరణని పరిరక్షించాలనే సంకల్పాన్ని తెలియజేస్తూ, మట్టి విగ్రహాన్ని తయారుచేసి భక్తులను ఆకట్టుకున్నారు. మణికుమార్ ప్రతిభకు మండలంలోని భక్తులు కదిలే విగ్రహాలను చూడడానికి తండోపతండాలుగా వస్తున్నారని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. భవిష్యత్తులో మరెన్నో వి



నూత్నమైన, ఆకర్షణీయమైన, జ్ఞానవంతమైన టెక్నాలజీని వాడుకొని ప్రజలకు అవగాహన కల్పిస్తానని ఆయన తెలిపారు.పూరేటి మణికుమార్ హైదరాబాదులోని బాలాపూర్‌లో తయారు చేయబడిన గణేష్ విగ్రహం చెవులు, కళ్ళు కదిలించే విధంగా తయారుచేసిన విగ్రహాన్నికి వాడిన సాంకేతిక నన్ను ఆకట్టుకుందని అన్నారు. దాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుతం వినాయకుని చెవులు, మూషికాలు వాయిద్యాలు వాయించే విధంగా, శివలింగానికి పాలాభిషేకం చేసే విధంగా కదిలే విగ్రహాలను తయారు చేశానని, భవిష్యత్తులో చెవులు, కళ్ళతో పాటు వినాయకుడు భక్తులను ఆశీర్వదించే విధంగా నూతన టెక్నాలజీతో విగ్రహాలు తయారు చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో నూకల శ్రీనివాసరావు, ఇల్లూరి రవి, కే రామచంద్రరావు, పి మణికుమార్, ఏ నరసింహారావు, కే రాజేష్, వి రాకేష్, ఆర్ హరి, వై సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపిలు పరిమితికి మించి వైద్యం చేయరాదు

- ప్రభుత్వ వైద్యులు రేవంత్



ఆళ్లపల్లి, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): వాతావరణ పరిస్థితులలో మార్పుల కారణంగా ఏజెన్సీ ప్రాంతాలలో విషజ్వరాలు ప్రబలుతున్నయని ఆర్ఎంపి వైద్యులు వారి పరిమితులో వైద్య అందిం చాలని పరిమితికి మించి వైద్యం చేయరాదని ప్రభుత్వ వైద్యులు అర్వపల్లి రేవంత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆర్ఎంపి వైద్యులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపి వైద్యులు జ్వర పీడితులకు వారి పరిధిలో వైద్యం అందించాలనీ మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, జ్వర కేసులను వచ్చిన వారిని స్థానిక ప్రభుత్వం వైద్యశాలకు పంపించాలని ఎవరైనా పరిమితికి మించిన వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, ఎస్సై రతీష్, ఆర్ఐ, వైద్య సిబ్బంది, ఆర్ఎంపీ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీపీ




ఏన్కూరు, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ఎంపీపీ ఆరేం వరలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో వేణుమాధవ్ అధ్యక్షతన డెంగ్యూ, సీజనల్ వ్యాధులపై మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలని, చెత్తా చెదారాన్ని, మురికి నీటిని తొలగించాలని కొబ్బరి బోండాల్లో, టైర్లలో, నీటి తొట్లలో నీరు నిల్వ లేకుండా చూడాలని, డ్రైనేజీలు శుభ్రం చేయాలని కోరారు. దోమల నివారణా చర్యలు ముమ్మరంగా చేయాలని, తద్వారా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు అరికట్టవచ్చని అన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి సీజనల్ వ్యాధులను అరికట్టాలని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బాదావత్ బుజ్జి, ప్రభుత్వ వైద్యాధికారి రాములు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రూ.17కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి వేముల

బాల్కొండ, సెప్టెంబర్ 23 (మనం న్యూస్): నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం అంక్సాపూర్, పడగల్ గ్రామాల్లో సుమారు 17 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అంక్సాపూర్, పడగల్ గ్రామాల ప్రజలు మంత్రికి గ్రామస్థులు, డప్పు చప్పుళ్లతో, టపాసులు కాలుస్తూ మహిళలు మంగళ హారతులతో అఖండ స్వాగతం పలికారు. అంక్సాపూర్ సంత మల్లన్న దేవాలయాన్ని మంత్రి సందర్శించి మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 25లక్షల రూపాయల వ్యయంతో సంత మల్లన్న దేవాలయం షెడ్‌కు శంకుస్థాపన చేసిన ఆయన, 2.20 కోట్ల వ్యయంతో సంతమల్లన్న దేవాలయం గిరి ప్రదక్షిణ రోడ్‌కు, 8.10 కోట్ల వ్యయంతో అంక్సాపూర్ నుండి వేల్పూర్ డబుల్ లైన్ రోడ్, 40 లక్షల రూపాయల వ్యయంతో అంక్సాపూర్ నుండి వడ్డెర కాలనీ వయా సంత మల్లన్న రోడ్ పనులకు, 20 లక్షల వ్యయంతో హెల్త్ సబ్ సెంటర్ పనులకు, 15 లక్షల పోచమ్మ దేవాలయం నిర్మాణ పనులు శంకుస్థాపన, 30 లక్షల వ్యయంతో హనుమాన్ దేవాలయం నిర్మాణ పనుల శంకుస్థాపన పడగల్ గ్రామంలో హైవే నుండి పడగల్ వరకు బిటి రోడ్ రిన్వల్ పనుల శంకుస్థాపన 1.74 కోట్లు వ్యయం, పడగల్ బిటి రోడ్‌పై 9/0 -2 కి.మీ వద్ద మైనర్ బ్రిడ్జి నిర్మాణ పనులు శంకుస్థాపన 1.40 కోట్ల వ్యయం, పడగల్ గ్రామ బిటి రోడ్ పై 10/2 కి.మీ వద్ద స్లాబ్ కల్వర్టు నిర్మాణ పనులు 40 లక్షల వ్యయంతో శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అంక్సాపూర్, పడగల్ గ్రామ అభివృద్ధి చూస్తుంటే మనసుకు ఎంతో ఆనందం కలుగుతున్నదని హర్షం వ్యక్తం





చేశారు. ఈ గ్రామంలోనే 39 కోట్ల అభివృద్ధి చేశామని 750 మందికి 11 కోట్ల రూపాయల పెన్షన్లు ఇస్తున్నామని తెలిపారు. సొంత జాగ ఉండి ఇండ్లు లేని అర్హులైన పేదలకు విడతల వారీగా, నిరంతరాయంగా గృహ లక్ష్మి కింద 3లక్షలు ఇస్తామని వెల్లడించారు. కేసిఆర్ తోనే తెలంగాణ పల్లెల్లో అసాధారణ అభివృద్ధి సాధ్యమయ్యిందని,కాళేశ్వరం నీళ్లతో ఊర చెరువులు కళకళ లాడుతున్నాయని అన్నారు.అభివృద్ధి,పాడి పంటలు,కుల వృత్తులకు చేయూతతో గ్రామాలు సంబురంగా మారాయన్నారు.కెసిఆర్ సంపద సృష్టించి..పేదలకు పంచుతున్నాడన్నారు. 36 వేల కోట్ల రైతు రుణమాఫి ఘనత ఒక్క కేసిఆర్ కే దక్కుతుందని, దేశంలో ఏ ముఖ్యమంత్రి ఇంత సాహసం చేయలేదని అన్నారు. రైతు బంధు లాంటి పథకంతో రైతులకు ఆర్థిక భరోసా ఇయ్యాలన్న కనీస ఆలోచన ఏ నాయకుడు చేయలేదన్నారు. కానీ ఇప్పుడు మేము కేసిఆర్ కంటే ఎక్కువ చేస్తామని అగ్రాసు పాట తీరుగా పథకాలు ప్రకటిస్తున్నారని కాంగ్రెస్ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసిఆర్ వి గట్టి చేతలు..కాంగ్రెస్ వి ఉట్టి మాటలని, రామ - రావణ యుద్ధంలో మిగిలిన రాక్షసులు కొంత మంది మనిషి రూపంలో గ్రామాల్లో ఇంకా తిరుగుతున్నారని ఎద్దేవా చేసారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల కథ కూడా ఎంపి అర్వింద్ బాండ్ పేపర్ లాంటి ఉత్తి మాటే అని విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ కు హైకమాండ్ ఢిల్లీ వయా బెంగుళూరు అయితే,బీజేపీ కి హైకమాండ్ ఢిల్లీ వయా గుజరాత్ అని అన్నారు. కానీ కేసిఆర్ కు తెలంగాణ ప్రజలే హైకమాండ్ అని స్పష్టం చేశారు. తెలంగాణ బిడ్డ కేసిఆర్ కు తెలంగాణ ప్రజల సంక్షేమమే ముఖ్యమని చెప్పారు. ఓట్ల కోసం మాయమాటలు చెప్పే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని,గోస పడ్డ జీవితాల్లో వెలుగులు నింపిన కేసిఆర్ కు తోడుగా నిలబడాలని మంత్రి వేముల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కోటపాటి నర్సింహ నాయుడు,స్థానిక ప్రజాప్రతినిధులు,ఆర్డీవో వినోద్‌కుమార్, ఏసిపి జగదీష్ చందర్,పలువురు మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం

- సీనియర్ కాంగ్రెస్ నాయకులు సునీల్ కుమార్



భీంగల్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగి, అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి జరుగుతాయని సీనియర్ కాంగ్రెస్ నాయకులు సునీల్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని పల్లికొండ గ్రామంలో పల్లె పల్లెకు గుండె గుండెకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టికి అండగా ఉండి గెలిపించాలని కోరారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పేరు చెప్పి రైతులకు రావాల్సిన అన్ని సౌకర్యాలు రాకుండా మోసం చేసిందని ఆరోపించారు. ధాతిన్యం కొనుగోలు విషయంలోనూ రైతులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం 15వేల రూపాయలకు పెంచుతామని తెలిపారు. అలాగే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఆడబిడ్డలకు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, భూమి లేని ఉపాధి కూలీలకు సంవత్సరానికి 12000, ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని తెలిపారు. ఇళ్ళు లేని వారికి ఇళ్ళు కట్టుకోవడానికి 5 లక్షల సాయం అందిస్తామని తెలిపారు. ఈసారి కాంగ్రెస్ పార్టికి అవకాశం ఇచ్చి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించిన కానిస్టేబుల్ సస్పెన్షన్

నిజామాబాద్ క్రైమ్, సెప్టెంబర్ 23. (మనం న్యూస్): నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ శనివారం పోలీస్ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రూరల్ పోలీస్ స్టేషన్‌కు ఓ మహిళ ఫిర్యాదు చేసేందుకు రాగా, విధులు నిర్వహిస్తున్న మహేష్‌బాబు సదరు మహిళ ఫోన్ నెంబర్ తీసుకొని అనుచితంగా వ్యవహరించాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆమె నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణకు ఫిర్యాదు చేసింది. దీనికి స్పందించిన సిపి వివిధ కోణాల్లో విచారణ చేపట్టిన అనంతరం సదరు కానిస్టేబుల్ మహేష్ బాబును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఘనంగా వినయ్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు



ఆర్మూర్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): అర్మూర్ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు ప్రొద్దుటూరి వినయ్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవనాథ సిద్దుల గుట్టలోని నవనాథ సిద్దేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్



బోధన్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా వండి పెడుతున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తోన్న సమ్మె శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 2022 మార్చి 15న వంట కార్మికులకు చెల్లిస్తున్న నెల జీతం మూడు వేల రూపాయలకు పెంచి చెల్లిస్తామని ప్రకటించి, ఇప్పటికీ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. పెంచిన జీతం కోసం కార్మికులు ఆందోళనలు చేయగా 2023 ఫిబ్రవరి 3న జీవో నంబర్ 8ని విడుదల చేశారని,కానీ ఇప్పటికీ కార్మికులకు పెంచిన జీతాలను చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకటన చేసినప్పటి నుండి ఇప్పటి వరకు బకాయిలతో సహా చెల్లించాలని మల్లేష్ డిమాండ్ చేశారు. కార్మికులకు రావలసిన పెండింగ్ బిల్లులు,పెండింగ్ వేతనాలు,కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు నియమాక పత్రాలు అందించి గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు.25 రూపాయలు స్లాబ్ రేటు ఇవ్వాలని, కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు చెల్లించాలని, ప్రతినెల 5వ తేదీన బిల్లులు వేతనం చెల్లించాలని మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా నాయకురాలు రెహానా బేగం, ఏఐపికేఎస్ జిల్లా నాయకులు పడాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను తిప్పికొడుతాం

- కొప్పు పార్థసారధి



నిజామాబాద్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడేందుకే 142 జీఓను అమలు చేసేందుకు కుట్ర పన్నుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రభుత్వ ఉద్యోగులు తిప్పుకొడతారని జిల్లా మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కొప్పు పార్థసారథి అన్నారు. తక్షణమే 142 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పార్థసారథి మాట్లాడుతూ ఎండా, వాన, చలి అనకుండా నిరంతరం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఎంతో శ్రమిస్తామన్నారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులపై ఇలాంటి హీనమైన చర్యలకు పాల్పడితే రాబోయే రోజుల్లో ఈ పార్టీలకు తగిన బుద్ధి చెప్తామని ఆయన హెచ్చరించారు. ఈ 142 జీవోను అమలు చేసేందుకు ప్రయత్నిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగస్తులు సమ్మె బాట పట్టడం ఖాయమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పోషెట్టి చింతల శ్రావణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్యాణి పాల్గొన్నారు.

## గద్దర్ జహీర్ స్మారక స్ఫూర్తి సదస్సుకు వేలాదిగా తరలి రావాలి

- సదస్సు వేదికగా అమరుల ఆశయాల సాధనకు ప్రతినభూనుదాం
- ప్రజా ఉద్యమాలకు సదస్సును ప్రేరణగా నిలుపుతాం
- విలేకర్ల సమావేశంలో ప్రజా సంఘాల క్య వేదిక నాయకులు



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 23, (మనం ప్రతినిధి): కొత్తగూడెం క్లబ్బులో 24న జరిగే గద్దర్, జహీర్ స్మారక స్ఫూర్తి సదస్సుకు ప్రజలు, ప్రజాస్వామ్య, లౌకిక వాదులు, మేధావులు వేలాదిగా తరలి రావాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు, సదస్సు నిర్వాహకులు కోరారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవం నందు శనివారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తమతుది శ్వాసవరకు ఆట, పాట, మాట, రచనలతో ప్రజలను చైతన్యవంతం చేస్తూ తమకు జరుగుతున్న అన్యాయాలలపై, అకృత్యాలపై, దోపిడీ, పీడనలపై ప్రశ్నించే, నిలదీసే తత్వాన్ని నేర్పిన మహోన్నత వ్యక్తులు గద్దర్, జహీర్ అని పేర్కొన్నారు. ఈ సదస్సును వేదికగా చేసుకొని ఏజెన్సీ ప్రాంతాలకు, కార్మిక, శ్రామిక వర్గాలకు నెలవై వున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజానీకానికి ప్రేరణ కల్పించే లక్ష్యంతో, లౌకిక ఆలోచన వైపు నడిపించేందుకు, సద్ధస్సును వేదికగా చేసుకొని అమరుల ఆశయాల సాధనకు ప్రతినబునెందుకు జిల్లా స్థాయి స్మారక స్ఫూర్తి సదస్సు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిధులుగా కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, సిపిఐ జిల్లా కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, వీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రొఫెస్సర్ కోదండరాం, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు సాదినేని వెంకటేశ్వరరావు, ఆవునూరి మధు, ఆత్మీయ అతిధులుగా ప్రొఫెసర్లు కంచె ఐలయ్య, ఖాసీం, డాక్టర్ వెన్నెల, జయరాజు, అందె శ్రీ, పాశం యాదగిరి తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా గాయకులు, రచయితలచే కళాకారులచే ఆటా, పాట, మాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు ఎస్ కే సాబీర్ పాషా, అన్నవరపు కనకయ్య, నిర్వహణ కమిటీ కన్వీనర్ జెబీ శౌరి, టిజెఎస్ జిల్లా నాయకులు తాళ్లూరి వెంకటేశ్వర్ రావు, మల్లెల రామనాధం, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు కూసపాటి శ్రీనివాస్, బత్తుల కృష్ణయ్య, కల్లోజి శ్రీనివాస్, సుగుణారావు, రత్న, వై. శ్రీనివాసరెడ్డి, చంద్రగిరి శ్రీనివాస రావు, గడ్డం రాజశేఖర్, కె రత్నకుమారి, వెంకట్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం చేయాలి

- ఎంపీపీ మెండెం లలిత

మధిర, సెప్టెంబర్ 23(మనం న్యూస్): సీజనల్ వ్యాధులు ప్రత్యేకించి డెంగ్యూ రహిత మండలం గా జులను తీర్చిదిద్దాలని ఎంపీపీ మేడం లలిత అధికారులను కోరారు. శనివారం మండలంలోని సీజనల్ సీజనల్ వ్యాధుల ప్రభావం నియంత్రణపై మండలంలోని టాస్క్ ఫోర్స్ కమిటీ అధికారులతో కలిపి ఆమె తన కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్స్ లోపరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, ప్రతిరోజు డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. నీరు నిలువకుండా చూడాలని, కిటికీలకు జాలీలను అమర్చి, విద్యార్థులకు శుభ్రతపై ఆరోగ్య అవగాహన కల్పించాలని కోరారు. కిషోర బాలికలకు శుభ్రతపై ఆరోగ్య అవగాహన కల్పించాలని, అన్ని హాస్టల్స్ లో గ్రామపంచాయతీ మున్సిపాలిటీ సహకారంతో ఫాగింగ్ చేయించాలని, విద్యార్థులు ఎవరైనా జ్వరం బారిన పడితే ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్య పరీక్షలు చేయించాలని, నెలకి రెండుసార్లు హాస్టల్స్ నందు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలనిఅన్నారు. డెంగ్యూ రహిత మండలం గా తీర్చిదిద్దాలని, ప్రతి ఒక్కరూ తమ ఇంటినందు డ్రై డే కార్యక్రమాలు చేసుకొని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేస్తూ స్వచ్ఛతే హిజయతే కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేపించారు.ఈ సమావేశంలో ఎంపీడీఓ షేక్ సిలార్ సాహెబ్, డాక్టర్ పృథ్వీ, సిడిపిఓ శారద, వివిధ హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్స్, ఐకేపీ, మిషన్ భగీరథ, శిశు సంక్షేమ శాఖ, మాటూరుపేట, దెందుకూరు, మధిర వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పురపాలక సంఘంలో వైద్య శిబిరం





భీంగల్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): భీంగల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం శానిటేషన్ వర్కర్లు, మహిళా గ్రూప్ సభ్యులకు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్,. కమిషనర్ జి. రాజేందర్., ఐదవ వార్డు కౌన్సిలర్ బోదిరె నర్సయ్య. ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ సతీష్ గౌడ్. మల్లెల ప్రసాద్, ఏడీఎంసి అధికారి నందన్ రెడ్డి (మెప్మా )ఏఎన్ఎం సాయమ్మ, ఆశ వర్కర్ లు స్వప్న, లహరి, వసంత, మెప్మా ఆర్పీలు జలజ, వాసంతి లు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 50వ రోజుకు చేరిన నిజాం షుగర్ కార్మికుల దీక్ష

- సంఘీభావం తెలిపిన శివసేన నాయకులు



బోధన్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 50 వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా శివసేన పార్టీ నాయకులు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ శివసేన ఉపాధ్యక్షుడు జాకారం మధు బాబు, శివసేన ప్రధాన కార్యదర్శి బండారు పల్లి కిరణ్ కుమార్, సీనియర్ నాయకులు పాండవుల భూమన్న,రాజు,శ్రీకాంత్,శ్రీను,అనిల్, బివిఎస్ నాయకులు లోకేష్ గౌడ్, లింగం, కిరణ్, ఆకాష్, కార్మికులు రఘునాథ్, శ్రీనివాస్, కె. మంగ్య, ఎస్కె. షరీఫ్, అన్వర్, మోహిన్ బేగ్‌లు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన పెయింటర్స్ అసోసియేషన్ సభ్యులు



నిజామాబాద్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): నిజామాబాద్ పెయింటర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గణేష్ గుప్తా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జనరంజక పాలన చూసి ప్రజలు బి.ఆర్.ఎస్ పార్టీకి జై కొడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీ లో చేరుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్, బిఆర్ఎస్ నాయకులు సిర్ప రాజు, దండు శేఖర్, సూదం రవి చందర్, పెయింటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాశపోగు అనీల్, సభ్యులు సంజీవ్ గౌడ్, నర్సింలు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలకు బియ్యం అందించిన మేడపాటి

- నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు వందల క్వింటాళ్ల బియ్యం పంపిణి




బోధన్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): వినాయక చవితి నవరాత్రోత్సవాల సందర్భంగా బోధన్ నియోజకవర్గంలో ప్రతిష్టించిన గణేష్ మండపాల నిర్వాహకులకు బిజెపి నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి శనివారం ఎంపిఆర్ ఫౌండేషన్ తరపున బియ్యాన్ని అందించారు. నియోజకవర్గంలోని బోధన్ టౌన్, నవీపేట్, సాలూర, ఎడపల్లి, రెంజల్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో అన్నదాన కార్యక్రమ నిర్వహణ కోస 50కిలోల బియ్యం చొప్పున మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా 400 క్వింటాళ్ల బియ్యం అందించారు. దీంతో పాటు పలు మండపాలకు నగదు రూపంలో విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిజెపి జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, వివిధ మండలాల అధ్యక్షులు కొలిపాక బాలరాజు, ప్రవీణ్, ఇంద్రకరణ్, సరిన్, మనోహర్, గోపికృష్ణ, జడ్పిటిసి సభ్యులు మేక విజయ సంతోష్, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కుంబళనూరులో 2వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం



కౌతాళం, సెప్టెంబర్ 23, (మనం న్యూస్ ) : కౌతాళం మండల పరిధిలోని కుంబళనూరు గ్రామ సచివాలయం పరిధిలోని కుంబళనూరు మరియు కుంబళనూరు క్యాంప్-2 గ్రామాలలో మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై. ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో 2వ రోజు గడప గడపకు మనం ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరిగింది, అనంతరం వారు ప్రతి గడపకు వెళ్లి లబ్ధిదారులతో ప్రభుత్వం తరపున అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ అర్హత ఉండి కూడా ఇంకా పథకాలు అందకపోతే అలాంటి వారికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా తక్షణమే అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ, గ్రామంలో తమ దష్టికి వచ్చిన సమస్యలకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 20 లక్షల రూపాయల నిధులతో అభివద్ధి పనులు చేపడతామని ప్రదీప్ రెడ్డి తెలిపారు, కార్యక్రమంలో గ్రామ సర్పంచులుసుందరమ్మ మరియు కే.వీరేష్, ఎంపీటీసీ ముత్తన్న, ఆయా గ్రామ నాయకులు అనిల్, బుచ్చయ్య, చక్రవర్తి, రామస్వామి, మండల నాయకులు, ప్రహల్లాద ఆచారి, ఉరుకుంద ఈరన్నస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ నాగరాజుగౌడ, ఎంపీపీ అమరేశ, కో ఆప్షన్ మెంబర్ మాబు సాబు, రామన్నగౌడ, ఏకాంరెడ్డి, ఎంపిడివో సుబ్బరాజు, పిఆర్ ఏఈ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి శేషాద్రి,పంచాయతీ కార్యదర్శి యోగీశ్వర రెడ్డి, వివిధ గ్రామాల వైఎస్ఆర్సిపి నాయకులు చన్నబసప్ప, మరెగౌడ, సోమశేఖర, బసప్పగౌడ, పాండు, మరెప్ప, శివరాం, వివిధ గ్రామాల నాయకులు ఎంపీటీసీలు, సర్పంచులు, పాల్ దినకర్, మహేష్, లింగన్నగౌడ, ముకన్న, గ్రామ సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కన్వీనర్లు, వైఎస్ఆర్సిపి అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం



గోనెగండ్ల, సెప్టెంబర్ 23, (మనం న్యూస్) : మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఎస్సి కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గుడిసె నాగరాజు (38)శుక్రవారం రోజున ఆరోగ్యంబాగోలేకమృతి చెందడం జరిగింది.ఎమ్మిగనూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు డాబివి జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు విషయం తెలుసుకున్న గోనెగండ్ల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వారి కుటుంబనికి ఆర్థిక సహాయం అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారు మాట్లాడుతూ మతుని కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో గోనెగండ్ల మండల నాయకులు కన్వీనర్ నజీర్ సాబ్,తిరుపతయ్య నాయుడు, పూజారి చంద్రశేఖర్, రమేష్ నాయుడు, పోలకల్ వెంకటేశ్వర్లు, వినోద్, మదీన, మారేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదలందరికీ ఇళ్లపై సమీక్ష నిర్వహించిన ఎంపీడీవో సుబ్బరాజు



కౌతాళం, సెప్టెంబర్ 23, (మనం న్యూస్ ) : జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు,శనివారం రోజున కౌతాళం ఎంపిడివో కార్యాలయం నందు నవరత్నాలు - పేద లందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌లతో హౌసింగ్ కార్యక్రమాలపై సమేక్షా సమావేశం నిర్వహించిన ఎంపిడివో సుబ్బ రాజు, డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ (హౌసింగ్) లాల్ కష్ణయ్య,మండల ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాస రెడ్డి,హాజరైన ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ నూర్ బాషా,సూర్య ప్రకాష్ రెడ్డి,నళిని,వెంకట జ్యోతిర్మయి, డాట ఎంట్రీ ఆపరేటర్ కళ్యాణ్, శ్రీ వరసిద్ధి వినాయక కన్స్ట్రక్షన్ ప్రతి నిధులు పెంచల్ రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగినది.

## సచివాలయంలో ఆధార్ సీడింగ్ కార్యక్రమం



డోన్ ,సెప్టెంబర్ 23, ( మనం న్యూస్): డోన్ పట్టణ కమిషనర్ ఆదేశాల మేరకు 10వ సచివాలయంలో ఆధార్ సీడింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఆధార్ కార్డులో ఏవైనా తప్పులుంటే లేక కొత్తగా శిశు ఆధార్, అడ్రస్, పేర్ల మార్పిడి, ఫోటో మార్పిడి, జిల్లా మార్పిడి, లాంటి సేవలు వినియోగించుకోవాలని కోరారు. 10వ సచివాలయం పరిదిలోని 16 మరియు 17 వార్డ్ ప్రజలకు వాలంటీర్లు ఆధార్ సేవలు వినియోగించు కోవాలసిందిగా గడప గడపకు వెళ్లి ప్రజలకు తెలపడం జరిగింది. వార్డ్ ప్రజలు ఆధార్ కార్డులో ఉన్న చిన్న చిన్న తప్పులు సరి చేయించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ ఎడ్యుకేషన్ అస్సిసెంట్ భాస్కర్, సచివాలయ సిబ్బందులు సచివాలయ అడ్మిన్ విన్నీల, వార్డ్ డేటా ప్రాసెసింగ్ రంజిత్, మహిళ పోలీస్ యశోద, నాగార్జున పాల్గొన్నారు.

# మురికి కాలువలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ

- అధికారుల నిర్లక్ష్యమా
- లబ్ధిదారుల అవివేకమా





నందికొట్కూర్, సెప్టెంబర్ 23, (మనం న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలనిస్తోంది. ప్రభుత్వ ఆశయం నెరవేరుతోంది. పేదరికంతో గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో రక్తహీనతకు గురవుతున్నారు. వారికి పుట్టిన బిడ్డలు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం అదనపు పౌష్టికాహారం అందించాలని నిర్ణయించింది. రెండేళ్ల కిందట వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలులోకి తెచ్చింది. గర్భిణులకు గతంలో ఇచ్చే పప్పు, పాలు, గుడ్లకు అదనంగా మరో ఆరు రకాల పోషక పదార్థాలను అందించడంతో వారిలో రక్తహీనత తగ్గుతోంది. ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తున్నారు.గర్భిణులకు 'సంపూర్ణ పోషణ' గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తోంది. కిలో రాగిపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల వేరుశనగ చక్కి, కిలో జొన్నపిండి, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల ఎండు ఖర్జూరం, 3 కిలోల ఫోర్టిఫైడ్ రైస్, అరకిలో నూనె, అరకిలో పప్పు, 5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లతో కూడిన కిట్లను అందజేస్తోంది. వీటన్నింటినీ డ్రైరేషన్‌గా లబ్ధిదారులకు ప్రతీనెలా సరఫరా చేస్తోంది.పిల్లల ఆరోగ్యం కోసం. ఏడు నెలల నుంచి మూడేళ్ల వయస్సుగల పిల్లలకు నెలకు రెండున్నర కిలోల బాలమతం, రెండున్నర లీటర్ల పాలు, 25 కోడిగుడ్లను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం సమకూర్చుతోంది. మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని వంటచేసి పిల్లలకు వడ్డిస్తోంది. మెనూ ఇది.చిన్న పిల్లలకు సోమవారం, గురువారాల్లో పౌష్టికాహారం, కూరగాయల కూర, సాంబారు, కోడిగుడ్డు కూర, వంద లీటర్ల పాలు, మంగళవారం, శుక్రవారా ల్లో పౌష్టికాహారం, పప్పు, తోటకూర, కోడిగుడ్డు, 100 ఎంఎల్ పాలు, బుధ, శనివారాల్లో పౌష్టికాహారం, వెజిటబుల్ రైస్, పులిహోర, గోంగూర కూర, కోడిగుడ్డు, 100 ఎంఎల్ పాలుతో కూడిన మెనూను అమలు చేస్తున్నారు. మా బాబు బరువు పెరిగాడు,మా బాబు చాలా తక్కువ బరువు ఉండేవాడు. మొదటి సంవత్సరం మా అబ్బాయి బరువు 8 కేజీలు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం, బాలామతం, పాలు తదితర బలవర్ధక పదార్థాలతో పౌష్టికాహారంతో ఆరోగ్యం గర్భిణిగా మూడో నెలనుంచి మాకు సమీ పంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పథకం కింద పౌష్టికాహారం తీసుకుంటున్నాను. ప్రభుత్వం నాణ్యమైన ఆహారాన్ని పంపిణీ చేస్తోంది. ప్రతీనెల అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే వివిధ రకాల పోషకాహార వస్తువులను క్రమంతప్పకుండా తీసుకుంటున్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద బాలింతలకు. గర్భిణీలకు పౌష్టిక ఆహారం అందించడానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది. ప్రతినెల గర్భిణీలకు. బాలింతలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా అంగన్వాడి ఆయలు వీధి వీధి ఇంటి ఇంటి తలుపు తట్టి పౌష్టికాహారం అందించడానికి పిలుపునివ్వడం జరుగుతుంది. ప్రియమైనప్పటికీ కూడా ఈరోజు రాజుల సొమ్ము రాళ్లపాలు. ప్రభుత్వ సొమ్ము. మురికి కాల్వ పాలు అన్నచందంగా పరిస్థితి ఏర్పడిందని గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైందో ఏమో కానీ నంద్యాల జిల్లా నందికొట్కూరు తాలూకా బ్రాహ్మణ కొట్టుకూరు గ్రామంలో గౌరు వెంకటరెడ్డి ఇంటి సమయం లో ఉన్నటువంటి మురికి కాలువలో దాదాపుగా 50 నుండి 60 పాల ప్యాకెట్లు దర్శనమివ్వడం ప్రజలకు కొసమెరుపుగా కనిపిస్తుంది. మురికి కాలువలో వైయస్సార్ సంపూర్ణ పోషణ. వైయస్సార్ సంపూర్ణ పోషణ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు ఏడు నెలల నుండి, ఐదు సంవత్సరాల, వారికి గర్భవతులకు బాలింతలకు పోషకపదార్థాలు అందిస్తారు. కానీ అర్హులకు సరిగా చేరడం లేనట్లు ఉంది. ఎందుకనగా పంపిణీ చేయవలసిన పాల ప్యాకెట్లను మురికి కాలువలో వేయడం చాలా విచారకరం. ఇన్ని పాల ప్యాకెట్లు కాల్వపాలు చేయడం సరైన పద్ధతి కాదని గ్రామంలో ఉన్నటువంటి నిరుపేద బాలింతలు గర్భిణీలు ఆహ్వానం వ్యక్తం చేస్తున్నారు. పాల ప్యాకెట్లు లబ్ధిదారులు మాత్రం మురికి కాలువలో పారేసే పరిస్థితి లేదు కానీ ప్రభుత్వం అధికారులు గమనించి ఇలాంటి తప్పిదం ఎప్పుడు జరగకుండా చూడటం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా ఈ యొక్క పథకము లబ్ధిదారులకు చేరవేయవలసిందిగా బ్రాహ్మణ కొట్కూరు ప్రజలు కోరుకుంటున్నారు. ఈ పథకం కొరకు ప్రభుత్వము కోట్లు వేచించి ఆఖరుకు వీటిని మురికి కాలువలో పాలు చేయడం ఎంతవరకు సబబు. పలువురు ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారి వివరణ కోసం ప్రయత్నించగా సరైన సమాధానం చెప్పకుండా బస్సులో ప్రయాణిస్తున్నాను అని చేతులెత్తేశారు.

## మోడీ మతోన్మాద విధానాలను వ్యతిరేకించండి

- సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి




బేతంచేర్ల, సెప్టెంబర్ 23, మనం న్యూస్ : నరేంద్ర మోడీ ప్రభుత్వం మతోన్మాద కార్పొరేటీ వ్యతిరేకించాలని సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. రమేష్ కుమార్ ఏ .నాగరాజు అన్నారు బేతంచర్ల పట్టణంలోని కొలుములపల్లి రోడ్డులో గల చౌడేశ్వరి దేవి ఆలయము ఆవరణమునందు సిపిఎం పార్టీ కార్యకర్తలకు రెండు రోజుల శిక్షణా తరగతులు సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు మండల కార్యదర్శి ఆర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది మొదటిరోజు దేశ రాష్ట్ర ప్రస్తుత రాజకీయ పరిస్థితులు-ఆర్థిక వ్యవస్థలపై టి. రమేష్ కుమార్ బోధించడం జరిగింది ఈ శిక్షణా తరగతుల్లో రమేష్ కుమార్ నాగరాజు బోధిస్తూ మోడీ ప్రభుత్వం వచ్చి 9 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చేసిన వాగ్దానాలు అమలు చేయకపోగా ప్రజల పైన ధరల భారాన్ని పెట్రోలు డీజీలు వంట గ్యాస్ వంట నూనెలు అన్ని రకాల నిత్యావసర వస్తువులు కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపాడు ప్రకతి వనరులు ప్రభుత్వ రంగ సంస్థలు ఆదానీ అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు కార్చోకగా అప్పజెప్పి దేశాన్ని వారికి తాకట్టు పెట్టాడు ప్రతీ సంవత్సరం బడ్జెట్లో రెండు లక్షల కోట్ల రూపాయలు రుణాలను కార్పొరేట్లకు రద్దు చేస్తూ వారి చెల్లించాల్సిన పన్నులను కూడా తగ్గించి వారికి ఊడిగం చేస్తున్నాడు మరోవైపు రైతుల ఎరువుల పైన సబ్సిడీలు తగ్గించి ఆహర సబ్సిడీ తగ్గించి ఫుడ్ కార్పొరేషన్ ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులు ఆత్మహత్యలకు కారణం అవుతున్నాడు దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రతరమవుతున్నది ఇప్పటికే 9 శాతం పైగా నిరుద్యోగులు ఉద్యోగాలు లేక వలసలు పోతున్నారు ఉపాధి నిధులు కూడా తగ్గించి ఉపాధి కూలీల పొట్టను కొట్టాడు చిన్న ఫ్యాక్టరీలు వేలాదిగా మూతపడుతున్నాయి మరో వైపు మైనార్టీల పైన దళితులపైన క్రిస్టియన్ల పైన దాడులు పెరిగాయి ప్రతిపక్ష పార్టీల పైన రాజ్యాంగ సంస్థల చేత దాడులు చేస్తున్నారు మణిపూర్ మరణ మేం ఇంకా మండుతూనే ఉన్నది ఈ ప్రభుత్వ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం కూడ సమర్థిస్తూ కేంద్రానికి బాసటగా నిలుస్తున్నది మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజల పైన వేల కోట్ల రూపాయల విద్యుత్తు భారాలు మోపుతున్నది ఇంటి పనులు నీటి పనులు చెత్త పనులు పేరుతో ప్రజల పైన భారం మోపుతున్నది రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచి వేసింది ప్రజా ఉద్యమాల పైన నిర్బంధం కొనసాగిస్తున్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరును కార్మికులు నిరుద్యోగులు ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యపరిచి పోరాటాలకు సిద్ధం చేయాల్సిన బాధ్యత మన అందరి పైన ఉంది అని వారన్నారు కనుక దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో ప్రజలందరూ చైతన్యం కావాలని పిలుపునిచ్చారు ఈ శిక్షణ తరగతుల్లో సీనియర్ నాయకులు వై. ఎల్లయ్య పార్టీ కార్యకర్తలు ఆర్ వెంకట్ లక్ష్మి పుష్పావతి సుజాత లోకేష్ బనగానపల్లె సుబ్బయ్య మద్దిలేటి స్వామి రాజబాబు నరసింహ నాగరాజు వెంకటరమణ ఎస్ కే భాష శేషు అర్జున్ డ్రైవర్ రాజు మధు రహంతుల్లా రంగాపురం నాగేంద్రమ్మ, రామాంజనమ్మ సమోసా వల్లి బాకర్ష తదితరులు పాల్గొన్నారు.

## కోడుమూరు ఎమ్మెల్యే డా. సుధాకర్‌కు కృతజ్ఞతలు

- ఆంధ్రప్రదేశ్ బంజారా ధర్మసేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు.రాజా రామ్ రత్నావత్



కర్నూలు, సెప్టెంబర్ 23, (మనం న్యూస్) : స్థానిక బిర్లా కాంపౌండ్ కర్నూలు బంజారా ధర్మసేన కార్యాలయం నందు 2021 సంవత్సరంలో కర్నూలు రూరల్ రుద్రవరం గ్రామంలో నందనపల్లి తాండకు సంబంధించిన గిరిజన రైతులు దాదాపుగా 113 ఎకరముల పొలమును నవరత్నాల భాగంగా ప్రజాప్రయోజనాల కోసమై ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం వారు ఎకరమునకు 18 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించింది.నందనపల్లి తండా గిరిజన రైతులు ఆనందంగా తమ పొలంను ప్రజాప్రయోజనాల కొరకై ఇవ్వడం. అదేవిధంగా ప్రభుత్వం వారు ఎకరముకు 18 లక్షల రూపాయలు చెల్లించిన దానికై అప్పట్లో సంతోషం వ్యక్తం చేశారు .దాదాపుగాజి 90% రైతులకు నష్టపరిహారం అందింది కానీ ఇంకా కొంతమంది రైతులతో సంతకాలు చేయించుకొని నష్టపరిహారం అందించలేదు ఇప్పటికీ రెండు సంవత్సరాలు అయింది.రెండు సంవత్సరములు కావస్తున్న పొలమును ప్లాట్ల రూపంలో మార్చి లబ్ధిదారులకు పట్టాలు రూపంలో మంజూరు చేశారు కానీ రైతులకు ఇంకా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇవ్వలేదు కలెక్టర్ కార్యాలయము ఆర్డిఓ కార్యాలయము ఎమ్మార్వో కార్యాలయము తిరిగి గిరిజన రైతులు అలిసిపోయారు కానీ వారు చెప్పే సమాధానం ఒక్కటే ప్రభుత్వం నుంచి బడ్జెట్ లేదు ప్రభుత్వం బడ్జెట్టు కేటాయిం చకుంటే మేము ఎలా ఇవ్వాలి అనే సమాధానం తప్ప మరి వేరే సమా ధానం లేదు ఈ సమాధానం చెప్పి చేతులు దులుపుకుంటూ వచ్చారు. మా బాధను మా నియోజకవర్గం ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్‌కి విన్న వించుకున్నాము ఈ సమస్యపై స్పందించి మీకు ఎలా గైనా నష్టపరిహారం అందించే విధంగా నేను చూస్తానని మాట ఇచ్చారు. తక్షణమే ఈమ ధ్య అసెంబ్లీ సమావేశంలో ఈ విషయం పై. అసెంబ్లీ సమావేశంలో మాగిరి జన రైతులకు ఇంకా నష్టపరిహారం అం దలేదని ప్రస్తావించడం మాకు చాలా సంతోషం ఇచ్చింది. వారికి మా గి రిజన రైతుల తరపున బంజారా ధర్మసేన తరపున రుణపడి ఉంటాము. ప్రభుత్వం ఈ విషయం పరిగణలోకి తీసుకొని మా అమాయక గిరిజనులకు అందవలసిన నష్టపరిహారం త్వరగా అందించాలని కోరుకుంటున్నాము. కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సుధాకర్‌కి మా నందనపల్లె శుభాలు తాండ గిరిజన రైతుల తరపున ధన్యవాదాలు తెలుపుతూ కతజ్ఞతలు.

## స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను పూర్తి చేయండి

- పెండింగ్లో ఉన్న భూ హక్కు పత్రాలు వెంటనే పంపిణీ చేయండి
- రెవెన్యూ అంశాలలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేధించండి



నంద్యాల, సెప్టెంబర్ 23, (మనం న్యూస్): సర్వే పూర్తయిన గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను సోమవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డిలు మండల తాసిల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో భూసేకరణ, పిఓఎల్ఆర్ రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, భూ హక్కు పత్రాల పంపిణీ తదితర రెవిన్యూ అంశాలపై తాసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారు సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే కార్యక్రమంలో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాలలో పెండింగ్ ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను సోమవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని మండల తాసిల్దార్లను ఆదేశించారు. భూ హక్కు పత్రాల పంపిణీకి సంబంధించి సీసీఎల్ఏ ప్రత్యేక దష్టి సారించిందని. ఈ నేపథ్యంలో పెండింగులో ఉన్న 50 గ్రామాల్లో సోమవారం లోగా భూహక్కు పత్రాలు పంపిణీ చేయాలన్నారు.జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 167కె జాతీయ రహదారికి సంబంధించి పెండింగ్లో ఉన్న 10 గ్రామాల అవార్డ్స్ ను పాస్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత మండల తాసిల్దార్ లను ఆదేశించారు. వెలుగోడులో 2 గ్రామాలు, నంద్యాల 4, బండి ఆత్మకూరు 2, ఆత్మకూరు 2 గ్రామాలలో పెండింగ్లో ఉన్నాయని అవార్డ్స్ ప్రక్రియను పూర్తి చేసి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అన్ని మండలాల్లో పెండింగ్ లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రెవిన్యూ అంశాలను కాల పరిమితి లోపు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేయాలని అన్ని మండలాల తాసిల్దారులను ఆదేశించారు.ఈ సమావేశంలో లో డిఆర్ఓ పుల్లయ్య, సంబంధిత డివిజన్, మండలాల ఆర్డీవోలు, తాసీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్లు, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## 11వ రోజు కొనసాగుతున్న టిడిపి నిరాహార దీక్షలు

నందికొట్కూరు టౌన్, సెప్టెంబర్ 23; (మనం న్యూస్): నందికొట్కూరు పట్టణంలోని నంద్యాల పార్లమెంట్ అధ్యక్షుడు మాండ్ర శివానందరెడ్డి, మరియు నందికొట్కూరు ఇన్చార్జి గౌరు వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పై కక్షతోనే రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్చార్జ్ జయ సూర్య, భాస్కర్ రెడ్డి, మతుజావలి, లాయర్ జాకీర్ హుస్సేన్, జమీల్, రసూల్ ఖాన్, గని, నిమ్మకాయల రాజు, మద్దిలేటి, మౌలానా అబ్దుల్ సలాం, ప్రవీణ్‌రగడ, తదిత టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నియంతపై పోరాటం కోసం మేము సైతం



నందికొట్కూర్, సెప్టెంబర్ 24, (మనం న్యూస్) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు నిరసనగా నియంతపై పోరాటం కోసం మేము సైతం చేస్తున్న నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి, నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, మరియు టిడిపి నందికొట్కూరు ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి, ఆధ్వర్యంలో నందికొట్కూరు టౌన్ టిడిపి నాయకులు, 11వ రోజు సామూహిక



నిరాహార దీక్షకు మద్దతు సంఘీభావం తెలియజేయన్న టిడిపి నందికొట్కూరు అసెంబ్లీ ఇంచార్జ్, గిత్త జయసూర్య నందికొట్కూరు, ముస్లిం మైనారిటీ నాయకులు, జమిల్ భాష, రసూల్ భాష ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సైకో పాలన ఇక మాకు వద్దు అని టౌన్ భాస్కర్ రెడ్డి, లక్ష్మి కాంత్ రెడ్డి, వడ్డే శ్రీను, షేక్ అబ్దుల్ సలాం, షేక్ ఇలియాజ్, షేక్ నూర్ అల్లూరు పాల బాబులు సోషల్ మీడియా ఇన్చార్జ్ ప్రవీణ్ కుమార్ నందికొట్కూరు టౌన్ ఐటీడీపీ అధ్యక్షులు మూర్తి జావలి, జమీల్ భాష, లాయర్ జాకీర్,గాజుల మన్సూర్ రసూల్ ఖాన్ టౌన్ భాస్కర్ రెడ్డి, లక్ష్మి కాంత్ రెడ్డి, వడ్డే శ్రీను, షేక్ అబ్దుల్ సలాం, షేక్ ఇలియాజ్, షేక్ నూర్ అల్లూరు పాల బాబులు ఆఫ్రిది, నూర్ తాఫిక్ జావీద్ రఫీ ఇర్ఫాన్ సోషల్ మీడియా ఇన్చార్జ్ ప్రవీణ్ కుమార్ మద్దతు తెలియజేయడమైనది.

## విద్యుత్ నిలిపివేత

- విద్యుత్ ఏడి మధుసూదన్ రెడ్డి

బేతంచేర్ల సెప్టెంబర్ 23, మనం న్యూస్ : మండలం పరిధిలో ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సంబంధించిన గ్రామాలకు విద్యుత్ సేవలు నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఏడి మధుసూదన్ రెడ్డి రూరల్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 1గ,,నుండి 6 గ,,30 నిమిషాల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని వారన్నారు కాబట్టి విద్యుత్ వినియోగదారులు, ఫ్యాక్టరీ ఓనర్లు ప్రతి ఒక్కరు సహకరించాలని వారు తెలిపారు.

# నా కాళ్లు చెప్పేంత వరకూ ఆడుతూనే ఉంటా..

## రిటైర్‌మెంట్ వార్తలపై రొనాల్డో



ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో సౌదీ అరేబియా క్లబ్ తరఫున ఇరగదీస్తున్నాడు. అల్ నస్రీ జట్టుకు విజయాలు అందిస్తున్నాడు. అల్ అహ్లీ జట్టుతో మ్యాచ్ అనంతరం కొందరు అతడి పనైపోయిందంటూ కామెంట్లు చేశారు. ఆ వార్తలపై స్పందించిన రొనాల్డో తన పని అయిపోలేదని, తన కాళ్లు అలసిపోయేంత వరకూ ఫుట్బాల్ను వీడనని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'చాలామంది రొనాల్డో పని అయిపోయింది అంటున్నారు. కానీ, అది నిజం కాదు. నా కాళ్లు అలసిపోయామని చెప్పేంత వరకూ నేను ఫుట్బాల్ ఆడుతూనే ఉంటా. ఎందుకంటే.. నేను ఇప్పటికీ ఆటను ప్రేమిస్తూనే ఉన్నా. అంతేకాదు గోల్స్ కొడుతున్నా. ఏళ్లుగా ఆడుతున్నా గెలవాలనే కసి కొంచెం కూడా తగ్గలేదు' అని 38 ఏళ్ల రొనాల్డో వెల్లడించాడు. నిరుడు ఖతర్లో జరిగిన ఫిఫా వరల్ కప్ అనంతరం ఈ మిడ్ఫీల్డర్ అల్ నస్రీ క్లబ్కు మారాడు. రెండేన్నర ఏళ్ల కాలానికి రూ 4 వేల కోట్ల ఒప్పందం చేసుకున్నాడు. అతడి రాకతో ఈ సౌదీ క్లబ్ విజయాల బాట పట్టింది. నస్రీ క్లబ్కు రొనాల్డో అరబ్ క్లబ్ చాంపియన్స్ కప్ ట్రోఫీ అందించాడు.

### 60 కోట్ల మంది ఫాలోవర్స్

ఫుట్బాల్ లెజెండ్స్లో ఒకడైన రొనాల్డో తన అద్భుత ఆటతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నాడు. ఈమధ్యే అతను ఇన్స్టాగ్రామ్‌లో ఏకంగా 600 మిలియన్ల ఫాలోవర్ల మార్క్ చేరుకు న్నాడు. అంటే.. అతడిని 60 కోట్ల మంది ఫాలో అవుతున్నారు. దాంతో, అత్యధిక మంది ఫాలోవర్స్ ఉన్న వ్యక్తిగా రికార్డు సృష్టించాడు.





# అట్టహాసంగా ఆసియా క్రీడలు ప్రారంభం..

## ప్రధాని మోదీ స్పెషల్ ట్వీట్!

ఆసియా క్రీడా సంబరం ప్రారంభమైంది. చైనాలోని హాంగ్జౌ వేదికగా అట్ట హాసంగా ప్రారంభోత్సవ వేడుకలు జరిగాయి. ఇప్పటికే కొన్ని గేమ్స్ ప్రారం భమైన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు అధికారికంగా క్రీడా సందడి మొద లైంది. చైనా ప్రధాని జింగ్‌పింగ్‌తోపాటు పలు దేశాల అధినేతలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత బాక్సర్ లవ్లీనా, హర్మన్ప్రీత్ సింగ్ (హాకీ కెప్టెన్) జాతీయ పతాకధారులుగా వ్యవహరించారు. నిఫ్ట్ (జాతీయ ఫ్యాషన్ టెక్నాలజీ) రూపొందించిన వస్త్రాలను అథ్లెట్లు ధరించారు.

### భారత ప్రధాని ట్వీట్...

ఆసియా క్రీడల ప్రారంభం సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ట్విటర్ వేదికగా (ప్రస్తుతం ఎక్స్) అథ్లెట్లకు శుభాకాంక్షలు చెప్పారు. పతకాలను గెలుచుకుని రావాలని ఆకాంక్షించారు. ''ఆసియా క్రీడా సంబరం ప్రారం భమైంది. భారత క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్. భారీ అథ్లెట్ల బృందం క్రీడల పట్ల అభిరుచి, సంకల్ప బలంతో మరిన్ని పతకాలను సాధించాలి. అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి నిజమైన క్రీడాస్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పాలి'' అని మోదీ ట్వీట్ చేశారు. 2022లో ఈ ఆసియా క్రీడలు జరగాల్సింది. చైనాలో కరోనా కేసులు కారణంగా ఓ ఏడాది వాయిదా వేశారు. అయినా వీటిని 2022 ఆసియా క్రీడలుగానే వ్యవహ రిస్తున్నారు. ఈసారి ఆసియా క్రీడల్లో భారత్ నుంచి 39 విభాగాల్లో దాదాపు 655 మంది అథ్లెట్లు పతకాల కోసం బరిలోకి దిగారు. మహిళల క్రికెట్లో ఆదివారం బంగ్లాదేశ్తో భారత్ సెమీస్లో తలపడనుంది. ఇక్కడ గెలిస్తే పతకం ఖాయ మవుతుంది. అక్టోబర్ 3న భారత పురుషుల క్రికెట్ జట్టు తలపడనుంది. 2018లో 70 (16 స్వర్ణాలు, 23 రజతాలు, 31 కాంస్యాలు) పతకాలు గెలిచిన భారత్.. ఈ సారి వంద పతకాలు సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో ఉంది.




# రెండో వన్డేలో భారీ తేడాతో గెలిచిన న్యూజిలాండ్

బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో న్యూజిలాండ్ స్పిన్నర్ ఇష్ సోధీ 6 వికెట్లతో చెలరేగాడు. దాంతో, కివీస్ 86 పరుగుల తేడాతో విజయం సాధించింది. బంగ్లా గడ్డపై 15 ఏళ్ల తర్వాత తొలి వన్డే విజయం ఖాతాలో వేసుకుంది. ఈ మ్యాచ్లో బ్లాక్ కాప్స్ స్పిన్నర్ సోధీ ఆల్రౌండ్ ప్రదర్శన చేశాడు. బ్యాటుతో 35 రన్స్ చేసిన సోధీ బంతితో బంగ్లా పని పట్టాడు. కెప్టెన్ ఫెర్గూసన్ 42వ ఓవర్లో ఖలీద్ అహ్మద్ను బౌల్ చేయడంతో బంగ్లా ఇన్నింగ్స్ ముగిసింది. దాంతో, కివీస్ మూడు వన్డేల సిరీస్లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ 254 పరుగులకే ఆలౌటయ్యింది. పర్యాటక జట్టులో టామ్ బండిల్(68), హెన్రీ నికోలస్(49) మాత్రమే రాణించారు. ఆతిథ్య జట్టు బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ మరో నాలుగు బంతు లు ఉండగానే కివీస్ కుప్పకూలింది. బంగ్లా బౌలర్లలో ఖలీద్ అహ్మద్, మహెదీ హసన్ మూడేసి వికెట్లు పడగొట్టారు. లక్ష్య ఛేదనలో బంగ్లా ఓపెనర్ తమీమ్ ఇక్బాల్(44), మహ్మదుల్లా(49) మాత్రమే రాణించారు. సోధీ దెబ్బకు మిడి లార్డర్ బ్యాటర్లంతా పెవిలియన్ చేరారు.

### మన్కడింగ్ తప్పించుకొని

ఈ మ్యాచ్లో ఇష్ సోధీ() మన్కడింగ్ తప్పించుకున్నాడు. కివీస్ ఇన్నింగ్స్ 46వ ఓవర్లో బంగ్లా బౌలర్ హసన్ మహ్మద్() నాన్ స్ట్రయిక్లో ఉన్న సోధీని మన్కడింగ్ చేశాడు. రివ్యూ చూశాక థర్డ్ అంపైర్ అతడిని రనౌట్గా ప్రకటిం చాడు. దాంతో, కొంత అసహనానికి గురైన సోధీ వెటకారంగా హసన్ను అభి నందించి పెవిలియన్ బాట పట్టాడు.

అయితే.. కెప్టెన్ లిట్టన్ దాస్, హసన్ కలిసి మన్కడింగ్ వెనక్కి తీసుకుంటున్నామని, సోధీని నాటౌట్గా పరిగణించాలని అంపైర్తో చెప్పారు. దాంతో, అంపైర్ వెంటనే సోధీని వెనక్కి పిలిచాడు. ఊహించని పరిణామం తో మొదట్లో షాక్ తిన్న సోధీ క్రీజులోకి వచ్చాక హసన్ను ప్రేమగా హత్తుకున్నాడు. ప్రస్తుతం ఈ వీడియో సోష్ల్ మీడియాలో వైరల్ అవుతోంది.



మనం సినిమా
manamcinema



# ప్రభాస్, నయనతార మరోసారి.!

ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా పలు భారీ చిత్రాలు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రాలు రిలీజ్ కోసం అభిమానులు ఎదురు చూస్తుండగా ప్రభాస్ టేకప్ చేస్తున్న లైనప్ అయితే మంచి ఎగ్జైటింగ్‌గా మారుతూ వస్తుంది. ఇదిలా ఉండగా మరోపక్క తమిళ స్టార్ హీరోయిన్ నయనతార లేటెస్ట్‌గా జవాన్‌తో భారీ హిట్ ని అందుకోగా మరి ఈ ఇద్దరిపై ఇంట్రెస్టింగ్ బజ్ ఒకటి వైరల్‌గా మారింది. దాదాపు 16 ఏళ్ళ కితం ఈ కాంబోలో యోగి సినిమా రాగ మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత ఈ ఇద్దరు కూడా కలిసి నటించనున్నట్టుగా టాక్ వచ్చింది. దీని ప్రకారం అయితే మంచు విష్ణు భక్త కన్నప్ప చిత్రం లో ప్రభాస్ మహాశివునిగా కనిపిస్తే తన భార్య పార్వతీ దేవిగా నయనతార కనిపించనుంది అని ఇప్పుడు టాక్ చక్కర్లు కొడుతోంది. దీనితో ఈ ఇంట్రెస్టింగ్ కాంబినేషన్ మరోసారి తెరపైకి వచ్చింది. మరి దీనిపై క్లారిటీ అధికారికంగా రావడమే బాకీ.

# అవకాశం వస్తే తప్పకుండా విరాట్ కోహ్లీ పాత్ర చేస్తాను



టాలీవుడ్ యువ నటుల్లో ఒకరైన రామ్ పోతినేని తాజాగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో నటించిన భారీ పాన్ ఇండియన్ మూవీ స్కంద. ఈ మూవీ పై అందరిలో భారీ అంచనాలు ఉన్నాయి. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన స్కందని శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాస చిట్టూరి గ్రాండ్ లెవెల్లో నిర్మించగా ఎస్ థమన్ సంగీతం అందించారు. సెప్టెంబర్ 28న స్కంద గ్రాండ్‌గా పలు భాషల్లో రిలీజ్ కానుండడంతో టీమ్ ప్రమోషన్స్‌ని ఫుల్ స్వింగ్‌లో నిర్వహిస్తోంది. ఇక తాజాగా ఒక ఇంటర్వ్యూలో భాగంగా హీరో రామ్ మాట్లాడుతూ, తనని చూసిన వారు ఎక్కువగా విరాట్ కోహ్లీ పోలికలు మీలో ఉన్నాయి అని అంటుంటారని అన్నారు. అయితే తనకు కూడా విరాట్ బ్యాటింగ్ అంటే ఎంతో ఇష్టం అని, ఒకవేళ అన్ని కలిసి వచ్చి విరాట్ బయోపిక్ చేయాల్సి వస్తే ఆయన పాత్రలో నటించడానికి నేను రెడీ అని అన్నారు రామ్. మరి అది ఎంతవరకు సాధ్య పడుతుందో తెలియాలి అంటే దానికి కాలమే సమాధానం చెప్పాలి.

# యానిమల్ నుంచి రష్మిక లుక్ వచ్చేసింది.!

ప్రస్తుతం బాలీవుడ్ సినిమా దగ్గర భారీ అంచనాలు పెట్టుకొని రిలీజ్‌కి రాబోతున్న మరో చిత్రమే యానిమల్. దర్శకుడు సంజీవ్ రెడ్డి వంగ హిందీలో చేస్తున్న రెండో సినిమా ఇది కాగా దీనిలో యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో రణబీర్ కపూర్ అయితే నటించాడు. మరి బాలీవుడ్‌లో నెకస్ట్ బిగ్ థింగ్ అవుతుంది అని సాలిడ్ హైప్ ఉన్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఒక ప్లానింగ్ ప్రకారం సినిమా అప్డేట్స్ ఇస్తుండగా లేటెస్ట్‌గా అయితే సినిమా హీరోయిన్ రష్మికా మందన్నా ఫస్ట్ లుక్‌ని అయితే రిలీజ్ చేశారు. మరి ఇందులో రష్మిక చీర కట్టులో చాలా సింపుల్ అండ్ హోమ్లీ లుక్స్‌లో కనిపిస్తుంది అని చెప్పాలి. దీనితో ఈ లుక్ కూడా మంచి అంచనాలు అందుకుంది. ఇక ఈ చిత్రానికి అయితే హర్ష వర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించగా టి సిరీస్ భద్రకాళి పిక్చర్స్ వారు సంయుక్తంగా నిర్మాణం వహించారు. అలాగే ఈ డిసెంబర్ 1 న భారీ లెవెల్లో పాన్ ఇండియా భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కాబోతుంది.




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500 037.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.